ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-4-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 80 పేజీలు: 12 వెల: 6.50

అమెరికాను దెబ్బతీస్తే సహించను: ట్రంప్
రాజీపడిన ఎన్నికల సంఘం: రాహుల్
9లో



**శక్తివంతమైన జాతిగా మన తెలుగుజాతిని నిలుపుదాం**

**ఇసుక, క్లీన్ ఎనర్జీ, నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎమ్ఎస్ఎంఇ పాలసీలను ప్రకటించాం**

**- సిఎం చంద్రబాబు**

## ప్రపంచ ఆవిష్కరణలకు వేదికగా ఏపి

**విజయవాడ, ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ఆవిష్కరణలకు, అవకాశాలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్నదే తన తపన అని, థింక్ గ్లోబల్లీయాక్ట్ - గ్లోబల్లీ విధానంతో రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దుకుందామని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం తెలుగు ప్రజల రక్తంలోనే ఉందన్నారు. దేశభక్తి చాటేలా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు చేయిచేయి కలుపుదామని తనతో పాటు, అందరూ ఇందులో భాగస్వాములు అయ్యేలా ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు తన కుటుంబసభ్యులతో కలిసి యూరప్‌దేశాల పర్యటనకు వెళ్లారు.ఆయన నిన్న యూరప్ పర్యనట్లో అంతర్భాగంగా అక్కడే కుటుంబసభ్యులతో కలిసి తన పుట్టిన రోజు జరుపుకున్నారు.ఆయనకు రాష్ట్రీయంగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అభినందనలు లభించాయి.వారందరికి సిఎం చంద్రబాబు సామాజిక మాధ్యమాల ద్వారా ధన్యవాదాలు తెలిపారు.నేటి అర్ధరాత్రి తరువాత యూరప్ పర్యటన ముగించుకుని ఆయన ఢిల్లీ చేరుకుంటున్న నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఆయన టిడిపి కార్యకర్తలకు,ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మనమంతా తిరుగులేని విజయాలు సాధించాలన్నారు. పేదరికం లేని సమాజం స్థాపించాలనేదే తన సంకల్పమని అందుకే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రతి సంపన్న వ్యక్తి పేదవాడి శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పేదరిక నిర్మూ టలన కోసం పీ4 తెచ్చామని చెప్పారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో పేదల జీవితాలు మార్చడం కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. 2047నాటికి ప్రపంచంలోనే శక్తివంతమైన జాతిగా తెలుగు జాతిని నిలపాలన్నదే తన అభిలాష అన్నారు. అందరికీ అవకాశాలు కల్పించేలా, ప్రతి పౌరుడి భవిష్యత్తుకు భరోసా నిచ్చేలా పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. అందరి ఆదరాభిమానాలు, నమ్మకం తనలో బాధ్యతను, నిబద్ధతను మరింత పెంచాయన్నారు. ప్రజల భవిష్యత్ కలలు, ఆకాంక్షల సాకారానికి నిరంతరం కష్టపడి పనిచేస్తానని మాటిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి, తెలుగు ప్రజల అభ్యున్నతికి పునరంకితం అవుతానన్నారు. స్వర్ణాంధ్ర2047 విజన్‌ను >>2



## పోప్ ఫ్రాన్సిస్ ఇక లేరు

### దీర్ఘకాలిక అస్వస్థతతో సుదీర్ఘ పోరాటం

**వాటికన్‌సిటీ, ఏప్రిల్ 21:** ప్రపంచ క్రైస్తవుల ఆరాధ్యదైవం పోప్ ఫ్రాన్సిస్ తుదిశ్వాస విడిచారని వాటికన్ వర్గాలు ప్రకటించాయి. పోప్ తన జీవితమంతా చర్చి సేవకు అంకితమయ్యారని వెల్లడించాయి. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో జన్మించిన ఆయన, 2013లో 266వ పోప్‌గా నియమితులయ్యారు. లాటిన్ అమెరికా దేశాల నుంచి పోప్‌గా నియమితులైన తొలి వ్యక్తిగా ఆయన నిలిచారు. పోప్ ఫ్రాన్సిస్ పేదల పట్ల ఎంతో దయతో ఉండేవారు. ఆయన పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శించేవారు, వాతావరణ మార్పుల పట్ల ఆందోళన వ్యక్తం చేసేవారు. చిన్నప్పుడే ఊపిరితిత్తుల్లోని ఓ భాగాన్ని తొలగించిన ఆయన తరచూ అస్వస్థతకు లోనవుతున్నారు. వాస్తవానికి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఫ్రాన్సిస్ యువకుడిగా ఉన్నప్పుడే ఆయన ఊపిరితిత్తుల్లోని ఓ భాగాన్ని తొలగించారు. 2025 ఫిబ్రవరిలో ఆయన శ్వాసకోశ సమస్యలతో జెమెల్లి ఆసుపత్రిలో చేరారు. అది డబుల్ న్యుమోనియాగా మారింది. ఆయన 38 రోజులపాటు ఆసుపత్రిలోనే ఉండి, తరువాత కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. అయితే తన అధికారిక నివాసానికి వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం, పోప్ ఫ్రాన్సిస్ సెయింట్ మేరీ మేజర్ బాసిలికాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ ఏప్రిల్ 20న ఆయన ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులకు సందేశం కూడా ఇచ్చారు. కాగా ఇప్పుడు 88 ఏళ్ల వయస్సులో ఆయన మరణించారు.పోప్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం ఈస్టర్ సందర్భంగా చాలా రోజు తర్వాత ఆయన ప్రజల్లోకి వచ్చారు. దాదాపు నెల రోజుల పాటు ఆసుపత్రి చికిత్స తర్వాత పోప్ మార్చి 24న తన నివాసం కాసా శాంటా మార్టాకు తిరిగి వచ్చారు. ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చిన తరువాత తనను చూడాటానికి వచ్చిన ప్రజలకు కూడా ఆయన ఆశీర్వాదం >>2

## జస్టిస్ మన్మథరావు కర్ణాటక హైకోర్టుకు బదలీ

### సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు ఉత్తర్వులు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్21:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులలో పనిచేస్తున్న ముగ్గురు న్యాయమూర్తుల బదలీ జరిగింది. సుప్రీం కోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ బదలీలను ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల ప్రకారం, తెలంగాణ నుంచి ఇద్దరు, ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఒక న్యాయమూర్తి ఇతర రాష్ట్రాల హైకోర్టులకు బదలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టులో సేవలందిస్తున్న న్యాయమూర్తులలో జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగాఉన్న జస్టిస్ కె. మన్మథరావును కూడా కర్ణాటక హైకోర్టుకు బదలీ చేశారు. ఈ బదిలీలకు సంబంధించి సుప్రీం కోర్టు కొలీజియం గతంలో సిఫార్సులు >>2

## ధరణి పరిరక్షణ సమష్టి బాధ్యత

### వైద్య, ఆరోగ్యమంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** ధరణి మాత ఆరోగ్య రక్షణ మనందరి సమష్టి బాధ్యత అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంత్రి కీలక వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టు చేసారు.మానవాళి సుఖజీవనాభిలాష నానాటికీ పెరుగుతుండటంతో తత్పర్యవసానంగా నిరంతర దాడులకు గురవుతుందన్నారు. దాంతో సమతుల్యం కోల్పోతూ అనునిత్యం ఆరోగ్య క్షీణతకు గురవుతున్న పుడమి తల్లి మౌనంగా రోదిస్తోంది. మానవాళితో పాటు లక్షలాది రకాల జంతువులు, పక్షులు, మొక్కలకు ఆశ్రయమిచ్చే ధరణి మాత బలహీనమవుతూ బేలగా మారుతోంది. ఎల్లలు లేని గనుల తవ్వకాలు, కనుమరుగవుతున్న పచ్చదనం, మాయమవుతున్న జీవ వైవిధ్యం, అడుగంటుతున్న భూగర్భ జలాలు, కలుషితమవుతున్న నదీ జలాలు, పెరిగిపోతున్న ఎడారీకరణ, విజృంభిస్తున్న వాయు కాలుష్యం, అతివేగంగా సంభవిస్తున్న పర్యావరణ మార్పులు మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో కబళించడానికి సిద్ధమవుతున్న సముద్ర జలాలు వంటి సమస్యలు ధరణి మాత ఉనికికి, తద్వారా మానవాళి మనుగడకు పెను సవాళ్లుగా మారుతున్నాయి. ఈ సమస్యల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని కల్పించి, సమిష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ ద్వారా భూ మాతను మరియు >>2



## తొలిసారి లక్షదాటిన బంగారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** బులియన్ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. చరిత్రలో ఎన్నడూలేని విధంగా బంగారం ధరలు చుక్కలనంటుతున్నాయి. సోమవారం బులియన్ మార్కెట్‌లో పదిగ్రాముల మేలిమి బంగారం పన్నులతో కలిపి లక్షరూపాయలకు చేరింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్యయుద్ధం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు బంగారంవైపే ఎక్కువ ఆసక్తిచూపుతున్నారు. ఈక్రమంలో అంతర్జాతీయ విపణిలో ఔన్స్ బంగారంధరలు సోమవారం 3405 డాలర్లుపలికింది. ఈ ధరల క్రమాన్ని అనుసరించి దేశీయంగా లక్ష రూపాయల మార్కును చేరింది. >>2



సోమవారం న్యూఢిల్లీలో అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 500 బిలియన్ డాలర్లు

### అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌తో ప్రధానిమోడీ భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** నాలుగురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సహకారంలో అన్ని కీలకరంగాల్లో నమోదయిన ప్రగతిని ఈసందర్భంగా ఇరువురునేతలు సమీక్షించారు. అమెరికా భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి మేలుచేసేవిధంగా చర్చలుజరిగాయని అనంతరం ప్రకటించారు. రెండుదేశాల ప్రజల శ్రేయస్సును ఆకాంక్షించే చర్చలు కూడా చోటు చేసుకున్నట్లు తెలియవచ్చింది. ప్రధానిగా ఇంధన రంగం, రక్షణ, వ్యూహాత్మక అధునాతన టెక్నాలజీలు ఇతర కీలక రంగాల్లో రెండుదేశాల పరస్పర సహకారం, వాణిజ్యం అంశాలే వీరిమధ్య చర్చకు వచ్చాయని తర్వాత అధికారిక >>2

## అనంతబాబు డ్రైవర్ కేసుపై ఎబివి ఆరా!

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 21(ప్రభాతవార్త) :** వీధి సుబ్రహ్మణ్యం కేసులు సిట్‌కు అప్పగించి సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని విశ్రాంత డిజిపి ఎబి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్సీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోరు డెలివరీ చేసిన కేసు వివరాలు తెలుసుకునేందుకు ఆయన కాకినాడ జిల్లాకు విచ్చేశారు. సోమవారం ఉదయం పెదపూడి మండలం జి మామిడాడ గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను కలసి ఆయన వివరాలు సేకరించారు. వారితో కలిసి కాకినాడ వచ్చి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి >>2

## ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష



ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రుల బృందం

**విజయవాడ, ఏప్రిల్21, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడి మే 2నఅమరావతి రాజధాని పనులు పునః ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం విజయవాడలోని జలవనరుల శాఖ రైతు శిక్షణా కేంద్రంలో మంత్రుల బృందం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించింది. ఈసందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమానికి వచ్చే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో ముఖ్యంగా ఆహారం, తాగునీరు వంటి వసతుల కల్పనలో ఎంత మాత్రం రాజీ పడరాదని అధికారులకు స్పష్టం చేశారు.

ప్రధాని సభా ప్రాంగణానికి చేరుకునే రహదారులను మెరుగుపరచాలని మంత్రి కేశవ్ అధికారులకు స్పష్టం చేశారు.రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ ప్రధాని పర్యటన రోజు ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలని పోలీస్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు.ప్రధాని సభకు వచ్చే సామాన్య ప్రజలకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం రాజీ పడవద్దని స్పష్టం చేశారు. వరకూ చాలా గ్రామీణ రహదారులై ఉన్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. >>2

## రేపు పదవ తరగతి పరీక్ష ఫలితాలు

**విజయువాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదలకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఏప్రిల్ 23వ తేదీన ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అధికారిక వెబ్ సైట్, వాట్సాప్ (మన మిత్ర), లీప్ యాప్‌లలో ఫలితాలు చూసుకోవచ్చని వివరించారు. మార్చి 2025, ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ పదో తరగతితోపాటు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. ఆ రోజు ఉదయం 10.00 గంటలకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఫలితాలను అధికారిక వెబ్ సైట్లు,'మన మిత్ర' (వాట్సాప్), ఎల్ఇఎపి మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఇక అభ్యర్థులు ఫలితాలను వాట్సాప్‌లో 9552300009 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని..వారి రోల్ నంబర్‌ను నమోదు చేయడం ద్వారా వారి ఫలితాల పిడిఎఫ్ కాపీని పొందవచ్చు. అలానే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఎల్ఇఎపి మొబైల్ యాప్ ఉపాధ్యాయులు, విద్యార్థుల లాగిన్‌ల ద్వారా కూడా ఫలితాలు పొందే సౌలభ్యం కలిగించినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ >>2

## హైకోర్టులో వంశీకి మళ్లీ చుక్కెదురు

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** భూ కబ్జా కేసుకు సంబంధించి వైఎస్సార్సీ నాయకుడు,మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీకి హైకోర్టులో చుక్కెదురయింది. ఈ కేసులో ఆయన దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. కేసుకు సంబంధించి ప్రభుత్వంనుంచి ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో, కేసును హైకోర్టు వారం పాటు వాయిదా వేసింది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి విజయవాడ జైల్లో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వంశీపై ఈ కేసుతో పాటు గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కేసు, సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసిన కేసు కూడా ఉన్నాయి.

## 'సిట్' అదుపులో కసిరెడ్డి



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డిని (కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి) సిట్ పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న సిట్ పోలీసులు, విజయవాడ తీసుకువస్తున్నారు. ఇప్పటికే సిట్ విచారణకు హాజరవుతున్నట్లు రాజ్ కసిరెడ్డి ఆడియో విడుదల చేసారు. విచారణకు హాజరవుతున్నట్లు సిట్ అధికారులకు రాజ్ కసిరెడ్డి సమాచారం ఇచ్చారు. రాజ్ కసిరెడ్డి దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చినట్లు తెలుస్తోంది.

**మంగళవారం ఉదయం సిట్ విచారణకు:**

ఎపి మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గత కొంత కాలంగా పోలీసులకు ఆచూకీ తెలియకుండా ఆయన తిరుగుతున్నారు. తాజాగా ఇవ్వాళ మధ్యాహ్నం కసిరెడ్డి మరో ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల సమయంలో సిట్ విచారణకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. >>2

## జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### 8 మంది మావోయిస్టుల హతం

### మృతుల్లో మావోయిస్టు అగ్రనేత వివేక్



మరణించిన వివేక్ (ఫైల్)

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** మావోయిస్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఓవైపు ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర బలగాలు వరుసగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని ముప్పేట కట్టడి చేస్తున్న తరుణంలో జార్ఖండ్‌లోని బొకారోలో సోమవారం ఉదయం నక్సల్స్ స్థావరంపై సిఆర్‌పిఎఫ్ బలగాలు జరిపిన దాడిలో ఎనిమిది మంది మావోయిస్టులు మరణించారు. మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరైన ప్రయాగ్ మాంజి అలియాస్ వివేక్ సహా ముగ్గురు వున్నట్లు జార్ఖండ్ డిజిపి అనురాగ్ గుప్తా మీడియాకు తెలిపారు. జార్ఖండ్‌లోని బొకారో జిల్లా లాల్‌పానియా ప్రాంతంలోని లుగు పర్వతాల వద్దగల అటవీ ప్రాంతంలో నక్సలైట్ల >>2

22-4pg2exHMNWJQE.qxd:22-4pg2exHMNWJQE.qxd 01/01/01 9:44 AM Page 1





రాజస్థాన్‌లోని బికనీర్‌లో సోమవారం బెంగాల్ అల్లర్లను నిరసనగా విహెచ్‌పి కార్యకర్తలు ప్రదర్శన చేస్తున్న దృశ్యం

### మా పాలసీలు వెయ్యేళ్ల

# భవిష్యత్తుకు ప్రణాళికలు

### సివిల్ సర్వీసెస్ డేసందర్భంగా ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 21:** తమ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, తాము తీసుకుంటున్న నిర్ణయాలు.. దేశ భవిష్యత్తును మరో వెయ్యేళ్ల పాటు తీర్చిదిద్దనున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 17వ సివిల్ సర్వీసెస్ డేసందర్భంగా ఆయన ప్రసంగించారు. భారత్‌లో ఆశావాహ సమాజం ఆశయాలు.. అసాధారణ రీతిలో నెరవేరుతుంటున్నాయని, ఆ కలల్ని నిజం చేసేందుకు అమితమైన వేగంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. సమగ్ర దేశాభివృద్ధి ముఖ్యమని, ప్రతి గ్రామం.. ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడిని వదలకుండా అభివృద్ధి సాగాలన్నారు. ప్రభుత్వ స్కీములు ప్రజలకు చేరిన తీరును బట్టి.. పరిపాలనా నాణ్యత తెలుస్తుందన్నారు. ప్రజలకు అన్ని స్కీములు చేరితే అప్పుడు ఆ ప్రభావం గ్రౌండ్ స్థాయి నుంచి మారుతుందన్నారు. గత పదేళ్లలో భారత్ అసాధారణ రీతిలో మార్పులను చవిచూసిందన్నారు. పరిపాలన, పారదర్శకత, ఆవిష్కరణ అంశాల్లో భారత్ కొత్త ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. ఐటి టెక్నాలజీ యుగమని, అయితే వ్యవస్థలను సమర్థవంతంగా మేనేజ్ చేయడమే పరిపాలన అని ప్రధాని తెలిపారు. భారతదేశ సమగ్ర అభివృద్ధి అంటే ఏ గ్రామం, ఏ కుటుంబం, ఏ పౌరుడూ వెనుకబడి ఉండకూడదు అని మోడీ పేర్కొన్నారు. మన బ్యూరోక్రసీ, విధాన రూపకల్పన అవుట్‌డేటెట్ వ్యవస్థల ఆధారంగా పనిచేయదు. అందుకే ఈ రోజు మా ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు రానున్న 1000 సంవత్సరాల భవిష్యత్‌ను ప్రభావితం చేస్తాయని మోడీ అన్నారు. భారతదేశంలో యువత, రైతులు, మహిళలు, వారి కలలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి, అసాధారణమైన వేగం చాలా అవసరం అని ప్రధాని అన్నారు. ప్రభుత్వ పథకాలు ఎంతగా ప్రజలకు అందుతున్నాయో, క్షేత్రస్థాయిలో వాటి నిజమైన ప్రభావం ఎంత ఉందో అన్నదానిని బట్టి, పాలనలో నాణ్యత తెలుస్తుంది. గత పదేళ్లలో భారతదేశం క్రమానుగతంగా పెరుగుతున్న మార్పును దాటి, ప్రభావవంతమైన పరివర్తనను చూసింది.

# డ్రైవర్ కేసుపై ఎబివి ఆరా!

>> బాధిత కుటుంబానికి ఇంకా అందవలసిన ఆర్థిక సహాయం గూర్చి చర్చించారు. జిల్లా ఎస్పీని కలిసి కేసు పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అప్పటి ఎస్.పి,ఇన్చార్జి, డి.ఎస్.పి రెగ్యులర్ డి.ఎస్.పి,మరియు టూ టౌన్, సర్పవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సక్రమంగా కేసు విచారణ చేయిపట్టలేదని అప్పటి ఛార్జ్ సీటు చూస్తే తేటతెల్లమైందన్నారు. ఈ కేసును సిట్ కప్పగించి మొదటి నుంచి దర్యాప్తు చేసి దోషులను గుర్తించి అరెస్టు చెయ్యాలన్నారు. నిరక్ష ్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్, సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు వీధి సత్యనారాయణ, వీధి నూకరత్నం,తమ్ముడు వీధి నవీన్ కుమార్, ఆర్పిఐ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిళ్ల శ్రీనివాసరావు, చైతన్య ఆర్గనైజేషన్ అధ్యక్షులు కడలి సత్యమూర్తి, కడలి కిషోర్, కోడి కత్తి శీను తదితరులు పాల్గొన్నారు.

# 500 బిలియన్ డాలర్లు

>> ప్రకటన వెలువరించారు. జాతీయ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అంశాలు కూడా వీరిమధ్య చర్చకు వచ్చాయి. చర్చల్లోభాగంగానే ప్రధాని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ భారతపర్యటనకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. గతంలో 2013లో జోబైడెన్ ఉపాధ్యక్షుడుగా ఉన్న కాలంలో మాత్రమే అమెరికా ఉపాధ్యక్షుల పర్యటన జరిగింది. ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత ఉపాధ్యక్ష హోదాలో జెడివాన్స్ భారత్ తొలిపర్యటనగా చెప్పువచ్చు. 2030 నాటికి రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయించారు. నాలుగురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన జెడివాన్స్ దంపతులకు ఎయిర్‌పోర్టులో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టులోనే గౌరవవందనం స్వీకరించిన తర్వాత అక్కడినుంచి బయలుదేరి న్యూఢిల్లీలోనే ఉన్న స్వామినారాయణ్ మందిరాన్ని సందర్శించారు. భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా వారసత్వ సంపదకు చిహ్నంగా అక్షరధామ్ ఆలయాన్ని నిర్మించారని వాన్స్ వ్యాఖ్యానించారు. ఆలయ ప్రాంగణంలో పొందుపరిచిన సామరస్యం కుటుంబ విలువలు కాలాతీత జ్ఞానం వంటి సందేశాలను చూసిన వాన్స్ ఉషావాన్స్ నిర్మాణ నైపుణ్యాన్ని అభినందించారు. ఈ పర్యటన అమెరికా, భారత్‌లమధ్య ఉన్న సంబంధాలను బలోపేతంచేయడానికి కొనసాగుతున్న విశ్వాసం శాంతి ఐక్యత ఉమ్మడి విలువలను పెంపొందిస్తాయని వారన్నారు. ఈ అందమైన ప్రదేశానికి నన్ను నా కుటుంబాన్ని స్వాగతించడంలోనే మీ ఆతిథ్యం, దయకు మీ అందరికీ ధన్యవాదాలని మీరు ఖచ్చితత్వం, శ్రద్ధతో అందమైన ఆలయాన్ని నిర్మించడం భారత దేశానికి గొప్ప ఘనతను సాధించిందన్నారు. మోడీతో జరిగిన భేటీలో విదేశాంగమంత్రి జైశంకర్, కార్యదర్శి విక్రమం మిస్రీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, అమెరికాలో భారత రాయబారి వినయ్‌మోమణ్ క్వాత్రాలు ఉన్నారు. భేటీ అనంతరం ప్రధాని ఇచ్చిన విందుకు జెడివాన్స్ దంపతులు హాజరయ్యారు. ప్రధాని నివాసానికి వచ్చిన వాన్స్ కుటుంబాన్ని ప్రధానిమోడీ సాదరంగా ఆహ్వానించి తోడ్కొనివెళ్లారు. అనంతరం అక్కడినుంచి జయపురకు వెళ్తారని విదేశాంగశాఖ ప్రకటించింది. విలాసవంతమైన రాంభాగ్‌ప్యాలెస్ హోటల్‌లో బసచేస్తారు. అబర్‌కోట సందర్శన అనంతరం ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రసంగిస్తారు. ట్రంప్ హయాంలో భారత్, అమెరికా విస్తృత సంబంధాలపై మంగళవారం జరిగే సదస్సులో ఉపన్యసిస్తారు. 23న వాన్స్‌కుటుంబంతోకలిసి ఆగ్రాకు వచ్చి తాజ్‌మహల్, భారతీయ కళలకు సంబంధించినశిల్పాగ్రామ్‌ను సందర్శిస్తారు. తిరిగి 24న జయపురకువెళ్లే వాన్స్ అక్కడినుంచే అమెరికా బయలుదేరి వెళతారు.

# వేదికగా ఎపి

>> ప్రజల మద్దతు, సహకారం, సమిష్టి కృషితో ఆ కలను నిజం చేస్తామన్నారు. సమాజంలో అసమానతలు పోవాలని పేదరికి వర్గాల మధ్య అంతరాలు తగ్గాలని సిఎం వివరించారు. ప్రజాసేవ చేసేందుకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చిన తెలుగు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో తెలుగువారు ఉన్నారని వారంతా మార్గదర్శి బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రానికి ఎంత రెవెన్యూ వస్తే అంత మొత్తాన్ని సంక్షేమానికి ఖర్చు చేయిస్తున్నని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు."ఎక్స్" వేదికగానే సిఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై కీలక సమాచారాన్ని వెల్లడించారు.ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని స్పష్టం చేసారు. సూపర్ సిక్స్ పథకాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాబోయే రోజుల్లో ఎక్కువ మూలధన వ్యయం చేస్తామన్నారు. ఆదాయం మార్గాలను అన్వేషిస్తామన్నారు. మళ్లీ అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం చేస్తామని అన్నారు. మూడుసార్లు సిఎంగా ఉన్నప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు వస్తున్నాయి. ఇప్పటికీ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కంట్రోల్‌లోకి రాలేదు. ఆర్థిక వ్యవస్థ మరింత దారి తప్పకుండా గాడిన పెడతామని సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. కేంద్రం ఆదుకోబట్టే కొంతమేరకు ముందుకెళ్తున్నాం. అమరావతి, పోలవరం పనులు సాగుతున్నాయి. స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇచ్చారు అని ముఖ్యమంత్రి తెలిపారు. సుదీర్ఘమైన కసరత్తు చేసి రాష్ట్ర భవిష్యత్తు కోసం స్వర్ణాంధ్ర 2047 విజన్ ను సిద్ధం చేశాం. అప్పటికి వృద్ధి రేటు 15 శాతం నమోదైతే తలసరి ఆదాయం 45,787 డాలర్లకు చేరుతుందన్నారు. ఎపికి 15 శాతం పైగా గ్రోత్ రేట్ సాధిస్తేనే రాష్ట్ర అభివృద్ధి. ప్రజల ఆకాంక్షలు నెరవేరతాయి. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. తొలి 100 రోజుల్లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్న విషయం గమనించాలన్నారు. 204పైగా అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5లకే పేదలకు భోజనం పెడుతున్నాం. మెగా డిఎస్సీని ప్రకటించాం. రాష్ట్రాభివృద్ధికోసం ఉచిత ఇసుక, క్లీన్ ఎనర్జీ, నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎమ్ఎస్ఎంఈ పాలసీలను ప్రకటించాం. ఉద్యోగులకు సమయానికి పెన్షన్లు, జీతాలు అందిస్తున్నాం. రాష్ట్ర సొంత ఆదాయం 2018-19కి 17.10 శాతం ఉంటే 2022-23కి 9.80 శాతానికి పడిపోయింది. ప్రభుత్వ అప్పులు 16.5 శాతం పెరిగాయి. రెవెన్యూ లోటు 2018-19 మధ్య 13.4 శాతం ఉంటే 2022- 23కి 16.2కు పెరిగింది. కార్పొరేషన్ల ద్వారా కూడా అప్పులు చేశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు మళ్లించారు. గత ప్రభుత్వం పెట్టిన పాత బకాయిలు రూ.22,252 కోట్లు విడుదల చేశాం. ఇంకా చెల్లించాల్సినవి చాలా ఉన్నాయి. 10 నెలల కాలంలో ప్రత్యేక దృష్టి పెట్టి రూ.6,35,568 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. దీని ద్వారా 4,10,125 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎన్నికల ముందు మేము చెప్పిన 20 లక్షల ఉద్యోగాల కోసం కసరత్తు చేస్తున్నామన్నారు.గూగుల్ వంటి ప్రముఖ సంస్థల రాకతో 10 లక్షల కోట్ల వరకూ పెట్టుబడులు వస్తాయి. అన్ని వ్యవస్థలను పునరుద్ధరించి పరుగులు పెట్టించేలా కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. స్కూళ్లు తెరిచే నాటికి తల్లికి వందనం పథకం అమలు చేసేలా ప్రణాళికలు చేపట్టారు. ఎటువంటి జాప్యం లేకుండా కార్పొరేట్ వైద్యం అందేలా హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుపై బడ్జెట్ లో ప్రస్తావించారు. ఈ ఏడాదిలోనే 25 లక్షలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా పథకం అమలు చేయనున్నామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవను కొనసాగిస్తూనే ఆరోగ్య బీమా పథకం అమలు చేస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 7 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. టిడ్కో ద్వారా 2 లక్షల ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం నిమిత్తం ఎస్సీలకు అదనంగా 50 వేలు, ఎస్టీలకు అదనంగా 75 వేలు ఇవ్వనున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు అందించే సాయాన్ని 10వేల నుంచి 20 వేలకు ప్రభుత్వం పెంచింది. దీపం 2.0 కింద నిధుల కేటాయించారు. ఆదరణ పథకం పునఃప్రారంభించిన కూటమి ప్రభుత్వం, నిధులు కేటాయింపునకు కట్టుబడి ఉందని తెలిపింది.మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖకు రూ.1,228 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రూ.2,506 కోట్లు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.18,847 కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్యశాఖకు రూ.3,156కోట్లు, ఇంధనశాఖకు రూ.13,600కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.8,785 కోట్లు, యువజన పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు గృహ మంత్రిత్వశాఖకు రూ.8,570 కోట్లు, తెలుగు భాష అభివృద్ధి, ప్రచారం కోసం రూ.10 కోట్లు, మద్యం, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం కోసం నవోదయ 2.0 కార్యక్రమానికి రూ.10 కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం రూ.6,300 కోట్లు, పోలవరం కోసం రూ.6,705 కోట్లు, జల్‌జీవన్ మిషన్ కోసం రూ.2800 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాలు

>> 1వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించింది. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 6,19,275 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఇంగ్లిష్ మీడియంలో 5,64,064 మంది, తెలుగు మీడియంలో 51,069 మంది పరీక్షలు రాశారు. ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు 6,49,884 మంది విద్యార్థులు ఫీజుకట్టారు. కానీ వారిలో 6,19,275 మంది పరీక్షలు రాశారు. ఈ పదో తరగతి పబ్లిక్ పరీక్ష పత్రాల మూల్యాంకనం మొత్తం 26 జిల్లాల్లో ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమై.. ఏప్రిల్ 9వ తేదీతో ముగిసింది. ఇక మార్కులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసే ప్రక్రియ కూడా ముగిసింది. దీంతో ఫలితాల విడుదలకు ప్రభుత్వ రంగం సిద్ధం చేసింది.

## హైకోర్టుకు బదలీ

>> చేసింది. తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఈ ప్రక్రియపూర్తయింది. బదిలీ అయిన న్యాయమూర్తులు త్వరలో తమ కొత్త బాధ్యతలను స్వీకరించే అవకాశం ఉంది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు హేమంత్ చందన్ గౌడ్‌ను మద్రాస్ హైకోర్టుకు, కృష్ణన్ నటరాజన్‌ను కేరళకు, సంజయ్‌గౌడ్‌ను గుజరాత్‌కు, దీక్షిత్ శ్రీకృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేశారు.

## 'సిట్' అదుపులో కసిరెడ్డి

>>మద్యం కుంభకోణం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కసిరెడ్డి కొద్ది రోజుల క్రితం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. న్యాయస్థానం దీనిపై విచారణ చేపట్టింది. మధ్యంతర రక్షణ కల్పించాలంటూ రాజ్ కసిరెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు అందుకు అంగీక రించలేదు. ఈ కేసులో తదుపరి విచార ణను వారానికి వాయిదా వేసింది. మంగళవారం తాను విచారణకు హాజర వుతానంటూ కసిరెడ్డి ఆడియో విడుదల చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 22-04-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.నవమి సా.6.07
శ్రవణ మ.12.39
వర్జ్యం సా.4.33-6.07
దు.ఉ.8.19-9.09, రా.11.27-12.17
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** శ్రమతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి. దైవదర్శనాలు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**కర్కాటకం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. వస్తులాభం.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో పాల్గొంటారు.

**కన్య :** ఋణ బాధలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**తుల :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సోదరుల కలయిక.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఉద్యోగులకు బదలీలు వుంటాయి.

**ధనుస్సు:** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి ధనలాభం.

**కుంభం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి సహాయసహకారాలు అందిస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మంత్రుల సమీక్ష

>> గతంలో చిలకలూరిపేట,విశాఖపట్నంలలో ప్రధాని పర్యటన సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రధాని సభను విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు.ఈసమావేశంలో ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ టెంటటివ్ కార్యక్రమం ప్రకారం మే 2వ తేది మధ్యాహ్నం 3గం.లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని అక్కడ నుండి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయం సమీపంలోని హెలీప్యాడ్ కు చేరుకుని అక్కడ నుండి రోడ్డు షో ద్వారా సచివాలయం వెనుక వైపున గల ప్రధాన వేదిక వద్దకు చేరుకుంటారని తెలిపారు. ఈకార్యమానికి సంబంధించి విధులు కేటాయించిన అధికారులు వారి టీంలతో కలిసి ఆయా పనులు సక్రమంగా జరిగేలా చూసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు ఇతర ఏవిధమైన సమస్యలున్నా నోడలు అధికారి వీరపాండ్యన్‌తో సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించుకోవాలని చెప్పారు.ప్రధానమంత్రి కార్యక్రమాల పర్యవేక్షణ నోడలు అధికారి వీరపాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రధాని పర్యటన ఏర్పాట్లను వివరిస్తూ టెంటటివ్ కార్యక్రమం ప్రకారం మే 2వ తేది మధ్యాహ్నం 3గం.లకు ప్రధాన మంత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని వివరించారు. తదుపరి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయం వద్ద గల హెలీప్యాడ్‌కు 3.20గం.లకు చేరుకుంటారని తెలిపారు. అనంతరం అక్కడ నుండి ప్రధాన వేదిక వరకు సుమారు 1.2 కి.మీల పొడవునా రోడ్డు షో నిర్వహిస్తారని వివరించారు. రోడ్డుషోలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.అంతేగాక సాంస్కృతిక బృందాల ప్రదర్శన ద్వారా స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు.3.35గం.లకు సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన అమరావతి పెవిలియన్ కు చేరుకుంటారని తదుపరి 3.45గం.లకు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని వివరించారు.

సాయంత్రం 5గం.ల ప్రాంతంలో ప్రధాని హెలీప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని విమానంలో బయలుదేరి వెళతారని అన్నారు. మొత్తం మీద సుమారు రెండు గంటలపాటు సాగే ప్రధాని పర్యటనను విజయ వంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.ప్రధాని పర్యటనకు సంబంధించి 10 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అక్కడ తాగునీరు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.వివిఐపిలకు కరకట్ట, సీడ్ యాక్సిస్ రోడ్లను ప్రత్యేకంగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక సామాన్య ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు వీలుగా విజయవాడ నుండి మరో రెండు రూట్లు, గుంటూరు నుండి నాలుగు రూట్లను, మరికొన్ని తాత్కాలిక రూట్లను కూడా ట్రాఫిక్ కు అంతరాయాలు లేని విధంగా తీర్చిదిద్దనున్నట్టు పేర్కొన్నారు.ఆయా రోడ్లన్నీ పాట్ హోల్ ఫ్రీ రోడ్లుగా తీర్చి దిద్దాలని ఆర్ అండ్బి అధికారులకు సూచించారు. ఆయా రోడ్లపై గల వివిధ బాటిల్ నెక్స్‌ను సరి చేయాలని చెప్పారు.

వివిధ జిల్లాల నుండి సభకు తీసుకువచ్చే వారందరికీ అల్పాహారం,తాగునీరు, మజ్జిగ,పండ్లు,భోజనం వంటివి పంపిణీ చేయాలని సంబంధిత ఇన్‌ఛార్జ్‌లకు సూచించారు. ఈ విషయంలో రాజీ పడవద్దని ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చుసుకోవాల న్నారు. ఈనెల 29 సాయంత్రానికి మొత్తం ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఆయా అధికారులకు చెప్పారు.30వ తేదీన రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పిజి రిహార్సల్స్ ఉంటాయని తెలిపారు. ఏర్పాట్లకు సంబంధించి ఆయా అధికారులకు కేటాయించిన పనులను వారి బృందాలతో సక్రమంగా జరిగేలా చూసుకోవాలని ప్రతి రోజు పర్యటించి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని చెప్పారు. అంతేగాక ఏర్పాట్లకు సంబంధించి ప్రతి రోజు సా.4గం.లకు డైలీ నివేదికను సమర్పించాలని వీరపాండ్యన్ చెప్పారు. ఈసమావేశంలో జిఎడి ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు,అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ మదుసూధన్ రెడ్డి, ఎన్టిఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు లక్ష్మిష, బాలాజీ, నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సోమవారం వేసవి కార్యాచారణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న ఢిల్లీ సిఎం రేఖా గుప్త

# ధరణి పరిరక్షణ సమష్టి బాధ్యత

>> మానవాళిని కాపాడుకునే దిశగా ప్రతి ఏడాదీ ఏప్రిల్ 22ను 'ప్రపంచ ధరిత్రీ దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. పారిశ్రామిక ప్రగతితో ఏర్పడుతున్న వాయు కాలుష్యాన్ని 'ప్రగతి వాసన' గా భావిస్తున్న తరుణంలో 1970 నుంచి వరల్డ్ ఎర్త్ డే పేరిట పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా సమిష్టి చైతన్య కార్యక్రమాలు మొదలయ్యాయి.

ఈ ఏడాది ప్రపంచ ధరిత్రీ దినోత్సవానికి మన శక్తిమన గ్రహం అన్న ఇతివృత్తాన్ని ఎంపిక చేశారు. పునరుత్పాదక వనరుల ద్వారా 2030 నాటికి విద్యుదుత్పాదనను మూడు రెట్లు పెంచే లక్ష్యం వైపు ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాల్ని ముమ్మరం చేయడం పట్ల దృష్టి సారించేందుకు ఈ విషయాన్ని ఎంపిక చేశారు. కేవలం నేటి సుఖం కోసమే ఆరాటపడకుండా, రేపటి మనుగడ కోసం సుస్థిరాభివృద్ధి విధానాలపై దృష్టి పెట్టి ధరణి మాత మనుగడతో పాటు మానవాళి ఉనికిని కాపాడుకునేందుకు తగు చైతన్యంతో ప్రజలు, ప్రభుత్వాలు దూర దృష్టితో పనిచేయాలి. ఈ దిశగా ఈ ఏడాది ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా సమిష్టిగా సంకల్పించాలని కోరుతున్నాను. ..ధరణి మాత ఆరోగ్యాన్ని రక్షించుకుందాంమానవాళి ఉనికిని కాపాడుకుందామన్నారు.

## గొల్లపూడి పంచాయతీకి

# జాతీయ అవార్డు

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డుల్లో రాష్ట్రంలోని విజయవాడ నగర శివార్లులోని గొల్లపూడి గ్రామ పంచాయతీకి అవార్డు లభించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఆత్మ నిర్భర్ పంచాయతీ కేటగిరిలో ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి గ్రామ పంచాయతీ మూడవ స్థానం సాధించినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆశాఖ పేర్కొంది.

సొంత ఆదాయ వనరులు పెంపొందించుకున్న పంచాయతీలకు ఇచ్చే ఈ అవార్డును గొల్లపూడి గ్రామ పంచాయతీ దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ నెల 24వ తేదీన పంచాయతీ రాజ్ దివస్ సందర్భంగా బీహార్ రాష్ట్రంలోని మధుబనిలో జరిగే జాతీయ స్థాయి వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోడీ అవార్డులు ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు.

# పోప్ ఫ్రాన్సిస్ ఇక లేరు

>> అందించారు. శరణార్థుల పాదాలు కడిగిన పోప్ తరచూ సామాజిక అంశాలపై కూడా ఆయన వ్యాఖ్యలు చేస్తుంటారు. 2016లో రోమ్ బయట ఇతర మతానికి చెందిన శరణార్థులకు పాదాలు కడిగారు. దీనిని ఆయన వినయం, సేవాతత్పరతకు చిహ్నంగా భావించేవారు. తదుపరి పోప్‌ను రహస్య ఓటింగ్ ద్వారా కార్డినల్స్ కాలేజ్ ఎన్నుకోనుంది. వాస్తవానికి పోప్ ఈ ఏడాది భారత్‌లో పర్యటించాల్సి ఉంది. కాథలిక్ చర్చి జూబ్లీ ఇయర్ వేడుకల కోసం ఆయన భారత్‌కు రావాల్సి ఉంది. గతేడాది డిసెంబర్‌లో కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ ఆయన్ను ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతినిధి బృందం స్వయంగా ఆయన్ను కలిసింది. అయితే పోప్ అనారోగ్యం కారణంగా ఆ షెడ్యూల్ వాయిదా పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆయన కన్నుమూశారు. తన మరణానికి కొద్దిగంటలముందు కూడా ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. వాటికన్ నగరంలోని పీటర్స్ స్క్వేర్‌లో 35వేలమందిని ఉద్దేశించి ఆయన ప్రపంచ శాంతికోసంసందేశం ఇచ్చారు. బ్రదర్స్ అండ్ సిస్టర్స్ హ్యాపీ ఈస్టర్ అని పోప్ స్వయంగా చెప్పారు. తర్వాత ఆయన సందేశాన్ని ఆర్చిబిషప్ డియాగో రావెలి చదివి వినిపించారు. సంక్షోభాలతో రగులుతున్న గాజా, ఉక్రెయిన్, కాంగో మయన్మార్‌లలో శాంతినెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ తన భార్య ఉషతో కలిసి ఈస్టర్ సందర్భంగా పోప్‌ను కలిసారు. పోప్ మూడు పెద్ద చాకొలెట్ ఈస్టర్ ఎగ్స్‌ను వాన్స్ దంపతులకు బహూకరించారు. అస్వస్థతకు గురయిన తర్వాత ప్రజల్లోకి రావడం ఈస్టర్ సందేశంతోనే. ప్రత్యేక వాహనంలోప్రజలమధ్యనుంచి ఆయన ప్రయాణిస్తూ వెళ్లారు. మధ్యలో ఆగి పసికందులను చిన్నారులను ఆశీర్వదించారు.

# లక్షదాటిన బంగారం

>> సాయంత్రం 5.30 గంటలకు 24 క్యారెట్ల పసిడి రూ.1,00,016కి చేరింది. తదనంతరం కొంతమేర దిగివచ్చి రూ.99,900వద్ద ట్రేడ్ అయింది. ముందురోజు ముగింపుధరతోపోలిస్తే సుమారు రెండువేలు పెరిగింది. ఈ ఏడాది ఇప్పటివరకూ పసిడిధర సుమారు రూ.20వేలకుపైనే పెరిగింది. డిసెంబరు 31న సుమారు రూ.79వేలు ఉన్న పసిడిధరలు గడచిన మూడున్నర నెలల్లో 26 శాతం మేర పెరిగాయి. వెండికూడా కిలో మళ్లీ లక్షరూపాయలకు చేరువగా ఉంది. ఒకసారి ఇప్పటికే లక్ష మార్కును దాటిన వెండి ప్రస్తుతం రూ.99,299వద్ద ట్రేడ్ అవుతోంది. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసిఎక్స్‌లో కూడా పదిగ్రాముల పసిడి తొలిసారి రూ.96వేల మార్కుదాటింది. జూన్‌నెల డెలివరీ కాంట్రాక్టుల్లో పదిగ్రాముల పసిడి ఒక్కరోజులోనే రూ.1621మేర పెరిగి ఇంట్రాడేలో రూ.96,875వద్ద గరిష్టాన్ని తాకింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా చైనాలమధ్య వాణిజ్యపరంగా సయోధ్య కుదిరేంతవరకూ పసిడిధరల్లో ఇదేపరిస్థితి కొనసాగుతుందని నిపుణులు అంచనాలువేస్తున్నారు.

# జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

>> సంచారం వుండడంతో పాటు వారి స్థావరం వుందనే సమాచారంతో తెల్లవారుజాము నుంచి సిఆర్‌పిఎఫ్ బలగాలకు తోడుగా స్థానిక పోలీసులు కూంబింగ్ చేబట్టారు. ఈ సందర్భంగా ఇరువైపుల కాల్పులు జరిగా యని డిజిపి అనురాగ్ గుప్తా తెలిపారు. కాల్పుల తరువాత ఎనిమిది మంది నక్సలైట్లు మరణించారని, వీరి మృతదేహాలను స్వాధీనం చేసుకుని స్థానిక ఆసుపత్రికి తర లించామని డిజిపి తెలిపారు. ఘటనా స్థలంలో ఒక ఎకె 47 తుపాకి, మరో ఎస్ఎల్ఆర్ తుపాకి, మూడు ఇన్సాస్ తుపాకులు, కొంత పేలుడు సామాగ్రి,, మావోయిస్టుల సాహిత్యం లభ్యమయ్యిందని ఆయన వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసుల తరపున ఎలాంటి నష్టం జరగలేదని ఆయన తెలిపారు. ఎదురు కాల్పులు జరిగిన ప్రాంతంలో మరికొందరు నక్సలైట్లుగా గాయపడినట్లు భావిస్తున్నామని, ఆ ప్రాంతంలో గాలింపు జరుగుతోందని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేత పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంజి అలియాస్ వివేక్ కూడా వున్నారని, ఆయనపై కోటి రూపాయల రివార్డు వుందని డిజిపి అనురాగ్ గుప్తా తెలిపారు. వివేక్‌తో పాటు జోనల్ కమిటీ సభ్యుడు అరవింద్ యాదవ్ అలియాస్ అవినాష్, సాహెబ్రాం మాంజి అలియాస్ రాహుల్, మహేష్ మాంజి అలియాస్ మోటా తాలు రాంజి, గంగారాం మాంజిలు మృతుల్లో వున్నారని డిజిపి తెలిపారు. వివేక్‌పై కోటి రూపాయల రివార్డు వుండగా అరవింద్ యాదవ్‌పై 25 లక్షల రూపాయలు సాహెబ్రాంపై పది లక్షల రూపాయల రివార్డు వుందని డిజిపి తెలిపారు. జార్ఖండ్‌లో నక్సల్ ప్రభావం పెద్దగా లేదని, అయితే కొన్ని ప్రాంతాల్లో వారి ఉనికి వుందని, వీరిని వచ్చే వర్షాకాలం లోపు ఏరివేస్తామని ఆయన మీడియాకు వెల్లడించారు. నక్సల్స్ ఏరివేతకు కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర సాయుధ బలగాలు నిరంతరం కూంబింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ నక్స లైట్లు ఆయుధాలను వీడి వెంటనే లొంగి పోవాలని పిలుపునిచ్చారు. నక్సలైట్ల ఏరివేత నిరంతరాయంగా కొనసాగుతుందని, వచ్చే ఏడాది మార్చినాటికి నక్సల్స్ విముక్త భారత్‌ను సాధించి తీరుతామని ఆయన తెలిపారు.

## పోప్ ఫ్రాన్సిస్ మరణం బాధించింది - సీఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** పోప్ ఫ్రాన్సిస్ మరణం తనను ఎంతో బాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. అధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారని, శాంతి సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరుపున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ కూడా వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి దూతగా పోప్ ఫ్రాన్సిస్ మరణం కేథలిక్ సమాజానికి తీరని నష్టమని వారు తమ ప్రకటనల్లో పేర్కొన్నారు.ఆయన ఉన్నంతకాలం శాంతి సామరస్యం కోసం పరితపించారని పేర్కొన్నారు.

## బిసి అభ్యర్థులకు 24నుంచి ఆన్ లైన్ ద్వారా డిఎస్సీకి ఉచిత కోచింగ్ - బిసి సంక్షేమ మంత్రి సవిత



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:**డీఎస్సీకి హాజరయ్యే బీసీ అభ్యర్దులకు ఈ నెల 24నుంచి ఆన్ లైన్ ద్వారా ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు.ఆ మేరకు ఆమె కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు.బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా శిక్షణ పొందిన వారే అత్యధిక ఉపాధ్యాయ పోస్టులు బీసీ అభ్యర్థులే సాధించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి సవిత వెల్లడించారు. అందుకనుగుణంగా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా 26 జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కేంద్రాల ద్వారా 5,200 మందికి ఉచిత డీఎస్సీ శిక్షణతో పాటు కోచింగ్ సమయంలో నెలకు రూ.1500ల స్టయిఫండ్, మెటీరియల్ కోసం మరో అదనంగా రూ.1000 అందజేసినట్లు తెలిపారు. గృహిణులు, ఇతర అభ్యర్థుల కోసం ఆన్ లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ నెల 24 నుంచి ఆన్ లైన్ ద్వారా డీఎస్సీ కోచింగ్ నిర్వహణా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ, ఇచ్చిన మాటకు కట్టుబడుతూ సీఎం చంద్రబాబునాయుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముక్తకంఠంతో ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ కు, మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు రూపొదిద్దుకుంటుందని భావిస్తూ, టీడీపీ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నాయని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర చరిత్రలో 1.80 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వాలకే చెందుతాయన్నారు. ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ విధానం తెచ్చింది కూడా సీఎం చంద్రబాబునాయుడుదేనని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మెగా డీఎస్సీ నిర్వహణకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సీఎం చంద్రబాబుకు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు డీఎస్సీ అభ్యర్థులతో కలిసి సవిత ధన్యవాదాలు తెలిపారు.

## కృత్రిమ మేధ వినియోగంలో ప్రజాసంబంధాల పాత్ర కీలకం

### - జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవంలో వక్తలు



**తిరుపతి,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కృత్రిమ మేధస్సు(ఎఐ)ను బాధ్యతాయుతంగా వినియోగించడంలో ప్రజా సంబంధాలు ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తాయని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఆచార్య పివి నరసయ్య తెలిపారు. కృత్రిమ మేధ కేవలం కంప్యూటర్ సబ్జెక్టు కాదని, ఇది అన్ని సబ్జెక్టులను ప్రభావితం చేయగలదని అన్నారు.ఏఐని నైతికంగా, పారదర్శకంగా వినియోగిస్తే మంచి ఫలితాలను రాబట్టుకోవచ్చని తెలిపారు.ఏఐని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ప్రజా సంబందాల నిపుణులు, సాంకేతిక నిపుణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ కామర్స్, మేనేజ్‌మెంట్ కంప్యూటర్స్ కళాశాలలో జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్య పి.వెంకటకృష్ణ, తిరుపతి ఐఐటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యేటూరు కాలిదాస్ కీలక ఉపన్యాసంలో ప్రజలకు ఏఐ సాంకేతిక వినియోగం గురించి అవగాహన కల్పించడం ప్రజాసంబంధాల ప్రధాన లక్ష్యమన్నారు.సామాజిక మాధ్యమాలు, వార్తావ్యాసాలు, సమావేశాలు ,అవగాహన కార్యక్రమాల ద్వారా ఏఐ సానుకూల ఉపయోగాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ జిఎస్ ప్రసాద్, కార్యదర్శి డి.చంద్రమోహన్, కంప్యూటర్‌సైన్స్ కళాశాల విభాగాధిపతి ఆచార్య జి.అంజన్‌బాబు, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య పి.రఘునాధరెడ్డి,కామర్స్ హెచ్ఓడి ఆచార్య కె.జయచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జివి రమేశ్‌బాబు, పిఆర్ఎస్ఓ కోశాధికారి కె.మధుసూదన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు, మాజీ ఛైర్‌పర్సన్లు డాక్టర్ పి.స్వరాజ్యలక్ష్మి, ఆచార్య డాక్టర్ త్రిపురసుందరి ,రమ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎస్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కె సంతోష్‌రావు పదవీకాలం పొడిగింపు



**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎపిఎస్‌పిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సిఎండి) కె సంతోష్‌రావు పదవి కాలాన్ని రాష్ట్రప్రభుత్వం పొడిగించింది. ఇందుకు సంబంధించిన జివో 29ను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ విడుదల చేశారు. సంతోష్‌రావును 2023 ఏప్రిల్ 14వ తేదిన ఎస్‌పిడిసిఎల్ సిఎండిగా నియమించిన ప్రభుత్వం రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని వెల్లడించింది.

ఇప్పుడు కొత్తవారిని నియమించే వరకు ఆయననే కొనసాగిస్తూ తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది.

# తిరుమల సమాచారం

## వేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషం

### - సుప్రీంకోర్టు విశ్రాంత సిజె జస్టిస్ ఎన్‌వి రమణ



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ ఎన్‌వి రమణ తెలిపారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి మొక్కిన జస్టీస్ రమణ కుటుంబసభ్యులుఅనంతరం ఆనందనిలయంలో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో సినీప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని పలువురు సినీ ప్రముఖులు దర్శించు కున్నారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో సినీసంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపీచంద్‌మలినేని, నటుడు అశ్విన్‌బాబు ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి దర్శనంతోఆనందంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎస్వీగోశాలలో గోవులకు చల్లచల్లదనం

### - జనసేననేత కూలర్లు విరాళం



**తిరుపతి,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని టిటిడి ఎస్వీగోశాలలో గోవుల మరణాలపై ఆరోపణలు ,రగడ చోటుచేసుకున్న తరుణంలో గోమాతలకు చల్లదనం కోసం ఎయిర్‌కూలర్లను తిరుపతి జిల్లా జనసేననేత కిరణ్‌రాయల్ విరాళంగా అందించారు. జనసేనాని పవన్‌కల్యాణ్‌కు గోమాతలంటే ఎంతో ఇష్టమని, గోమాతలపై ఉన్న విశ్వాసంతో గోమాతలకు కూలర్లు ఇవ్వడం జరిగిందని కిరణ్ తెలిపారు. గోశాలకు నాలుగు ఎయిర్ కూలర్లు అందించినట్లు చెప్పారు.గోవుల సంరక్షణకు మంచి మనసుతో దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నేతలు ఆకేపాటి సుభాషిణి, హేమకుమార్, మనోజ్,వంశీ, లోకేశ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. జనసేననేత కిరణ్‌రాయల్ మంచి మనసును గోసంరక్షకులు అభినందించారు.

## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషంగా ఉందని, స్వామివారి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కెవిస్ శ్రీనివాసరాజు తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులకు మరింత నాణ్యమైన ఆహారం

### - ఆహారపదార్థాల పరీక్షకు మరో పరిశోధనశాల



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** దేశం నలుమూలల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు తిరుమలలోని హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో ఆహారపదార్థాలు ఏ మేరకు నాణ్యత, పరిశుభ్రత పాటిస్తున్నారనే పరీక్షలకు మరో ఆహార పదార్థాల తనిఖీ పరిశోధన శాలను కేంద్రం మంజూరు చేసింది. ఫుడ్‌సేఫ్టీల్యాబ్‌లు ఏర్పాటులో భాగంగా తిరుమలకు మరొకటి మంజూరు చేసింది. ఈ పరిశోధనశాలలో టిటిడికి సరఫరా అవుతున్న పలు రకాల ఆహారపదార్థాలు, పప్పులు, నూనెలు వంటివాటి నాణ్యతను పరీక్షించే వెసలుబాటు కలుగుతుంది. ఇప్పటికే తిరుమలలోని ఫ్లోర్‌మిల్ ఆవరణలో ఆహారపదార్థాల పరీక్షించే ల్యాబ్ ఉంది. దీన్ని ఇప్పటికే ఆధునీకరించి అత్యాధునిక పరికరాలు అమర్చారు. దేవునికి మూడుపూటలా తయారుచేసే నైవేద్యప్రసాదాలను ఈ ల్యాబ్‌లో పరిశోధకులు తనిఖీ చేసి ఆ తరువాత స్వామివారికి నివేదిస్తున్నారు. ఇప్పుడు తిరుమల ప్రాధాన్యత దృష్ట్యా మరో సేఫ్టీఫుడ్‌ల్యాబ్ మంజూరైంది. తిరుమలేశుని అన్నప్రసాదాల తయారీలో వినియోగించే పదార్థాల నాణ్యత పరీక్షించేందుకు అధునాతన యంత్రాలు తిరుమలకు రానున్నాయి. అంతేగాక అన్నప్రసాదాలు తయారుచేసే వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో కూడా పదార్థాలు తనిఖీ చేసే అవకాశం కలుగుతుంది. తిరుమలలో అవసరమైన మరో అధునాతన పరిశోధనశాల ఏర్పాటు కానుంది. ఇప్పటికే ఉన్న ల్యాబ్‌లో గ్యాస్‌క్రొమెటోగ్రఫీ, హైఫర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ రెండు యంత్రాల ద్వారా నెయ్యిలోని నాణ్యత, నిత్యావసరసరుకుల నాణ్యత ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఉన్నాయోలేదో తెలిసిపోతుంది.

## డిఎస్సీ అభ్యర్థుల గరిష్ట వయో పరిమితిని పెంచండి

### సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** డిఎస్సీ అభ్యర్థుల గరిష్ట వయో పరిమితిని పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేసారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నోటిఫికేషన్ కు సంబంధించి అభ్యర్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వయోపరిమితిపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని, వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం రామకృష్ణ లేఖ రాశారు. 2018 తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదని రామకృష్ణ తన లేఖలో గుర్తుచేశారు. అప్పటి నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చాలామంది అభ్యర్థులు వేచి చూస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో అభ్యర్థుల్లో వయోపరిమితిపై ఆందోళన నెలకొందని చెప్పారు. వయోపరిమితి 47 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవాలని, మెగా డీఎస్సీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని రామకృష్ణ తన లేఖలో సీఎం చంద్రబాబును కోరారు.

## గ్రావెల్ మాఫియాపై ఎమ్మెల్యే ఉక్కు పాదం



**వింజమూరు (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ మాఫియా పై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉక్కుపాదం మోపారు. సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంది మార్బలంతో కాకుండా తన వాహనంలో నల్లగొండ్ల గ్రామంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకం ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఒక హిటాచి వాహనంలో పెద్ద మొత్తంలో గ్రావెల్‌లోడ్‌తో టిప్పర్లు ట్రాక్టర్లకు గ్రావెల్ ఎత్తుతున్న దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. గ్రావెల్ మాఫియా ఇంతలా బరితెగించి గ్రావెల్ తరలిస్తుంటే అధికారులు చూస్తూ ఉండిపోవడం ఎమ్మెల్యేకు ఆశ్చర్యం కలిగించింది. వెంటనే సంబంధిత మండల స్థాయి అధికారులను నల్లగొండ్ల గ్రామానికి రావాలని ఆదేశించడంతో అధికారులు హుటాహుటీన నల్లగొండ గ్రామానికి చేరుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో గ్రావెల్ తరలిస్తుంటే ఏం చేస్తున్నారని అధికారులుపై ఆగ్రహించాడు ఎమ్మెల్యే గ్రావెల్ తరలింపు వద్దకు వచ్చాడన్న సమాచారం తెలియడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘటన స్థలం వద్దకు వచ్చారు. గ్రామస్తులు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మండల అధికారులు తీరుపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంలో అక్రమ గ్రావెల్ మాఫియా గురించి తెలియజేసినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు భోగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, అన్నపరెడ్డి శ్రీనివాసులురెడ్డి భరోసా అండదండలతో ఇంత పెద్ద ఎత్తున నల్లగొండ్లలో గ్రావెల్ తరలించుకుని పోతున్నారని పంచాయతీ పాలకవర్గం తమది కాబట్టి పంచాయతీ తీర్మాన్ని ఇస్తాం గ్రావెల్ తగిలించుకో వెళ్లండి భరోసా ఇవ్వడంతో గ్రావెల్ మాఫీ ఇష్టానుసారం రెచ్చిపోతున్నారని ప్రతి నెల ఒప్పందం మేరకు అధికారులకు స్థానిక నేతలకు ముడుపులు పోవడంతో నోరు మెదపడం లేదన్నారు. గ్రామస్తులు ఆవేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నల్లగొండ గ్రామస్తులు తమ గ్రామ సమీపంలో నల్లకొండ వద్ద పెద్ద పెద్ద వాహానాలతో గ్రావెల్ లోడుతూ డంపింగ్ చేస్తూ టిప్పర్లతో బయటకు తరలిస్తున్నారని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెప్పడంతో తానే స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చిందన్నారు. నియోజకవర్గం ప్రజలు ఎంతో పెద్ద మనసుతో మొన్నటి ఎన్నికల్లో నన్ను దీవించి గెలిపించడం జరిగిందన్నారు. తాను కూడా ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సంకల్పంతో ప్రభుత్వం దృష్టికి అనేక ప్రతిపాదన సిద్ధం చేసుకుని తాను ప్రయత్నిస్తుంటే, ఈ ప్రాంతంలో కొంత మంది పనికట్టుకుని తన పేరు చెప్పుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని, తాను ఎప్పుడు కూడా అక్రమార్కులకు తావు ఇవ్వనని ఎవరైనా తన పేరు చెప్పుకొని అక్రమాలకు పాల్పడితే అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు తావిస్తే చర్యలు తప్పని అధికారులు హెచ్చరించారు. నియోజకవర్గ సంపదను అక్రమంగా దోచుకోవాలని దుర్మార్గులను విడిచి పెట్టేది లేదని మన విలువైన సంపదను మనమే కాపాడుకోవానలి అధికారులు సూచించారు. అక్రమ గ్రావెల్ రవాణా మాఫియా పై రెవెన్యూ ఇరిగేషన్ పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపాలన్నారు.

## ప్రధాన మంత్రి పర్యటనపై మంత్రుల సమావేశం

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని మోడి పర్యటనతో అమరావతిలో పనులు మరింత ఊపందుకుంటాయని ఎపి మంత్రులు తెలిపారు. ఎపి పర్యటనలో భాగంగా. మే 2 న సాయంత్రం 3 గంటలకు ప్రధాని మోడి గన్నవరానికి చేరుకుంటారని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ .. ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించామన్నారు. సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయని, అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారులందరికీ బాధ్యతలు అప్పగించినట్లు పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వేదికపై మోడి గంటపాటు ఉంటారని చెప్పారు. నాదెండ్ల మనోహర్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజకీయ కక్షతో పోలవరాన్ని, అమరావతిని నిలిపివేసిందని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులు పున్ఃప్రారంభమయ్యాయని, అమరావతి పనులను కూడా తిరిగి ప్రారంభించేందుకు ప్రధాని ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. మే 2న రూ.లక్ష కోట్ల అభివఅద్ధి పనులను మోడి ప్రారంభిస్తారని తెలిపారు.

## పురుగు మందుతాగి మహిళ మృతి


**బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ లోని కడనూతల గ్రామానికి చెందిన చల్లా. ఆదినారాయణమ్మ (55)ఈనెల 19 వ తేదీన పురుగుమందు తాగి చికిత్స పొందుతూ చెన్నై లోని ప్రైవేట్ వైద్యశాల లో ఆదివారం మృతి చెందిందని తెలిపారు.

## ఉత్తమ పనితీరులో ఐఎఎస్‌కు జాతీయ అవార్డు




**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి అవార్డు (2023)ను తిశిళీజూళిని.ళీ సెక్రటరీ వి. ప్రసన్న వెంకటేష్ నేడు డిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో అందుకున్నారు. సోమవారం నాడు 17వ సివిల్ సర్వీస్ డే సందర్భంగా డిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో వికసిత్ భారత్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిపాలనలో ఉత్తమ పనితీరు కనబరిచిన పలువురు ఐఏయస్ అధికారులకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం అందించింది. ప్రసన్న వెంకటేష్ జనవరి 2022 నుంచి జూలై 2024 వరకు ఏలూరు జిల్లాకు తొలి కలెక్టర్ గా పనిచేసిన సమయంలో ఆయన ప్రజలకు అందించిన సేవలకు గాను ప్రభుత్వం ఈ అవార్డు అందజేసింది. ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్ గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల అమలులో భాగంగా మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేశారు. సామాజిక బాధ్యత చొరవ కింద జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో 'అక్షజ్ఞ' అనే కార్యక్రమంతో గర్భిణీలు, ప్రసూతి మహిళల ఆరోగ్య సంరక్షణకు పాటుపడ్డారు. ఈ విధంగా, జిల్లాలో సుపరిపాలన అందించడం ద్వారా ఈ అవార్డుకు ఎంపికైన దేశంలోని 10 జిల్లాల కలెక్టర్లలో ప్రసన్న వెంకటేష్ ఒకరు. ఈ సందర్భంగా అవార్డు అందజేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రసన్న వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిచేందుకు ప్రజా సేవకునిగా శక్తివంచన లేకుండా తాను కృషి చేస్తానన్నారు.

## కోనలో బ్రహ్మోత్సవాలపై సమీక్షా సమావేశం



**రాపూరు (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మే నెల 8వ తేది నుండి జరగనున్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబందించి చేయవలసిన ఏర్పాట్లపై మంగళవారం పెంచలకోనలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి సోమవారం తెలిపారు. కోనలోని కాకతీయ కమ్మ సత్రంలో నెల్లూరు ఆర్‌డిఓ ఆధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమీక్షలో బ్రహ్మోత్సవాలలో భక్తుల సౌకర్యార్థం వివిధ శాఖల ద్వారా చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారని వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పని సరిగా ఈ సమీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

## అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పర్యటనను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల ఆందోళన

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్త ప్రతినిధి:** అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు ఆధ్వరనఓయంలో సోమవారం నిరసనలు నిర్వహించారు.విజయవాడ,విశాఖ.గుంటూరు, శ్రీకాకుళం,తిరుపతి తదితర నగరాల్లోను రైతులు నిరసన ప్రదర్శనలు చేసారు. పలు మండల కేంద్రాల్లో తహస్సీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు.ఆయా కార్యాలయాల్లో ఈ అంశంపై తహస్సీల్దార్లకు వినతి పత్రాలు అందజేసారు.అమెరికా ప్రభుత్వం తరపున దేశంలో ఒప్పందాలు చేసుకునేందుకు వస్తున్న అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ పర్యటనకు భారత రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, బి ప్రభాకర్ రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు మీడియాకు విడుదల చేసిన సమాచార పత్రంలో పేర్కొన్నారు. భారత వ్యవసాయ ఉత్పత్తులపై విపరీతంగా సుంకాలు విధిస్తూ, దేశ వ్యవసాయ రంగాన్ని అమెరికా దెబ్బతీస్తుందన్నారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే నిరసనల్లో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జనసేన జనవాణి కార్యక్రమం పనివేళల్లో మార్పు

### సోమవారం నుంచి గురువారం వరకు కార్యక్రమం

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన జనవాణి కార్యక్రమం పని వేళల్లో మార్పు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసింది. సోమవారం నుంచి గురువారం వరకు కార్యక్రమంనిర్వహిస్తారు.ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. కొనసాగింపుగా సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జనవాణి జరుగుతుంది.సోమవారం నుంచే కొత్త పని వేళలు అమల్లోకి వస్తాయని పార్టీ ప్రకటనలో వివరించారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఖిజనవాణిఖి కార్యక్రమాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వివిధ సమస్యలతో ఈ జనవాణికి వచ్చిన ప్రజలను స్వయంగా జనసేనాని కలిసి వారి నుంచి వినతి పత్రాలను తీసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

వార్త

ఒక వ్యక్తి పేదరికాన్ని సంపదను నిర్ణయించేది ఆ వ్యక్తి సంపాదన గాని, ఆదాయం కాని కాదు. అతడి ఆదాయానికీ, ఖర్చుకీ మధ్యలో ఉన్న వ్యత్యాసం అంతే.

-డేనియల్

# తుది సందేశం


సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం తుది శ్వాస వరకు తపించిన వాటికన్ సిటీ అధినేత , రోమన్ కాథలిక్ చర్చి అధిపతి ,క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్(88) ఇక లేరనే సమాచారాన్ని క్రైస్తవ లోకం జీర్ణించుకోలేకపోతోంది. ఇటలీ కాలమాన ప్రకారం సోమవారం ఉదయం 7.35 నిమిషాలకు తన నివాసం కాసా శాంటా మార్తాలో తుదిశ్వాస విడిచారు. ఆయన చాలా కాలంగా న్యుమోనియా వంటి శ్వాస కోశ , కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారు. గత నెలలో 38రోజుల పాటు చికిత్స పొందారు. మొన్న ఆదివారం ఏప్రిల్ 20 ఈస్టర్ సందర్భంగా ప్రపంచ శాంతి కోరుతూ తన తుదిసందేశాన్ని ప్రపంచానికందించి ఆయన మనోభావాలను వ్యక్తీకరించారు. 2013 మార్చి 13 న 266 పోప్ గా ఆయన వాటికన్ ప్రస్థానం ప్రారంభమయ్యింది. 1936 డిసెంబర్ 13న పోప్ అర్జెంటీనాలో జన్మించారు. అమెరికన్ ఖండంలోని దక్షిణా అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి పోప్ ఆయనే. ఆయన అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. తొలుత ఆయన పాస్టర్‌గా అర్జెంటీనాలో సేవలందించారు వాటికన్ సిటీలోని కాథలిక్ చర్చి ప్రధాన పాలకునిగా ఎన్నో కీలక సంస్కరణలు చేపట్టారు. మానవ హక్కులను, మత సామరస్యాన్ని ప్రోత్సహించారు. ఆదిలోనే వాటికన్ సిటీ రాజ్యాంగాన్ని సంస్కరించారు. న్యాయ వ్యవస్థలోనూ సంస్కరణలు చేశారు. ఇందులో బిషప్‌లు, కార్డినల్‌లపై వచ్చే నేరాభియోగాలపై వాటికన్ సిటీ కోర్టు మాత్రమే విచారించే అవకాశం ఉంటుంది. బిషప్‌ల అధికారాలను పెంచారు. పర్యావరణ, సామాజికాంశాలపై కూడా విశేషంగానే స్పందించారు. ఇతర సమాజం కన్నా ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగారు. లైంగిక సమానత్వాన్ని ప్రోత్సహించినా ,హోమోసెక్సువల్ వివాహాలను మన్నించలేదు. గర్భవిచ్ఛిత్తిని అమానుషంగా వర్ణించారు. సహజ కాన్పు కాని దానిని తల్లీ బిడ్డల గౌరవానికి భంగం కలిగించే చర్యగా అభివర్ణించారు. మహిళల, పిల్లల గౌరవాన్ని భంగం పరిచేదని భావించారు. ఫోర్నోగ్రఫిని కూడా పోప్ తప్పుపట్టిన అంశాలలో ఒకటి. వైవాహిక సంబంధం బలంగా ఉండాలంటే భార్యాభర్తల పట్ల ఒకరికొకరికి ప్రేమానురాగాలు పెంపొందించుకోవాల్సి ఉంటుందని పోప్ తరచు చెప్పేవారు. ఆదివారం నాడు ఏప్రిల్ 20, 2025న, సెయింట్ పీటర్స్ స్క్వేర్లో ఈస్టర్ వేడు కల సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ తన సాంప్రదాయ ఉర్బి ఎట్ ఓర్బి సందేశాన్ని అందించారు. తీవ్రమైన న్యుమోనియా నుండి కోలుకుంటున్నప్పటికీ ఉత్సాహంతో1 తన సందేశాన్ని వినిపించి, సర్వ సమాజాన్ని ఆనందపరిచారు. కార్డినల్ ఏంజెలో కోమాస్ట్రీకి మాస్ను అప్పగించినప్పుడు ఆయన ప్రసంగంలో ఈ సందేశం చదివి వినిపించారు. తన ప్రసంగంలో, పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచ సంఘీభావం, వలసదారులను ప్రేరేపించే అణగారిన వర్గాల పట్ల కరుణ చూపారు. ఉక్రెయిన్, గాజా, సూడాన్ ప్రాంతాలలో కొనసాగుతున్న సంఘర్షణలకు శాంతియుత పరిష్కారాల కోసం పిలుపునిచ్చారు. వాటికన్ వెబ్సైట్ ఈసారి ఆయన ప్రసంగ పాఠాన్ని తెలుగులో ఉర్బి ఎట్ ఓర్బి సందేశాన్ని అందించ లేదు. కానీ ఈస్టర్ ప్రసంగ పాఠాన్ని బయటకు వదలడం విశేషం. 2020 లో పోప్ ఫ్రాన్సిస్ ఫ్రాన్సిస్కో అనే డాక్యుమెంటరీలో హోమో సెక్సువల్ వ్యక్తులు ఒకే కుటుంబం చెందిన వారేనని వివరించారు. ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదమైనవని విశ్వాసులు చెబుతుంటారు. అక్రమ వలస దారులను బలవంతంగా పంపివేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలను కూడా పోప్ తప్పు పట్టారు. పోప్ జీవిత చరిత్ర గురించి 2018 లోనే వెండర్స్ అనే నిర్మాత పోప్ జీవిత చరిత్ర, విశేషాలపై ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని నిర్మించారు. వాటికన్ సిటీ ప్రోత్సాహం వల్లనే ఈచిత్ర నిర్మాణం జరిగింది. 2018లో కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. అమెరికాలో కూడా అదే ఏడాది ప్రదర్శితమైంది. విశేషమేమిటంటే ఆ చిత్రంలో పోప్ ప్రత్యక్షంగా వీక్షకులకు ప్రపంచ శాంతి ఆవశ్యకతపై తన సందేశ వాక్యాలను అందించారు. ప్రపంచగడ్డపై మత సామర్థ్యాన్ని, ప్రపంచ శాంతిని కాంక్షించే మహనీయుని కోల్పోవడంవిచారకరం. అనారోగ్యం కూడా సంప్రదాయ బద్ధమైన ఆనవాయితీలను వదలలేదు. ఆనవాయితీ ప్రకా రం కోలుకున్న వెంటనే సెయింట్ మేరీ మేజర్ బాసిలికా వెళ్ళి ప్రార్థనలు చేసి వచ్చారు. దైవ నిర్ణయమే అయినట్లు ప్రపంచ శాంతి సందేశాన్ని లోకానికి ఇచ్చిన పిమ్మట ఆయన పరలోకగతుడయ్యాడు. చాలాకాలంగా ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు కారణంగా పోప్ మాట్లాడేందుకు ఇబ్బంది పడడం తెలిసిందే. కాగా విశ్వమానవాళికి దివ్య సందేశం ఇచ్చే సమయంలో. గతంలో వలెనే ఉత్సాహంగా ఉన్నారని వాటికన్ నుంచి తెలిసిన సమా చారం. అమెరికా క్యూబా సంబంధాల పునరుద్ధరణలో కీలకపాత్ర పోషించారు. పేదల సంక్షేమం, వలసదారుల హక్కులు, లింగ సమానత్వం వంటి అనేకానేక సామాజిక అంశాలలో దృఢనిశ్చయంతో వ్యవహరించిన మానవతావాది. కోట్లాది మంది ప్రజల హృదయాలలో పోప్ ఫ్రాన్సిస్ కరుణ, వినయం ఆధ్యాత్మిక ధైర్యానికి ప్రతీకగా నిలి చిపోతారని ప్రధాని నరేంద్ర మోదీ సంతాప సందేశంలోపేర్కొన్నారు. ఏసుక్రీస్తు ఆశయాలకు అనుగుణంగా తన జీవితాన్ని మలచుకున్న ధన్యజీవి అని ఆయనకీర్తించారు. సమగ్రాభివృద్ధి పట్ల పోప్‌కి ఉన్న నిబద్ధత ప్రశంసనీయ మని శ్లాఘించారు. భారత ప్రజల పట్ల పోప్ చూపిన ప్రేమ ఆప్యాయతలు మరువలేనివని ప్రధాని విశ్లేషించారు.

అవినీతికి పాల్పడే వారికి చివరకు మిగిలేది ఆవేదనా, అవమానాలే.



స్మైల్స్

తక్కువ తెలుసుకోవడం, ఎక్కువ అర్థం చేసుకోవడం మనకు చాలా అవసరం.



మహాత్మాగాంధీ

# ప్రజావాక్కు



### వైద్యులకు సదుపాయాలు కల్పించాలి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీవిరమణ తర్వాత సిజిహెచ్ఎస్ పథకం ఆరోగ్య సేవలకు ఉంది. ఈ పథకంతోఉన్న ప్రస్తుత కేంద్రాలకు అద్దెభవనాలు ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వాలు వారి సొంతఅవసరాలకు వీరుఅద్దెకు ఇవ్వలేరు.వైద్యులకు,లబ్ధిదారులకు తగినవసతి,కనీస సదుపాయాలులేవు.వైద్యుల కొరత,పరిమిత కేంద్రాల వల్ల ఎన్నో సమస్యలు ఉన్నాయి. రాష్ట్ర కేంద్రాల్లో ఉన్నత అధికార్లు ఉండడంవల్ల వైద్యాధికారుల సమస్యలు వారికి విన్నవించడం తప్ప నిర్ణయం, మార్పులు చేసే అవకాశం లేదు. సంక్షేమ సంఘంవీటిని కేంద్ర అధికారులకు చేసిన ఫిర్యాదులు ఎన్నో అపరిష్కృతంగా ఉన్నాయి. ఈ పథకం ఉచితంకాదు.దీన్ని ఏ ఇతరపథకాలతో అనుసంధానం మేలు కాదని, దీన్నే అభివృద్ధి చేస్తే ఎంతో మేలు.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేయుచున్న ఉద్యోగ వికలాంగులకు ప్రమోషన్‌లలో 5 శాతం రిజర్వేషన్ తప్పనిసరిగా కల్పించాలి.ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు వర్తించే చట్టాలను ఉద్యోగ వికలాంగులకు కూడా తప్పనిసరిగా అమలు చేయాలి. ప్రమోషన్ ట్రాన్స్ ఫర్‌లలో ఉద్యోగ వికలాంగులకు వారికి అనుకూలమైన ప్రదేశాలలో విధులు నిర్వహించే విధంగా తగిన ప్రాధాన్యత కల్పించాలి. ఉద్యోగ వికలాంగులకు ఇంటి నుండి ఆఫీసుకు వెళ్లే సమయంలో ఆర్టీసీబస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. రాష్ట్రంలోని ప్రతి విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగ వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయడం వలన ఎంతోమంది మేలు కలుగుతుంది.

- డాక్టర్. ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి

ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులు మానసిక వత్తిడికి లోనవుతున్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 350(ఎ) ప్రకారం మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి. ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహించాలి.పుస్తకాల బరువుతగ్గించాలి. ఫీజులను నియంత్రించాలి. శారీరక శిక్షలు నిషేధించాలి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశంలోనే విద్యాబోధన చేయాలి. ఆట పాటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- పి. నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

### అవగాహన సదస్సులు నిర్వహించాలి

తెలంగాణలో ధరణి రద్దుచేసి భూభారతి యాప్‌లో భూ సమస్య లేకుండా చేసుకోటానికి ప్రజలలో రైతులకు అవగాహనా సదస్సులునిర్వహించడం, అధికారులను నాయకులను అభినందనలు కానీ గతంలో రైతు భూమిని వారస్వతంగా రావాల్సినది తండ్రి చనిపోయిన తర్వాత కుమారులకు ఖర్చు లేకుండా ఆటోమెటిగా అయేది నేడు ధరణిలో భూభారతి లోనైనా స్లాట్ బుక్ చేసుకుంటే మాత్రమే అవుతాది. ఇది ప్రభుత్వానికి మీసేవలకు ఆదాయమార్గం అవుతుంది. దేశంలో సైనికుడే రక్షకుడు రైతే లేకపోతే తిండి దొరుకాదు అందుకే రైతే రాజు కానీ రాయితీతో రైతుకూలీలకు తండ్రితదనంతరం భూమిని వారస్వతంగా స్లాట్ బుకింగ్ లేకుండా తక్షణమే కుమారుని పేరున భూమిని పట్టా చేసియివ్వాలి. రైతులను ప్రభుత్వ కార్యాలయం మీసేవ చుట్టూ ప్రదక్షిణ చేయకుండా చేసియివ్వాలి. భూమిని క్రయ విక్రయానికి స్లాట్‌బుకింగ్ పెట్టుకొని ప్రభుత్వానికి ఆదాయ వనరులను పెంచుకోవచ్చు.

- సింగు. లక్ష్మీనారాయణ జయశంకర్ భూపాలపల్లి

### తెలుగు మాధ్యమంలో వైద్యకోర్సులు

తెలుగు మాధ్యమాల్లో బైపీసీ ఎంపీసీ పూర్తి చేసి ఇంజినీరింగ్ లోవైద్యచదువుల్లో ఇంగ్లీషు మాధ్యమం చదివేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించిన ఈ తెలుగులోనే ఇంజనీరింగ్ మెడికల్ కోర్సులు అందించాలన్న ఈ ప్రయత్నం నిజంగా చాలా కొనియాడ తగినది.ఆయా సబ్జెక్టుల లో మంచి పట్టువున్న విద్యార్థులు ఆంగ్లంలో రాయడం అర్థం చేసుకోవడం కొంత ఇబ్బంది పడుతున్నారన్నది సత్యం. ఏదిఏమైనా కాన్సెప్ట్ అర్థం చేసుకోవడం ముందు ముఖ్యం. అది తెలుగులో బోధించుట ద్వారా కొంత కాన్సెప్ట్ మీద పట్టు వచ్చి ఏ విధమైన మెలికలు గల ప్రశ్న వేసినా రాయగల సమర్థత విద్యార్థికి వస్తుంది. ఎన్నో మంచి యూ ట్యూబ్ చానెల్స్ ఈ పాఠ్యంశాలలను తెలుగులో బోధించుట చూస్తున్నాం.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### పాల కల్తీని అరికట్టాలి

దేశవ్యాప్తంగా లభించే పాలలో 68 శాతం కల్తీవేనని ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ సర్వే తేల్చి చెప్పింది. కల్తీ పాల వల్ల క్యాన్సర్లు, జీర్ణాశయ సమస్యలు, పిల్లల్లో వినికిడి, దృష్టిలోపాలు తలెత్తవచ్చు. అధికారులు పాలకల్తీని అరికట్టాలి.

-ఎన్.సాయిరాజు, నల్గొండజిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpagevaarta@gmail.com)

# వంతెన నిర్మాణాలకి ముహూర్తమెప్పుడు?

**ఏటా వర్షాకాలం ముగియగానే పనులు మొదలు పెడతామని అధికారులు పేర్కొంటున్నారు. తీరా మళ్లీ వర్షాకాలం వచ్చేనాటికి కూడా ప్రారంభం కావడంలేదు. ఇలా రాష్ట్రాల్లో ఆర్‌అండ్ బి పరిధిలోని ముందుకు సాగని నిర్మాణాలతో ఏటా వర్షాకాలంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైదరాబాద్, వరంగల్ మహానగరంలోని మురికి నీరువ్యవస్థను ప్రణాళికా బద్ధంగా ముందు చూపుతో సకాలంలో పూర్తిచేయాలి. నగర వాసులకు చినుకుపడితే వండుటాకులా విలవిలాడుతున్న పరిస్థితుల నుండి కాపాడవలసిన బాధ్యత ఉంది. అలాగే రాష్ట్రంలోని గతంలో పిచ్చుక గూళ్లల్లా కూలి, కొట్టుకపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి వర్షాకాలంలోపే నాణ్యతతో యుద్ధ ప్రాతిపదిక మీద ప్రభుత్వం చేపట్టాలి. మొన్నటి అకాల భారీ వర్షాల బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.**



మేకిరి దామోదర్

మన రాష్ట్రంలో ఈ నెల 3న, మొన్న ఉరుములు, మెరుపులు, పిడుగుపాట్లతో గంటన్నరపాటు దంచి కొట్టిన భారీ వర్షంతో జనజీవనం అతలాకుతలమై స్తంభించింది. పండ్ల తోటలు, యాసంగి వరి,మొక్కజొన్న పంటలు రైతులు నష్టపోయారు. వేరు వేరు ఘటనల్లో మరణాలు సంభవించాయి. పలుచోట్ల చెట్లు కూలాయి, విద్యుత్ స్తంభాలు విరిగాయి. రోడ్లు వరద నీటితో వాగులను తలపించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మురుగు నీరు కాల్వలు పొంగిపొర్లి ఇళ్లల్లోకి చేరింది. ఇప్పుడే ఇలా ఉంటే? రాబోయే వానాకాలాన్ని తలుచుకుంటే భయమేస్తోంది!. ఇది హెచ్చరికగా భావించి 'చేతులు కాలాక ఆకులు పట్టుకొని' లాభంలేదు. ప్రభుత్వం, అధికారయంత్రం ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలి. వర్షాల వల్ల నగరంలోని నాలల్లో వరద నీరు సాఫీగా ముందుకు వెళ్లడానికి ఏటా వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు చేపడుతుంటారు. వీటి కోసం జీహెచ్ఎంసీ అధికారులు ఏటా సగటున రూ. 50 కోట్లు వెచ్చిస్తారు. ఈ లెక్కన గత నాలుగేళ్లలో 200 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇంతగా ప్రజాధనం వ్యయవుతున్నా!. వరద నీటి వ్యవస్థ ఆశించినట్లుగా మెరుగుపడడం లేదు. నగరంలో ఈ నెల 3న, మొన్న సాయంత్రం కురిసిన వర్షంతో తేటతెల్లమైంది. ఆ రోజు ఏకంగా 151ప్రాంతాల్లో రోడ్లపై వరద ఉధృతంగా పారింది. బైక్‌లు,కార్లు కొట్టుకుపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ప్రయాణికులు మెట్రో స్టేషన్ల వైపు పరుగులు పెట్టారు. అర్ధరాత్రి దాటింతే వరకు ఇళ్లల్లోకి చేరుకోలేకపోయారు. ఈ పాటి వర్షానికే ఈ దుస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తుంది. వర్షం కురిస్తే జీహెచ్ఎంసీ అధికారులకు పండుగే. రోడ్లపై నిలిచే నీటిని తోడేందుకు అత్యవసర పేరిట పనులు చేపట్టి, తర్వాత బిల్లులు సమర్పిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ పనులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. పైగా నీటి వివరాలను బహిర్గతం చేయడం లేదు. పూడికతీత పనుల్లోనూ ఇష్టానుసారంగా నిధులు ఖర్చు (స్వాహా)చేస్తున్నారని, తోడిన మట్టిని ఎక్కువ చేసి చూపిస్తున్నట్లు విమర్శలున్నాయి. తప్పుడు లెక్కలు ఉంటున్నాయని ప్రజాప్రతిని సైతం ఆరోపిస్తున్నారు.ప్రస్తుత ఏడాది కోసం ఇటీవల 203 పూడికతీత పనుల టెండర్లను పిలిచారు. వాటిలో 9 టెండర్ల దశలో, 97 మొబిలైజేషన్ దశలో, 97 కొనసాగుతున్న దశలో ఉన్నట్లు తెలుస్తోంది. గుత్తేదారులు దాదాపు 30శాతం తక్కువ ధరలకు ఈటెండర్లను దక్కించుకుంటున్నారంటే? ఇందులోని మతలబు అర్థం చేసుకోవచ్చు!. వరద పారేందుకు నాలాల సామర్థ్యం సరిపోవడం లేదనీ దీనికి పరిష్కారంగా భూగర్భంలో ట్యాంకులను నిర్మించాలని అధికారులు ప్రతిపాదించగా 2024-25 సంవత్సరానికిగాను రూ.15 కోట్లతో 22 పనులను మంజూరు చేశారు.



వర్షాల సమయంలో దిగువ ప్రాంతాలుముంపనకు గురికాకుండా నాలాల్లో ప్రవేశిస్తున్న వరద నీటిని ఈ భూగర్భ ట్యాంకులలోకి మళ్లిస్తారు. వర్షం తగ్గాక మోటార్లతో ఎత్తి పోస్తారు. ఇలాంటివి ఖైరతాబాద్ వద్ద రూ. 3.08 కోట్లతో రెండింటిని,(4లక్ష లీటర్ల, 3లక్షల లీటర్ల సామర్థ్యం) నిర్మిస్తున్నారు. అలాగే పీవీఎన్ఆర్ ఫిల్లర్ 254, లంగర్ హౌస్, రాంనగర్, ఇమేజ్ ఆసుపత్రి, రంగమహల్, కేపిహెచ్‌బీ, సచివాలయం, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, రాజేంద్ర నగర్లోనూ నిర్మిస్తున్నారు. ఇవి ఏమేరకు ఫలితాలు ఇస్తాయనేది తేలాల్సి ఉంది. అయితే భూగర్భ ట్యాంకుల నిర్మాణం కంటే, నాలాల సామర్థ్యం పెంచుకోవడం మంచిదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మన మహానగరంలో నాలాల పొడవు 1,300 కి.మీ భూగర్భంలో ఉన్నవి 910 కి.మీ ఓపెన్ నాలాలు 390 కి.మీ హైదరాబాద్ మహానగరంతో పాటు, వరంగల్ లాంటి చోట మురునీటి నాలాల పరిస్థితి ఇలానే దుర్భరంగా ఉంది?. మన రాష్ట్రంలో రోడ్ల భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు వంతెనలనిర్మాణ పనులు కొన్నేళ్లుగా అర్థాంతరంగా ఆగిపోయాయి. గతేడాది, అంతకు ముందు కురిసిన భారీ వర్షాలకు పలు వంతెనలు, రోడ్లు పిచ్చుక గూళ్లలా కొట్టుకుపోయాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులు చేసివదిలేశారు.మళ్లీ భారీవర్షాలు కురిస్తే పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న వాటితోపాటు కొత్తగా నిర్మించాల్సిన హైలెవెల్ వంతెనలు 193 ఉన్నాయి. వీటిని పూర్తి చేసేందుకు రూ. 843 కోట్లకు పైగా అవసరమని అధికారులు గతంలో అంచనా వేశారు. కొన్నిచోట్ల టెండర్ల ప్రక్రియ పూర్తయిన బిల్లులు వస్తాయో లేదో అనిపనులు ప్రారంభించడానికి గుత్తేదారులు వెనకాడుతున్నారు. మరికొన్ని చోట్లపనులను ప్రారంభించినా బిల్లులు రాలేదని మధ్యలోనే వదిలేశారు.మరోవైపు ప్రస్తుతం నిర్మాణ సామాగ్రి ధరలు బాగా పెరిగాయి, ఎప్పుడో పిలిచిన టెండర్లధరలతో ఇప్పుడు పనులు చేయలేమంటూ గిట్టుబాటు కావడం లేదంటూ గుత్తేదారులు ఆసక్తి కనబరచడం లేదు.వంతెననిర్మాణం పూర్తికాక ఏటావర్షాకాలంలో వాగులు పొంగి పొర్లినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోయి స్థానికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వరదలు పోటెత్తినప్పుడు వాగుల్లో కొట్టుకుపోయి ప్రాణాలుపోయిన ఘటనలూ చోటు చేసుకున్నాయి.ఏటా వర్షాకాలం ముగియగానే పనులు మొదలు పెడతామని అధికారులు పేర్కొంటున్నారు. తీరా మళ్లీ వర్షాకాలం వచ్చేనాటికి కూడా ప్రారంభం కావడంలేదు.ఇలా రాష్ట్రాల్లో ఆర్‌అండ్ బి పరిధిలోని ముందుకు సాగని నిర్మాణాలతో ఏటా వర్షాకాలంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైదరాబాద్, వరంగల్ మహానగరంలోని మురికి నీరువ్యవస్థను ప్రణాళికా బద్ధంగా ముందు చూపుతో సకాలంలో పూర్తిచేయాలి. నగర వాసులకు చినుకుపడితే పండుటాకుల విలవిలాడుతున్న పరిస్థితుల నుండి కాపాడవలసిన బాధ్యత ఉంది. అలాగే రాష్ట్రంలోని గతంలో పిచ్చుక గూళ్లల్లా కూలి, కొట్టుకపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి వర్షాకాలంలోపే నాణ్యతతో యుద్ధ ప్రాతిపదిక మీద ప్రభుత్వం చేపట్టాలి. మొన్నటి అకాల భారీవర్షాల బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులుచేపట్టాల్సిన అవసరం ఉంది. ●

# పరువు హత్యలా! దురహంకార నిదర్శనమా?

జి. అజయ్ కుమార్

వేరే కులం, వేరే మతం వారిని ప్రేమించారన్న కారణంతో కొన్ని చోట్ల కూతుర్ని, మరికొన్ని చోట్ల ఆమె ప్రేమించినవాడిని బలితీసుకుంటున్న అమానుష దృశ్యాలు మన చుట్టూ నిత్యకృత్యంలా మారాయి. చిన్నతనం నుంచి ఎంతో అల్లారు ముద్దుగా పెంచిన తమ పిల్లలని ఎదిగిన తరువాత తన ఇష్టానుసారం నచ్చిన వాడిని ప్రేమించి పెళ్లి చూసుకోవడం నేరంగా చూస్తున్న కొంత మంది తల్లిదండ్రులు పరువు అనే భ్రమలో విచక్షణ మరిచి ప్రవర్తిస్తున్నారు. పరువు హత్యలు అనే ముసుగులో కన్న వారిని క్రూరంగా చంపుకుంటున్నారు. ఇది పరువు కోసం కాదు, కుల దురహంకారపు ఆకృత్యం. తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన పరువు హత్యల పేరిట జరుగుతున్న దురహంకార హత్యలు – ఇది ప్రేమ మీద మాత్రమే దాడి కాదు, కులం, మతం, మనిషి మనుగడ మీద దాడి. మిర్యాలగూడలో ప్రణయ్, సూర్యాపేటలో కృష్ణా కేసులు మీడియా లోకానికి తెలిసినవే. కానీ ప్రతి రోజు ఇలాంటివి ఎన్నో సమాజంలో జరుగుతున్నాయి. అలాంటి వాటిల్లో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మావత్వానికి మాయని మచ్చగా, కుల, మతోన్మాదానికి పరాకాష్టగా మారాయి. అనంతపురం జిల్లాలో తండ్రి, తన కూతురు వేరే కులం వాడిని ప్రేమించిందనే కారణంతో దారుణంగా హత్య చేయడం, హయత్ నగర్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చెల్లెలు కులాంతర వివాహం చేసుకుందని నడిరోడ్డుపై తమ్ముడు నరికిచంపడం, చిత్తూరు జిల్లాలో ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్న యువతి అనుమానాస్పద మృతి, ఇలాంటివి ఎన్నో ఇటీవల కాలంలో మానవ సంబంధాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రక్త సంబంధికులే రాక్షసుల్లా ప్రవర్తిస్తున్న సంఘటనలు నానాటికి పెరుగుతున్నాయి. వేరే కులం, వేరే మతం వారిని ప్రేమించారని కన్నపిల్లలని చంపడం పరువా? కాదు మానవత్వానికి మాయని మచ్చ, ఆటవిక క్రూరత్వానికి పరాకాష్ట. అది గౌరవం కాదు. అది ఓ క్రూరమైన అహంకారపు చీకటి కోణం,ఇలాంటి చర్యల వలన పరువు పెరగటం కాదు వున్న పరువు పోయి జీవితాంతం నేరస్థుడిగా మిగిలి కుటుంబాలకు క్షోభను మిగిలించడం తప్ప ఏమి ఉపయోగంఉండదు. వివాహం లేదా ప్రేమ సంబంధం కులాంతరంగా, మతాంత



రంగా ఉంటే అది 'ఇంటి పరువు' 'కుటుంబ గౌరవానికి' భంగం అని భావించి కుటుంబ సభ్యులే హత్యకు దిగే పరిస్థితులు ఎదురవుతున్నాయి.యువత సాంప్రదాయాలుపాటించకుండా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించినా, స్వేచ్ఛగా జీవించాలనుకున్నా పెద్దలు దాన్ని సహించలేక ఘోర నిర్ణయాలు తీసుకునే పరిస్థితి. అమ్మాయి తనకు ఇష్టమైన వ్యక్తిని ప్రేమించడం, వివాహం చేసుకోవాలనుకోవడం వంటి విషయాలు కొన్ని కుటుంబాల్లో తట్టుకోలేరు. వారుతీసుకునే నిర్ణయాన్ని అవమానంగా' భావించి హత్యలు చేస్తున్నారు 'మీ ఇంటి పిల్ల పరువు తక్కువ పనిచేసింది?' అన్న మాటలు వింటే తట్టుకోలేమనే భయం. తాతలు, పినతండ్రులు, బంధువుల మాటలవల్ల కుటుంబ పెద్దల గౌరవాన్ని కాపాడుకోవాలనే మానసిక స్థితిలోహింసకు పాల్పడుతున్నారు. పెద్దలు,కుటుంబ సభ్యులు పిల్లలమానసిక స్థితిని, ప్రేమను, అభిప్రాయాలను ఆలోచనలను అర్థం చేసుకోలేకపోవడం. హత్యశిక్షార్హ నేరం. ఇలాంటి వాటికి తీవ్రమైన శిక్షలుంటాయి కానీ సమాజంలో మనుషుల ఆలోచనా ధోరణి మారనంత కాలం ఎన్నిచట్టాలు వున్నా ఉపయోగంలేదు. కుటుంబాలలో, పాఠశాలల్లో, గ్రామ స్థాయిలో ప్రేమ, సంబంధాలు, వివాహ స్వేచ్ఛ,వ్యక్తిగత హక్కులపై అవగాహన కల్పించాలి. 'పరువు'అన్నది ప్రాణాల కంటే పెద్దదికాదని తెలియ చేయాలి. పరువు హత్యలకు ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. అతిత్వరగా విచారణలు జరిపి శిక్షలు అమలుచేయాలి.దోషులెవ్వరైనా క్షమించరాదని న్యాయవ్యవస్థ స్పష్టంగా చాటాలి. తల్లిదండ్రులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం. పిల్లలపై పట్టుకాదు, ప్రేమతో బంధం అవసరమని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.తల్లిదండ్రులు పిల్లల అభిప్రాయాలను వినే పరిస్థితిని కల్పించాలి. ప్రేమ,వయసు, అర్థం చేసుకోవడం, సంయమనం అనే అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలి. సంబంధాల్లోస్పష్టత, బాధ్యత అనే భావనలు నేర్పాలి. అమ్మాయిలకు స్వేచ్ఛ, విద్య, ఆత్మవిశ్వాసం ఇవ్వాలి. వారు తమ నిర్ణయాలు తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండాలి. కుల సంఘాలు, మతనాయకులు ప్రగతిశీలమైన సందేశాలు ఇచ్చేలా ఒత్తిడి తేవాలి. మతాల పేరుతో హింసను ప్రేరేపించే కార్యక్రమాలు నియంత్రించాలి. బాధితులను పరువు కోసం ప్రాణాలు తీసే సమాజం కన్నా ప్రేమ కోసం ప్రాణాలు కాపాడే సమాజమే అవసరం. కులం,మతం కంటే ముందు మనమంతా మనుషులం అని గుర్తుంచుకోవాలి. ●

# ధరిత్రీ రక్షణకు శపథం చేద్దాం

రామ కిష్టయ్య సంగన భట్ల

సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచ భూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింపబడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఈ క్రమంలోంచి వచ్చిందే 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం'. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న 'ధరిత్రి దినోత్సవం' జరుపుకుంటున్నారు. 1962లో అమెరికన్ సెనెటర్ నెల్సన్‌కి వచ్చిన ఆలోచనకు ప్రతిరూపమే ఈ ధరిత్రీ దినోత్సవం. 1969 లో నెల్సన్ మన వాతావరణంలో జరిగే మార్పులనూ వివరిస్తూ మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మన వంతు ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ తన మిత్రులకు ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ఈ ధరిత్రీ దినోత్సవం గూర్చి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రీ దినోత్సవం జరిగింది. ఆరోజు ఆ దేశంలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేసారు. ఇలా తొలుత అమెరికాలో ప్రారంభమైన ఈ ఉత్సవం ఆ తర్వాత ప్రపంచ వ్యాపితమైంది. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయి ఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలో ప్రారంభం కావడం విశేషం. 50 ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. అప్పటి నుంచీ సుస్థిర అభివృద్ధి కోసం ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా 175కంటే ఎక్కువ దేశాల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అనాలోచిత మానవ చర్యల వల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగామనిషి





చేస్తున్న పనుల వల్ల భూగోళం అమితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయు కాలుష్యం పెచ్చు మీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పదిలంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియోగించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్ధే సుస్థిరాభివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించుకోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించగలగాలి. అడవుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్సరంలో "పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విషవాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ల, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతోపాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఏదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ●

# గంజాయితోపాటు విగ్రహాల చోరీ ముఠా అరెస్ట్

- 17 కేసుల్లోని నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- నాలుగు కేజీల గంజాయి, ఆలయాల్లో చోరీ చేసిన బంగారు, ఇత్తడి విగ్రహాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాధీనం
- పది లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం
- అభినందించిన ఎస్పి ఏ.ఆర్ దామోదర్



**సింగరాయకొండ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

అంతర్ జిల్లాల్లో పలు దేవాలయాల్లోని విగ్రహాలు చోరీ, గంజాయి తరలిస్తున్న నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్దనున్న పది లక్షల రూపాయల విలువచేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ. సి.హెచ్. హజరత్తయ్య చెప్పారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరాయకొండ మండలం, పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గుజ్జుల యలమందరెడ్డి నగర్‌లో అక్రమంగా గంజాయి అమ్ముతున్న కుంచాల గురువమ్మ 62 సంవత్సరాల మహిళ ఇంటి ముందు ఉదయం సమయంలో గంజాయి రవాణా చేస్తున్న నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు. గుజ్జుల ఎలమందరెడ్డి నగర్ కు చెందిన కుంచాల గురువమ్మ చెన్నయ్యలు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తు వచ్చిన సరిపోకపోవడంతో రాజమండ్రి వెళ్లి నాలుగు కేజీల గంజాయి తక్కువ రేట్ కు ఒక్కో కేజీ 1500 రూపాయలు లెక్కన తీసుకొని వచ్చి పదివేల రూపాయలకు అమ్ముకొని ఎక్కువ డబ్బులు సంపాదిస్తూ ఉంటుందని సిఐ తెలిపారు. ఈ మహిళతో పలు దొంగతనం కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న ఒంగోలు మండలం, పెర్ల మెట్టకు చెందిన చెడుతోటి, టి. మధుబాబు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలంకు చెందిన రాకాలి దుర్గారావు, గుంటూరు జిల్లా, లాలాపేటకు చెందిన కల్లం రవికుమార్ లు ఈ మహిళ వద్దకు తరచూ వెళ్లడం పరిచయం ఏర్పడడంతో కేజీ 5000 రూపాయలకు ఆమె వద్ద కొనుక్కొని చిన్న చిన్న ప్యాకెట్స్ చేసి అమ్ముకుంటూ డబ్బులు సంపాదించుకుంటున్నారని సిఐ తెలిపారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కుంచాల గురువమ్మ ఇంటి వద్ద ఈ ముగ్గురు ముద్దాయిలు వచ్చి గంజాయి కావాలని అడగడంతో ఆమె గోతం లో నుంచి తీసి కేజీ గంజాయి ప్యాకెట్లను ఇస్తుండగా పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకొని వారి వద్దనున్న నాలుగు కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ ముద్దాయిలను పూర్తిస్థాయిలో విచారించగా 17 కేసుల్లో నిందితులుగా ఉన్న తేన్నీరు మధుబాబు, రాకాలి దుర్గారావు, కల్లెం రవి కుమార్ ఈ ముగ్గురు నిందితులు దొంగిలించిన 10 లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు పలు ఆలయాల్లో చోరీ చేసిన బంగారు, ఇత్తడి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. జిల్లాలో పలు దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడి విగ్రహాలను దొంగిలిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించినట్లు సిఐ తెలిపారు. వారి వద్దనున్న మూడుసార్లు బంగారం, పావు కేజీ వెండి, ఇత్తడిగంటలు, రాగి వస్తువులు,అమ్మవారి పంచలోక విగ్రహాలు, శిలా తోరణాలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను వారి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకొని సొత్తును రికవరీ చేసినందుకు సిఐ. హజరతయ్య, ఎస్సై బి. మహేంద్ర పోలీస్ సిబ్బందిని డి.ఎస్.పి .ఆర్ శ్రీనివాసరావు, ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## పోలేరమ్మ కొలుపులు



**దొనకొండ,ఏప్రిల్ 21,ప్రభాతవార్త**

దొనకొండ మండలం పి వెంకటాపురం గ్రామంలో పోలేరమ్మ కొలుపులు కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి లీలితి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి గారు,జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

పడమర వెంకటాపురం గ్రామంలో అమ్మవారి కొల్లుపులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌తో పాటు పడమర వెంకటాపురం గ్రామ టిడిపి నాయకులు, మండలం లోని వివిద హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**దొనకొండ,ఏప్రిల్ 21,ప్రభాతవార్త**

దర్శి నియోజకవర్గం వ్యాప్తంగా రైతులు పండించిన మిర్చి, పొగాకు గిట్టుబాటు ధర లేకపోవడం, అకాల వర్షాలతో బొప్పాయి, మొక్కజొన్న పంటలను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంలో ఈ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది, మిర్చి రైతుకు ఎకరాకు లక్ష ఖర్చు వస్తుంటే కనీసం 25000 గిట్టుబాటు ధర లేకపోవడం దారుణం, ఇప్పటికైనా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వాళ్లని ఆదుకోవాలి, అలాగే అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్న. కైపు వెంకటకృష్ణా రెడ్డి అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్

## మైమరిపించిన త్యాగరాజ సంగీత విభావరి

**ఒంగోలు కల్చరల్ ఏప్రిల్ 21,ప్రభాతవార్త**

త్యాగరాజ సేవ సమితి వారి పంచమ మాస సంగీత కార్యక్రమలను గాయత్రీ మందిరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సంగీత విభావరి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు మంగమూరు డొంకలోని గాయత్రి మందిరంలో సోమవారం సాయంత్రం ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షులు గాయత్రీ మందిరం కమిటీ సభ్యులు కాలభైరవ ఉపాసులు మైనంపాటి సాయికుమార్ జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాలను ప్రారంభించారు. సంగీత ఉపాధ్యాయినిభాగ్యలక్ష్మీ ృ వారిచే సంగీత విభావరి గాత్ర కచేరి గణపతి ప్రార్థనతో ప్రారంభించారు. అనంతరం త్యాగయ్య అనంత పద్మనాభ స్వామి కీర్తనలను మధురముగా గానము చేసి శ్రోత్రలను ఆకట్టుకున్నారు. స్వర్ణబ్రహ్మ వీరిశెట్టి బ్రహ్మానాయుడు క్యాషియో, లయ బ్రహ్మ పురాణం మురళీకృష్ణ మృదంగం సహకార వాయిద్యములు అందించి సహకరించారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజసేవ సమితి అధ్యక్షులు పిన్నంరాజు నరసింహారావు, పుల్లేటికుర్తి నాగేశ్వరరావు, కొప్పోలు ఫణి రాజు, గుడ్లూరు మురళీకృష్ణ భక్తులు పాల్గొనినారు.

## విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం


- కదిరి పార్థసారధి



**సీఎస్‌పురం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు విద్యాభ్యాసంలో భాగంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచనల మేరకు జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని సోమవారం కళాశాలసెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారధి ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం కదిరి పార్థసారధి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో వ్యవసాయ రంజగాన్ని అభివృద్ధి చేసి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని విద్యార్థులను కోరారు. అదే విధంగా వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ శిక్షణలో భాగంగా జాతీయ సేవా పథకం కింద వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు శీలంవారిపల్లి గ్రామంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో పంటలకు సంబంధించిన సలహాలు సూచనలు, అధిక దిగుబడి సాధించడానికి తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అదే విధంగా కళాశాల డీన్ డాక్టర్ వీరన్న గౌడ్ మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కళాశాలలో లాబ్స్ ఉన్నాయని, రైతులు విత్తన శుద్ధి, నేలసారవంత పరీక్షలు నిర్వహించబడుతుందని, రైతులు గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు సేంద్రీయ ఎరువులతో పండించిన ఆకు కూరలు, కూరగాయాలు గ్రామస్తులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఫ్రోగ్రాం ఇన్‌చార్జీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్యా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, ఐకార్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రామస్వామి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, మాజీ ఎంపీటీసీలు మురం కాశిరెడ్డి, మునగల నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ టి.బాబురావు, స్కూల్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, శీలం మాధవ, కొట్టే శ్రీనివాసులు, షేక్ నాయబ్ రసూల్, రోశయ్య, సుబ్బారెడ్డి, గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## లీకవుతున్న పైపులైను.. వృధాగా పోతున్న సాగర్ నీరు



**కొనకనమిట్ల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన కొనకనమిట్ల ఎస్సీ కాలనీలో సాగర్ నీటి పైపు లైన్ పలు చోట్ల దెబ్బతిని లీకవుతుంది. దీంతో నీరు వృధాగా పోవడమే కాకుండా నీరు కలుషితమవుతుందని కాలనీ వాసులు అంటున్నారు. దెబ్బతిన్న పైపులోకి వృధా మురికి నీరు చేరి కుళాయిలకు కలుషిత నీరు వస్తుందంటున్నారు. ఏపిపాఠశాల వద్ద పైపుకు రంధ్రం పడి నీరు వృధాగా పోతుంది. శివారు ప్రాంతాలకు నీరు సక్రమంగా సరఫజా జరగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న పైపులైనుకు మరమ్మత్తులు చేపట్టాలని కాలనీ వాసులు అభ్యర్థిస్తున్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అంబులెన్స్‌లను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఇంటర్‌రైజ్ సంస్థ వారు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అందజేసిన 5 బీఎల్ఎస్ అంబులెన్స్‌లను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సోమవారం ప్రారంభించి వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించడం జరిగింది. ఈ అంబులెన్స్‌లు సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్, టంగుటూరు టోల్‌ప్లాజా, జాతీయ రహదారి-16 వారి సీఎస్ఆర్‌మద్దతుతో అందించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరక్టర్ ఎం.విద్యాసాగర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, ఎస్ఈఎల్ తరుపున ప్రాజెక్టు హెడ్ కే.శివకుమార్, టీమ్ లీడర్ సురేష్‌బాబు, సింహపురి సీఎస్ఆర్ కోఆర్డినేటర్ దండా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 672 ఉపాధ్యాయ పోస్టులు

- మెగా డీఎస్సీ ప్రకటనతో ఆశావాహుల్లో హర్షాతిరేకలు
- మనసు పెడితే మీరే మాస్టరు
- గురువుల.. కొలువుల పండుగ
- మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ 2025 నోటీఫికేషన్ వచ్చేసింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం భారీగా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకిఆదివారం నోటీఫికేషన్ ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతిష్ఠాత్మక హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. సుమారు 8ఏళ్ల తరువాత మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వంలోనే గురువుల పోస్టులకు ప్రకటన విడుదలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు ఇక్కడ కోచింగ్ సెంటర్లకు వచ్చి ఏళ్లగా శిక్షణ పొందుతున్న అభ్యర్థుల ముఖాల్లో చిరునవ్వులు వికసిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, ఆదర్శ, రెసిడెన్సియల్ పాఠశాలలో తెలుగు, హింది, ఆంగ్లం, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రాలు, స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలు కలిపి 629 పోస్టులు, గిరిజన, సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలో మరో 43 ఎస్జీటీ, ఎస్ఏ ఖాళీలు కలిపి మొత్తం 672 పోస్టులు భర్తీ కానున్నాయి. ఈసారి నియామకాల్లో కొన్ని నిబంధనలు మార్పు చేశారు. గతంలో 2 శాతంగా ఉన్న క్రీడా కోటను 3 శాతానికి పెంచారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఎస్సీ రిజర్వేషన్‌కు వర్గీకరణ ఫలాలు అమల్లోకి రానున్నాయి. ఆ ప్రకారం రోస్టర్ అమలు చేసి మాల, మాదిగ, రెల్లీ కేటగిరిల వారీగా పోస్టులు కేటాయిస్తారు. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 333 పోస్టులు భర్తీ చేసింది. తరువాత మళ్లీ ఏడేళ్లకు భారీగా నియామక పక్రియకు శ్రీకారం చుట్టడంతో ఆశావాహుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 30వేల మందికి పైగా కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేల మంది అభ్యర్థులు నోటీఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశాక మొతటి సంతకం మెగా డీఎస్సీపై పెట్టడంతో అభ్యర్థులు కోచింగ్ కేంద్రాలకు వరుస కట్టారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 30 వేల మందికి పైగాబీఈడీ పూర్తి చేసిన వారు ఉన్నారు. శిక్షణా కేంద్రాల్లో రాత్రింబవళ్లు డీఎస్సీకి సిద్ధమవుతున్నారు. శిక్షణా కేంద్రాలన్ని కిటకిటలాడుతున్నాయి. ఈ డీఎస్సీలో అభ్యర్థుల వయో పరిమితి పెంచారు. జనరల్ అభ్యర్థులకు 42 నుంచి 44 సంవత్సరాలకు పెంచారు. రిజర్వేషన్ అభ్యర్థులకు మరో ఐదు సంవత్సరాల వయసు సడలింపు ఉంటుంది. రిజర్వేషన్ అభ్యర్థులకు 49 వయస్సు వరకు అవకాశం. దివ్యాంగులకు 54సంవత్సరాల వరకు అవకాశం కల్పించారు. వయో పరిమితి పెంచడంతో జిల్లాలో సుమారు 3 వేల మంది అభ్యర్థులకు డీఎస్సీ రాయడానికి అవకాశం కలిసొచ్చింది. ఆదివారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. మే 20 నుంచి నమూనా పరీక్షలు, 30 నుంచిహాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్, జూన్6నుంచి జూలై 6వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఐటీసెల్ ద్వారా అవసరమైన డేటా సిద్ధం చేసినట్లు డీఈఓ కిరణ్ కుమార్ తెలిపారు.మే 31నాటికి ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల పక్రియ పూర్తి చేసి జూన్ మొదటి వారంలో డీఎస్సీ నిర్వహిస్తారు. అన్ని పూర్తయ్యాక చివర్లో మిగిలిన పోస్టులను మినిమం టైం స్కేల్‌తో పని చేస్తున్న వారికి కౌన్సిలింగ్ ద్వారా కేటాయిస్తారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు





**ఒంగోలు, ప్రభాతవార్త**

సోమవారం ఒంగోలు నగరంలో జరిగిన పలు కార్యక్రమాలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. నగరంలోని 15వ డివిజన్ కాపు సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రం నందు ఏపీ ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ వారి జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని 24వ డివిజన్ ముస్లిం షాదీఖానా నందు హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరి సోదరీమణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్నొగ్నారు. ఒంగోలు నగరంలోని కలెక్టర్ కార్యాలయం నందు నేషనల్ హైవే అధికారులతో ఒంగోలు పడమర బైపాస్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనసభ్యులు విజయ్‌కుమార్, మేయర్ సుజాతలతో కలిసి పాల్గొన్నారు.

## అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



**ఒంగోలు, ప్రభాతవార్త**

మీ కోసం కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్ధేశించిన గడువు లోపు పరిష్కరించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని జిల్లాకలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందుకు ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్ధేశం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని ఆమె చెప్పారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ బి.చిన్న ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, వరకుమార్, డిప్యూటీ కలెక్టర్లు పార్ధసారధి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

- ప్రజా సంఘాల డిమాండ్



**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

చెర్వుకొమ్ముపాలెంలో దళితుని భూమి కబ్జాకు యత్నించిన విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామస్తుడైన తాటిపర్తి వెంకయ్యకు 1992లో ప్రభుత్వం 40 సెంట్లు భూమి కేటాయిస్తే ఆయన కుమారులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని, ఇటీవల బిఇడి కాలేజీని కొనుగోలు చేసిన వారు ప్రక్కనే ఉన్న దళితుని భూమిని కబ్జా చేసేందుకు యత్నించారని, గత ఏడాది గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, తాలూకా పోలీస్‌లు విచారణ జరపకుండా ఫిర్యాదుదారుడు ఆసక్తిగా లేదని కేసు క్లోజ్ చేయడం శోచనీయమన్నారు. తక్షణమే జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని దళితుని భూమిని కాపాడాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఓపిడిఆర్ సుధాకర్, ధరణికోట లక్ష్మీనారాయణ, పేరం సత్యం, అజీజ్, దాసరి సుందరం, జం డ్రాజుపల్లి ఆంజనేయులు, మిరియం అంజిబాబు, అంగలకుర్తి ప్రసాద్, వేడుకొండలు, మస్తాన్‌రావు, బాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరించిన ఎంపి మాగుంట



**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవ గోడపత్రికను పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం అందరూ పనిచేయాలని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి వుందని, అన్ని పథకాలు అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జి.వీరభద్రాచారి మాట్లాడుతూ ఈ నెల 24, 27 తేదీలలో జరిగే పంచాయితీరాజ్ దినోత్సవ వేడుకలలో గ్రామాభివృద్ధిపై సదస్సులు నిర్వహిస్తామని, ముగింపు సభలో ప్రముఖుల చేతుల మీదుగా బెస్ట్ లోకల్ లీడర్ అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

# అట్టహాసంగా శ్రీ చెన్నకేశవుని రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- జై చెన్నకేశవ,,, జై జై చెన్నకేశవ నినాదంతో మారుమ్రోగిన మార్కాపురం



**మార్కాపురం, ఏప్రిల్ 21,ప్రభాతవార్త**

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంబరాన్ని అంటాయి, సోమవారం జరిగిన. స్వామివారి రథోత్సవ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో మార్కాపురం పట్టణం జనసంద్రంగా మారింది, జై చెన్నకేశవ,, జై జై చెన్నకేశవా,, నినాదాలతో మార్కాపురం పట్టణం మారు మ్రోగింది,, యుగ యుగాల దేవుడు, పశ్చిమ ప్రకాశ ప్రాంత ప్రజల కల్పతరువు, నమ్మినవారికి కామధేనువూ, అభీష్ట వరప్రదుడు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని దర్శించి ధరించేందుకు ఇరు తెలుగు రాష్ట్రాల నుండి కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా భక్తులు విశేషంగా హాజరు కావడంతో పట్టణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది, చిక్ మంగళూరుప్రాంతానికి చెందిన మోదాలా చారిటబుల్ ట్రస్ట్ అధినేత మోదాల వెంకటరామయ్య రథోత్సవ కార్యక్రమ ఉభయదాతగా వ్యవహరించారు, దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో రథోత్సవ కార్యక్రమాన్ని అంబరాన్ని అంటేలా నిర్వహించారు,ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు దేవతా మూర్తులను ఉత్సవ మూర్తులుగా శోభాయ మానంగా అలంకరించి రథంపై అధిరోహించారు,కార్యనిర్వహణ అధికారి గోలమారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖసిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, జూనియర్ సివిల్ జడ్జ్ కిషోర్ కుమార్ ,వైకాపా మార్కాపురం నియోజకవర్గ సమన్వయ కర్త మాజీ శాసనసభ్యులు అన్నారాంబాబు,కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త ఇమ్మడికాశీనాథ్,సీనియర్ శాసన సభ్యులు కేపీ.కొండారెడ్డి,టిడిపి నాయకులు ఎం.వెంకటరెడ్డి, గుంటక సుబ్బారెడ్డి,యువ నాయకుడు కందుల రామిరెడ్డి, శాసనాల వీర బ్రహ్మం, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, చైర్మన్ బాలమురళీకృష్ణ,బ్రహ్మోత్సవకమిటీ చైర్మన్ కాశీవిశ్వనాథంలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు,ఎస్పీ ఏ ఆర్‌దామోదరం ఆదేశాల మేరకు డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో సీఐ పీ.సుబ్బారావు నేతృత్వంలో భారీపోలీసు బందోబస్తు నిర్వహించగా సుమారు 200 మంది పోలీసులు పాల్గొనిశాంతి భద్రతలను పర్యవేక్షించారు,













# అన్నెంకు పానెం నివాళి

**కొరిశపాడు ,ఎప్రిల్ 21,ప్రభాతవార్త**



మాజీ ఎంపిపి అన్నెం అంజిరెడ్డి తండ్రి అన్నెం జోగిరెడ్డి పెద్దకర్మ సోమవారం బొడ్డువాని పాలెంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హజరైన పానెం చిన్న హనిమిరెడ్డి సోదరుడు పానెం నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డిలు జోగిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. వీరువెంట పలువురు వైసిపి నాయకులు వున్నారు.

## ఈ నెల 26న విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక

**అద్దంకి , ఎఫ్రిల్ 21,ప్రభాతవార్త**



ఎపి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అద్దంకియూనిట్సమావేశం సోమవారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో షేక్ మస్తాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అద్దంకి ఎస్.టి.ఒ. పరిధిలోని అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు మండలా లకు చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక ఈనెల 26వ తేదిన ఉదయం 10 గంటలకు అద్దంకిలోని గీతామందిరంలో జరుగుతుందని, ఈ సమావేశంలో ప్రకటించారు. ఈసమావేశంలో టి.కృష్ణయ్య,పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఎం.కోటేశ్వరరావు, టి.మురళీధర్‌రావు, అంజిలీదేవి, అంజయ్య, కె.సత్యనారాయణ, సైదా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం ఎయిడెడ్ పాఠశాల 44వ వార్షికోత్సవం

**అద్దంకి ,ఎఫ్రిల్ 21,ప్రభాతవార్త**



స్థానిక ఇందిరానగర్‌లోని ప్రకాశం ఎయిడెడ్ పాఠశాల 44వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా కరస్పాడెంట్ టంగుటూరి ప్రకాశం మాట్లాడుతూ విద్యార్ధులు కష్టపడి చదివి, ఉన్నత స్థితికి రావాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్ధులకు ఆటల పోటీలు, సంగీత,నృత్య,కోలాట ప్రదర్శనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఇందిరానగర్ ప్రాంతం వాసులు పాల్గొన్నారు.పలువురు విద్యార్ధులకు బహుమతులను అందజేశారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.విజయలక్ష్మి,సూర్యతేజ,రోహిణిరిజ్వాన,సౌజన్య,శరత్‌చంద్ర,తదితరులు పాల్గొన్నారు.

### చవిటిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో

# దాతల ప్రోత్సాహం అభినందనీయం

**- గ్రామంలో , పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం**

**- మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**అద్దంకి రూరల్ (సంతమాగులూరు)ఏప్రిల్ 21 ,ప్రభాతవార్త**



సంతమాగులూరు మండలం చవిటిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో దాతల ప్రోత్సాహం అభినందనీయం అని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.చవటిపాలెం గ్రామంలో సోమవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. రు.10 లక్షలతో నిర్మించిన సర్గీయ ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు పేరుతో ఏర్పాటు చేసిన పార్కు, వాటర్ ప్లాంటును ప్రారంభించారు.రు. 30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రు. 78.17 లక్షలతో నిర్మించిన 6 తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ చవటిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం అమూల్యమన్నారు. పాఠశాల అభివృద్ధి కి జనప్రైవ్ హౌసింగ్ సంస్థ, ఎల్.ఎం ,ఆటోటెక్ వారు సీఎస్ఆర్ నిధులు కేటాయించడం, కామేపల్లి లక్ష్మీప్రసాద్ లాంటి వ్యక్తుల సహకారంతో పాఠశాల సర్వతో ముఖాభివృద్ధి చెందిందని మంత్రి గొట్టిపాటి దాతలను కొనియాడారు.

**ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ లన్నింటిని అమలు చేస్తామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే పలు కార్యక్రమాలు అమలు చేయడం జరిగిందన్నారు. పింఛను సొమ్ములు పెంపు, అన్నా క్యాంటీన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందివ్వడం జరిగిందన్నారు.నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి తెలుగురాష్ట్రంలో మొత్తం 12 సార్లు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం జరుగ్గా టీడీపీ పాలనలోనే 10 సార్లు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించి విద్యాభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు.గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో ఉపాధ్యాయుల చేత వెట్టి చాకిరీచేయించారని మంత్రి రవికుమార్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు , అధికారులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలకు కంప్యూటర్ బహుకరణ

**హనుమంతునిపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



పేద పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు హనుమంతునిపాడు కేజీబీవీ పాఠశాలకు కంప్యూటర్ కావాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి దృష్టికి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అంజమ్మ తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి హనుమంతునిపాడు గ్రామ వాసి అయిన గంట వెంకట సుబ్బారెడ్డిని అడగగా వెంటనే ఆయన మంచి మనస్సుతో స్పందించి పాఠశాలకు కంప్యూటర్ బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అంజమ్మ, పాఠశాల తరుపున వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

**బల్లికురవ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



ఈనెల 10వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురై గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వంగులూరు గ్రామానికి చెందిన జంపు శంకర్రావు(55) ఆదివారం సాయంత్రం మరణించారు. మార్టూరు కూరగాయల మార్కెట్కి వెళ్లి తమ విధులు నిర్వహించుకుని తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా ముప్పవరం ఫ్లైఓవర్ వంతెన మీద బైక్‌ను కార్ ఓవర్ టెక్ చేసే సందర్భంలో ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత అద్దంకి వైద్యశాలలోను, ఆ తర్వాత మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వంగులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా అప్పిశెట్టి ఉదయ్ శంకర్ జన్మదిన వేడుకలు

**గిద్దలూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**



భారతీయ జనతా పార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, బిజెపి నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల రంగస్వామి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు కూటమి సర్కార్ తీపి కబురు మెగా డీఎస్సీ ప్రకటన

**- ఉపాధ్యాయుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ కూటమి**

**- సర్కారు మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**

**దర్శి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా మరో హామీని మన కూటమి సర్కారు అమల్లోకి తెచ్చింది ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో డీఎస్సీ ప్రకటిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని 10 నెలల కూటమి పాలనలో అమలు చేసి చూపిస్తున్నారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ ప్రకటన చేశారు. 16347 టీచర్ పోస్టుల భర్తీకి నోటీఫికేషన్ జారీ చేయడం నిరుద్యోగ యువతకు పెద్ద ఊరటగా చెప్పవచ్చు. అదే విధంగా విద్యకు ప్రోత్సాహంగా నిలుస్తుందని డాక్టర్ లక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమే అన్నారు. అయితే మెగా డీఎస్సీని చూసి ఓర్వలేక వైసీపీ సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలకు తెరలేపారని వీటిని తిప్పి కొట్టాలని డాక్టర్ లక్ష్మీ పిలుపునిచ్చారు. మెగా డీఎస్సీ ప్రకటించినందుకు నిరుద్యోగులు తరుపున ప్రీతిమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు డాక్టర్ లక్ష్మీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# గడియారస్తంభంని తొలగించరాదు

**దర్శి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



దర్శి నగర పంచాయతీ నందు దర్శి సెంటర్‌లో గడియారస్తంభం నిర్మించియున్నారు. అది అప్పటి 2001లో దర్శి పంచాయతీ తీర్మాణంలో రోటరీ క్లబ్ వారు నిర్మించియున్నారు. దర్శికి ముఖ్యంగా వాడుకలో ఉన్నది. దర్శి గడియారస్తంభం సెంటర్ అంటారు. దీనిని ఇప్పుడు కూల్చడం వలన ట్రాఫిక్ మెరుగుపరచాలనుకుంటే దాని చుట్టూ చాలా ఖాళీ స్థలం ఉన్నది. కావున దర్శి తలమానికంగా ఉన్న గడియారస్తంభం తీసివేయడం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాల్సిందిగా కోరుచున్నాము. చుట్టు బాగు చేయించాల్సిందిగా దర్శి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్స్, కన్వీనర్, టౌన్ అధ్యక్షులు దర్శి వైఎస్సార్‌సీపీ నాయకులు, గడియారస్తంభం కూల్చివేయవద్దని మిక్కిలి కోరుకుంటున్నాము. వైసీపీ నాయకులు మేడం మోహన్‌రెడ్డి, తుళ్ళూరు బాబురావు, మిల్లర్ బుజ్జి, కొల్ల ఉదయ్‌భాస్కర్, పానం మజ్నువలి తదితరులు పాల్గొన్నారు.

## బొడ్డురాయి ప్రతిష్ఠ ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న

### ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

**దర్శి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



దర్శి మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో సోమవారం బొడ్డు రాయి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొని దేవుని ఆశీర్వాదాలు అందుకున్న దర్శి ఎమ్మెల్యే వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. ఈ సందర్భంగా దేవుని ఆశీర్వాదాలు అందుకున్నారు. ముందుగా బూచేపల్లికి గ్రామంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాదం చిన్నిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గడియారస్తంభం వద్ద రోడ్డు విస్తరణ పనులు

**దర్శి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



రోడ్డు విస్తరణలో భాగంగా సోమవారం దర్శి పట్టణం నందలి గడియారపు స్తంభం వద్ద కొలతలు వేయడం జరిగింది. సదరు కార్యక్రమం నందు తహశీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమీషనర్ వై.మహేశ్వరరావు(దర్శి నగర పంచాయతీ), సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

**దర్శి, ఏప్రిల్ 21,ప్రభాతవార్త**



రాష్ట్రంలో, దర్శి నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పండించిన మిర్చి, పొగాకు గిట్టుబాటు ధర లేకపోవడం, అకాల వర్షాలతో బొప్పాయి, మొక్కజొన్న పంటలను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడం లో ఈ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది. మిర్చి రైతుకు ఎకరాకు లక్ష ఖర్చు వస్తుంటే కనీసం రూ. 25 వేలు గిట్టుబాటు ధర లేకపోవడం దారుణం, ఇప్పటికైనా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వాళ్లని ఆదుకోవాలి, అలాగే అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్న అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చైర్మన్, దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కైపు వెంకటకృష్ణారెడ్డి.

# రెండు వర్గాల మధ్య ఘర్షణ.. ఒకరికి గాయాలు

**బల్లికురవ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



మండలంలోని సోమరప్పాడు గ్రామంలో సోమవారం శ్రీరామనవమి 16రోజుల పండుగ వేడుకలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గోపిరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ గోపిరాజును అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, గోపిరాజును పరామర్శించి ధైర్యం చెప్పారు.

# ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

**వెలిగండ్ల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన వెలిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలిగా విజన్‌షైనీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఎంఈఓ దాస్ ప్రసాద్ హెచ్‌ఎం రాఘవాచారి వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గురై మృతిచెందిన చిన్నారులకు నివాళులర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల

**- ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా**

**బేస్తవారిపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



బేస్తవారిపేట మండలం పెద్ద ఓబినేనిపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృత్యువాత పడిన గోచిపాతల ఆకాష్ (19), పులిగుజ్జు సన్నీ (18)ల మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామమైన పెద్ద ఓబినేనిపల్లె గ్రామానికి తీసుకుని వెళ్లగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, మండల నాయకులు స్థానిక నాయకులు మరియు మండల అధికారులతో కలిసి వెళ్లి చిన్నారుల భౌతికకాయాలను సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారుల తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తమకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, జరిగిన సంఘటనను ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా నిచ్చారు. ఆయన వెంట మండల అధికారులు, బేస్తవారిపేట మండల తెలుగుదేశంపార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రవేశపరీక్షకు 24 మంది గైర్హాజరు

**- ప్రిన్సిపల్ సుధాకర్ రావు**

**రాచర్ల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



రాచర్ల ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 24 మంది ప్రవేశ పరీక్షకు గైర్హాజరయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ జి సుధాకర్ రావు సోమవారం తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ప్రవేశాల కొరకు 113మంది విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోగా వారికి సోమవారం స్థానిక పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరిగిందని అయితే 113మంది విద్యార్థులకు గాను 89మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశ పరీక్షకు హాజరయ్యారని మిగిలిన 24మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. సోమవారం జరిగిన పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, విద్యార్థులంతా పరీక్షలు బాగా రాశారని ఎలాంటి అక్రమాలు, అవకతవకలు జరగలేదని అన్నారు. పరీక్ష పత్రాలను సంబంధిత విద్యాశాఖ అధికారులకు పంపించడం జరుగుతుందని అక్కడ పరిశీలన తదితర కార్యక్రమాల అనంతరం ఫలితాలు ప్రకటిస్తారని ఆయన తెలిపారు.

## ఎంపిపి పదవి వరించిన ఆనందంలో అభినందన సభలో ఆళ్ల

**- సభా పరిచయం చేసిన కార్యదీక్షకుడు ఎమ్మెల్యే తాటిపర్తి**

**త్రిపురాంతకం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



ఆళ్ల సుబ్బమ్మ ఎంపిపిగా పదవీ చేపట్టిన సందర్భంగా సోమవారం సన్మాన సభను నిర్వహించారు. ముందుగా దివంగత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం అక్కడ నఉండి ఎంపిడిఓ కార్యాలయం దగ్గరలోని సభ వేదిక వరకు వైసిపి క్యాడర్‌తో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సన్మాన సభకు వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సభాధ్యక్షునిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మూడు జిల్లాల కోఆర్డినేటర్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మరియు ఒంగోలు పార్లమెంట్ ఇన్చార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వై.పాలెం నియోజకవర్గం ఎప్పటికీ వైసిపి కంచుకోటగానే ఉంటుందని, జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ళ కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను అందించి, ప్రజల సంక్షేమానికి పనిచేశారన్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్నో కుట్ర కుతంత్రాలు పన్నిన వాటిని పటాపంచలు చేసి త్రిపురాంతకం ఎంపిపి ఎన్నికల్లో వైసిపికి విజయాన్ని అందించిన విషయంలో ఎమ్మెల్యే తాటిపర్తి కీలకభూమిక పోషించిన విషయం పలువురు వక్తలు కొనియాడడం జరిగింది. ఈ విజయానికి సహకరించిన ఎంపిటిసి సభ్యులను, మరి ముఖ్యంగా ఈ ఎంపిపి ఎన్నికల్లో ఊహించని ఘన విజయం అందించిన త్రిపురాంతకం 2 ఎంపిటిసి మాలపాటి సృజనను, మేడపి ఎంపిటిసి కృష్ణను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపిపిలు, పార్టీ కన్వీనర్‌లు, నాయకులు, స్థానిక సర్పంచ్ పొన్న వెంకట లక్ష్మీ, సర్పంచ్ సంఘం అధ్యక్షులు శేషం రంగబాబు నాయుడు, దువ్వలి మాజీ సర్పంచ్ మురారి గాలెయ్య, గోలమారి బాలకోటి రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సరళ కుమారి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

## గాలివాన భీభత్సానికి వెల్లుపల్లెలో నేలమట్టమైన బొప్పాయితోట

**- బొప్పాయి తోటను పరిశీలించిన ఎమ్మెల్యే ముత్తుముల**

**- నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

**గిద్దలూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**



గిద్దలూరు మండలంలోని వెల్లుపల్లె గ్రామంలో ఆదివారం వీచిన ఈదురు గాలులకు గ్రామానికి చెందిన కొర్రా రామయ్య అనే రైతుకు చెందిన 2ఎకరాల బొప్పాయి తోట పూర్తిగా నేలమట్టం అయింది. విషయం తెలుసుకున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అవోక్ రెడ్డి వ్యవసాయ అధికారులతో కలిసి సోమవారం ఉదయం వెల్లుపల్లె గ్రామానికి వెళ్ళి నేలమట్టమైన బొప్పాయి తోటను పరిశీలించారు. రైతుతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.2లక్షల వరకు తనకు నష్టం వాటిల్లిందని రైతు ఎమ్మెల్యేతో ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి అధైర్య పడకుండా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నష్టపోయిన పంట వివరాలను సేకరించి రైతుకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి బాలాజీ నాయక్,హెచ్ఓ విష్ణుప్రియ,ఏఓ విజయభాస్కర్‌రెడ్డి,తహశీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎంపిడిఓ రమణారెడ్డి, మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, బైలడుగు బాలయ్య, కోఆపరేటివ్ బ్యాంకు ఛర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, బద్రి గోపాల్ రెడ్డి, కంకర వెంకటరెడ్డి,రాజశేఖర్ రెడ్డి,కొర్రా నాగయ్య, అల్లం రంగస్వామి, రామయ్య, తిరుపతయ్య, సుగాలి వెంకటేశ్వర్లు, నాగరాజు, అధికార సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా

**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**



మార్కాపురం పట్టణం నందు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం సందర్భంగా విచ్చేయుచున్న భక్తులకు కీర్తిశేషులు గుంటక వెలుగొండారెడ్డి జ్ఞాపకార్థం సిద్దార్థ జూనియర్ కళాశాల మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో గిద్దలూరుమాజీశాసనసభ్యులు,మార్కాపురం వైఎస్సార్సీపి సమన్వయకర్త అన్నా రాంబాబు పాల్గొన్నారు. స్వామివారి రథోత్సవం తిలకించడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తకోటికి అన్నప్రసాద వితరణ అనేది గొప్ప కార్యక్రమం అని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటక సుబ్బారెడ్డి, సిద్దార్థ జూనియర్ కళాశాల అధినేత శ్రీనివాసరెడ్డి, మిత్రమండలి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పట్టణంలో భారీ శాంతి ర్యాలీ

**- వేలాదిగా పాల్గొన్న ముస్లీం మైనారిటీ సోదరులు**

**యర్రగొండపాలెం,ఏప్రిల్21,ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం చెతిచ్చిన వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని నూరాని మసిదు నుంచి ముస్లిం ఐక్యవేదిక ఆదర్యంలో భారీ శాంతి ప్రదర్శన నిర్వహించారు.ఈ చట్టాన్ని రద్దుచేయాలని,రాజ్యాంగాన్ని నిలబెట్టాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శించారు.ప్రదాన సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ఈ శాంతి ర్యాలీ జరిగింది.పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలలోని ముస్లిం మైనర్టి సోదరులు ఈ శాంతి ర్యాలీలో పాల్గొన్నారు.వక్ఫ్ బోర్డు చట్టాన్ని కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జామాతే ఉలేమా హింద్ నాయకులు మౌలానా హిదాయతుల్లా మాట్లాడుతూ ఇస్లామీయ పరిభాషలో వక్ఫ్ అంటే ప్రజలకు లాభంచేకూర్చే అల్లాహ్ మార్గంలో సమర్పించుకున్న ఆస్తి. అంటే ఒక వ్యక్తి తన స్వంత ఆస్తిని శాశ్వతంగా అల్లాహ్ మార్గంలో దానం చేయడమని అన్నారు.జకాత్ తరువాత ఇస్లాంలో ప్రజాప్రయోజనాల కోసం ఉద్దేశించిన వ్యవస్థవక్ఫ్,జాకత్ అనేది తక్షణ సంక్షేమం అయితే వక్ఫ్ అనేది దీర్ఘకాలిక సంక్షేమ కార్యక్రమం అన్నారు.ప్రస్తుత కొత్త వక్ఫ్ చట్టం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనతో పాటు వక్ఫ్‌ధార్మిక సంక్షేమ విధానాలకు నిఘాతం కలిగిస్తూంది.వర్ఫ్‌పరిరక్షణ ధార్మిక విధి అయితే రాజ్యాంగ అధికారణ 14,15,16,25,26,300ఏకు విరుద్దం,అప్రజాస్వామికమని జమాత్ నేతలు అన్నారు.వక్ఫ్ పునర్యవస్థీకరణ పేరుతో ముస్లిమేతరులకు బోర్డులు చేర్చడం,వక్ఫ్ ఆస్తులను పరిరక్షించే అధికారం కలెక్టర్లకు ఇవ్వడం ముస్లింలకు ఎంతమాత్రం అమోదయోగ్యం కాదన్నారు.ప్రజాసామ్యవాదులు, దేశప్రజలు కులమతాలకు అతీతంగా ఏకమై ఇష్టారాజ్యంగా వక్ఫ్ చట్టాన్ని ముస్లింపై రుద్దే ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు,రాజ్యాంగ విలువల పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ముస్లిం ఐక్యవేదిక నేతలు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ పోలీసులు బందోబస్తే నిర్వహించారు.అనంతరం తహాశిల్దార్ కార్యాలయంలో వినతిపత్రన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని ముస్లిం సోదరులు వివిద పార్టి నాయకులు పాల్గొన్నారు.



## కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా దుత్తా బాల ఈశ్వరయ్య నియామకం



**గిద్దలూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా గిద్దలూరు కాపు సామాజిక వర్గానికి చెందిన నేత టిడిపి నాయకులు దుత్తా బాల ఈశ్వరయ్య కోఆపరేటివ్‌బ్యాంకు చైర్మన్‌గా నియామకమయ్యారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి విజయంలో, మరియు 25సంవత్సరాల తరువాత గిద్దలూరు గడ్డపై తెలుగుదేశంపార్టీ జెండా ఎగురవేయుటకు కృషిచేసిన నిత్య కృషివలుడు, దుత్తా బాల ఈశ్వరయ్య అనునిత్యం అందరి మన్ననలు పొందుతూ అహర్నిశలు పార్టీ విజయం కోసం కృషిచేసిన సందర్భంగా గిద్దలూరు కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా దుత్తా బాలీశ్వరయ్య ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకం ఉంచి చైర్మన్‌గా పదవి అందించినందుకు రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషిచేస్తానని మరియు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

## కష్టాల్లో ఉన్న మహిళకు అండగా నిలిచిన ఓర్నాన్ ఫౌండేషన్



**గిద్దలూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
వైద్య చేయించుకున్న తరువాత గత రెండేళ్ళుగా మంచంపైనే ఉన్న మహిళకు ఓరాన్నన్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించింది. ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలను గమనించిన ఓర్నాన్ ఫౌండేషన్ అధ్యక్షులు బద్దీటి అల్లూరయ్య ఆమె నివాసానికి స్వయంగా వెళ్ళి నిత్యావసర సరుకులను, కొంతమేరా నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం ద్వారా పొందే ఆనందరం అంతులేనిదని అన్నారు. ఈ సహాయ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సైతం పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ





**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**
శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని సోమవారం రథోత్సవం సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఏపియుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు నూకసాని వెంకట రమణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐవి సుబ్బారావు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ స్థాపించిన నాటి నుండి ప్రత్యేక బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయ మిత్రులందరికీ, భక్తులకు అల్పాహార పంపిణీ కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ప్రెస్ క్లబ్ అగ్రభాగాన ఉందని ప్రెస్ క్లబ్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి మోహన్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు మూల అల్లూరిరెడ్డి, జివిల్ నరసింహారావు, బాజీవలి, కెవి సత్యనారాయణ, ఓబయ్యలతోపాటు ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపియుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి గుడిని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## విద్యార్థి చదువుకు చేయూతగా మార్కాపురం వాసవీ విజన్ క్లబ్



**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 21 ,ప్రభాతవార్త**
మార్కాపురం రీజియన్ పరిధిలో వాసవి విజన్ క్లబ్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ గోళ్ళ వింధా వైష్ణవి సౌజన్యంతో పేద ఆర్యవైశ్య విద్యార్థి చదువు నిమిత్తం జక్కా వెంకట సత్యసాయి ఓజస్విత్ రూ.15వేలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ విజన్ 2020 జిల్లా గవర్నర్ గోల్డెన్ స్టార్ కెసిజిఎఫ్ గంగిశెట్టి కిరణ్ కుమార్, ఐఈసి ఆఫీసర్ గోళ్ళ వరలక్ష్మీ, రీజియన్ చైర్మన్ నారాయణం, వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షులు లింగం పూర్ణచంద్రరావు, క్లబ్ సెక్రటరీ మోటపోతుల కిశోర్ కుమార్, క్లబర్ ట్రెజరర్ దారా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

### - ఎంపీపీ గాయం సావిత్రి



**హనుమంతునిపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ హనుమంతరావు, పంచాయతీ రాజ్ ఏఈ బ్రహ్మయ్య, ఎంఈఓ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రీకాంత్, వైస్ ఎంపీపీ కొదమల్ల బెంజిమెన్, రుద్రపాటి శోభ, ఎంపీటీసీలు ఉడుముల సుబ్బారెడ్డి, సూరిశెట్టి నారాయణస్వామి, తానిగుండాల తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు సానికొమ్ము బ్రహ్మారెడ్డి, సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, కత్తి రాజారావు, కూడలి అరుణాదశరథ, పలు శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యామిత్ర మండల స్టాక్ పాయింట్ పరిశీలన



**మార్టూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
మార్టూరు మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్య మిత్ర కిట్ల మండల స్టాక్ పాయింట్ కొరకు ఏర్పాటు చేసిన గదులను జిల్లా సమగ్ర శిక్ష అధికారులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష సీఎంఓ శ్రీనివాసరావు,మండల విద్యాశాఖ అధికారులు ఎంసీహెచ్ వస్త్రామ్ నాయక్, కే.ప్రేమలత, పాఠశాల హెచ్‌ఎం రూతు మెర్సి, సీఆర్పీలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఈస్టర్ సందర్భంగా సంజీవని ఆశ్రమంలో సేవా కార్యక్రమం



**గిద్దలూరు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని పిఆర్ కాలనీలోగల సంజీవని అనాధాశ్రమంలో విశ్వశాంతి మినిస్ట్రీస్ మరియు విశ్వ శాంతి సాహితీ విజ్ఞాన కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డా. కువ్వారపు ఏసురత్నం దంపతులు తమ 17వ వివాహ వార్షికోత్సవం మరియు ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సతీసమేతంగా కేక్ కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులు మరియు అనాధ పిల్లలతో కలిసి భోజనం చేసి పండ్లు పంచిపెట్టారు. అనంతరం డాక్టర్ యేసురత్నం మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలలో చేసుకున్న పుట్టిన రోజులు, పెళ్లి వార్షికోత్సవాల్లో ఈరోజు నాకు అసలైన ఆనందం, సంతృప్తి కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్ట్ చాపెల్ చర్చి పాస్టర్ గంగెపోగు శామ్యూల్ దంపతులు కూడా పాల్గొని తమ సంతోషాన్ని తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక, సాంఘీక చైతన్య కార్యక్రమాలు, గిద్దలూరు పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు డాక్టర్ యేసురత్నం తెలిపారు. ప్రతిఒక్కరు తమవంతుగా సమాజానికి ఏదో ఒక విధంగా తోడ్పడాలని కోరారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులు ఒకేషనల్ సబ్జెక్టు ఐటీ నందు ఇంటర్న్‌షిప్ చేసినందుకుగాను సర్టిఫికేట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అనసూయదేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్ హాజరయ్యారు. ఇంటర్నల్ షిప్ చేసినటువంటి 50 మంది విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రధానం మండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్ నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిజం వొకేషనల్ ఐటీ ట్రైనర్ సయ్యద్ నాయబ్ రసూల్ ముఖ్యపాత్ర పోషించారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు జి.విజయ మానిక్యం,వి.నాగమూర్తి, కే.కిరణ్ కుమార్, కే.మీటే నాయక్, కే.ఆవులయ్య, టి.వెంకటశివ, రామానాయక్, ఓ.లక్ష్మీనారాయణ, డి.పోలయ్య, పి.చంద్రమౌళి, కే.శిరీష రాణి,ఎం.మారుతిరెడ్డి,బి.రమణయ్య,కే.ప్రసాద్,ఎం.అనిత,టి.నరేష్,ఎం.రెబ్కా, సిబ్బంది పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో గుండ్లాపల్లి విద్యార్థి ప్రతిభ



**మద్దిపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2022-23 సంవత్సరంలో 10వ తరగతి చదివి పాఠశాలలో అత్యధికంగా 565 మార్కులు సాధించిన సన్నపురెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 104వ ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావు పాఠశాల పూర్వ విద్యార్థినీ అభినందించారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన హర్షవర్ధన్‌రెడ్డిని అభినందించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్లు, షెడ్స్ పంపిణీ




**మద్దిపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ఉపాధి హామీ కూలీల కొరకు, మండల టీడీపీ అధ్యక్షుడు మండవ జయంతిబాబు చేతుల మీదుగా వేసవి కాల నిమిత్తమై మెడికల్ కిట్, షెడ్‌లు పంపిణీ చేశారు. మందులను స్థానిక పీహెచ్‌సీ పంపిణీచ ఏయగా వాటికి కిట్లు, షెడ్‌లు సొంత డబ్బులతో ఫీల్డ్ అసిస్టెంట్లకు పంపిణీ చేయడం పట్ల ఎంపీడీఓ వరప్రసాదన జయంతిబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఏపీవో ధనుంజయవర్మ, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, టెక్నికల్ ఇంజనీర్ కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ర్యాలీ



**సంతనూతలపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో సోమవారం నాడు స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ హెచ్‌ఎం ప్రమోద కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులను స్థానిక హైస్కూల్‌లో ఆరో తరగతిలో చేర్పించేందుకుగాను ఉపాధ్యాయ బృందం వారి తల్లిదండ్రులను చైతన్యపరిచారు. స్థానిక హైస్కూల్‌లో 53 మంది విద్యార్థులను ఆరో తరగతిలో చేర్పించారు. ఎంఈఓ డి.వెంకారెడ్డి మాట్లాడుతూ బడి మయట పిల్లలందరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశ నిమిత్తం కరపత్రాలను పంపిణీ చేశారు. పాఠశాలలో గల సదుపాయాలు, ప్రగతి తదితర సౌకర్యాలపై ఎంఈఓ వెంకారెడ్డి, హెచ్‌ఎం ప్రమోద వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పంపిణీ



**సంతనూతలపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన మెరిట్ విద్యార్థులకు వ్యాపారవేత్త దాత కుంచాల శ్రీనివాసులు రూ.80వేలు ప్రోత్సాహక నగదును పంపిణీ చేశారు. సంతనూతలపాడు మండలం గుడిపాడు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో గ్రామానికి చెందిన వ్యాపారవేత్త హైదరాబాద్‌లో ఉంటున్న కుంచాల శ్రీనివాసులు, సుహాసిని దంపతులు పాల్గొని విద్యార్థులకు అండగా నిలిచారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే.లలితాదేవి అధ్యక్షత వహించారు. ఒకటి నుండి 8వ తరగతి వరకు గల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలుసాధించిన విద్యార్థులకు రూ.5వేలు, రూ.3,వేలు, రూ.2వేలు రూపాయలను ఎంఈఓ వెంకారెడ్డి, హెచ్‌ఎం కవితాదేవి, దాత కుంచాల శ్రీనివాసులు, సుభాషిని దంపతులు ఈ సందర్భంగా పంపిణీ చేశారు. దాతల స్ఫూర్తితో విద్యార్థులు భాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఎంఈఓ వెంకారెడ్డి తన ప్రసంగంలో కోరారు. పాఠశాల అభ్యున్నతకు పాటుపడుతున్న దాత కే.శ్రీనివాసులును ఈ సందర్భంగా అభినందించారు. దాత కుంచాల శ్రీనివాసులు, సుభాషిని దంపతులను హెచ్‌ఎం కవితాదేవి, ఉపాధ్యాయ బృందం సత్కరించారు. ప్రతి ఏడాది ఇదే విధంగా మెరిట్ విద్యార్థులకు రూ.80వేల రూపాయలను ప్రోత్సాహక నగదు కింద పంపిణీ చేయనున్నట్లు దాత కుంచాల శ్రీనివాసులు తన ప్రసంగంలో హామీ ఇచ్చారు. విద్యార్థులు భాగా చదివి గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.తిరుపతిస్వామి, కే.భాస్కర్, బాపట్ల లక్ష్మీనారాయణ, పింగళి శ్రీనివాసరావు, సీతాలక్ష్మీ, కుమారి, నరసింహం, విద్యాకమిటీ చైర్మన్ కే.అంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టం కింద పేద వర్గాలకు 25 శాతం మేరకు సీట్లను కేటాయించాలి

### - జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్

**సంతనూతలపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలలో ప్రవేశానికి 2009 విద్య హక్కు చట్టం సెక్షన్ 12(1) సీ ప్రకారం పేద వార్గలకు విధిగా 25 శాతం సీట్లను కేటాయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ సోమావారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ నుండి మే 15వ తేదీ వరకు ఇందు నిమిత్తం దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని డీఈఓ కిరణ్ కుమార్ కోరారు. ఒకటో తరగతిలో ఈ అడ్మిషన్లు కొనసాగుతాయని తదుపరి విద్యార్థి పదో తరగతి వరకు ఉచిత విద్య పొందడానికి అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యాశాఖ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ//:సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి ప్రైవేటు ఆన్ ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతిలో ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఐదేళ్ల వయస్సు నిండిన వారికి మాత్రమే 1వ తరగతిలో అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. సిబిఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబి సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 2025 మార్చి 31నాటికి, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి జూన్ 1 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. మే 16 నుండి 20వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఉన్న డేటాతో పోల్చుకుని అడ్మిషన్లు ఇస్తారన్నారు. ప్రస్తుతం చిరునామా ధృవీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు, ఓటరు కార్డు, భూమి హక్కుల పత్రం, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డు, పాస్ పోర్ట్, విద్యుత్ బిల్లు, రెంటల్ అగ్రిమెంట్ కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, జనన ధృవీకరణ పత్రాలను దరఖాస్తుకు సమర్పించాలన్నారు. మొదటి విడత ఫలితాలు మే 21నుండి 24వ తేదీల మధ్యలో విడుదల చేస్తారని, సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 2న ప్రకటించబడుతుందన్నారు. రెండో విడత ఫలితాలు జూన్ 6న విడుదల చేస్తారని పూర్తి సమాచారం కోసం 18004257859 టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## 4 నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 21ా ప్రభాతవార్త**
మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మార్కాపురం డిపోకు చెందిన 2 అల్ట్రా డీలక్స్ బస్సులు, 2ఎక్స్‌ప్రెస్ బస్సులు మొత్తం 4నూతన బస్సులను సోమవారం ప్రారంభించఆరు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి స్వయంగా బస్సును నడిపి అందరినీ ఉత్సాహపరిచారు. అంతకుముందు కంట్రోల్ రూమ్‌లో డిపో మేనేజర్ మరియు సిబ్బందితో సమావేశమై డిపోలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్‌స్టాండ్, బస్‌స్టాండ్ పరిసరాలలోని పలు సమస్యలు ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### బిసి రుణాల మంజూరు పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సోమవారం తర్లుపాడు మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన 30 బిసి కార్పోరేషన్ రుణాల 2024-25 ఆర్థిక సంవత్సరానికి మూడు నెలలకు మాత్రమే మంజూరుయ్యాయని, ఈ ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధశించిన రుణాలు త్వరలో భారీ ఎత్తున బిసి కార్పోరేషన్, ఎస్సీ కార్పోరేషన్ రుణాలు మంజూరు అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల ఎంపిడిఓ తెలుగుదేశంపార్టీ నాయకులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ సర్టిఫికేట్‌లు అందజేత



**తాళ్లూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దసరా, వేసవి సెలవుల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్ ద్వారా బ్యాంకింగ్, హెల్త్ కేర్‌పై ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు నుసుం నాగిరెడ్డి,శ్రీను, ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనర్స్ యర్రగొర్ల అంజిబాబు, దావీదు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమంగా మూసివేసిన కూరగాయల షాపులను వెంటనే తెరిపించాలి

### - వేలంపాట నిర్వహించి షాపులను మూసివేసిన కూరగాయల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

### - మార్కాపురం సబ్ కలెక్టర్‌కు సిపిఎం నాయకుల వినతిపత్రం అందజేత



**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాల రోజులలో ప్రజలకు అందుబాటులో ఉంచవలసిన కూరగాయలను అక్రమంగా వేలంపాట నిర్వహించి, షాపులను మూసివేసి, అధిక ధరలకు విక్రయిస్తున్న కూరగాయల హోల్‌సేల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం నాయకులు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో మార్కాపురం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల రోజులలో కూరగాయలను బ్లాక్ మార్కెట్ చేయడం, షాపులన్నీ మూసివేయడం, ఒకటి షాపుకు మాత్రమే అనుమతి ఇవ్వడం, లక్షలాది రూపాయలను ప్రజలపై భారం వేయడం, నిత్యావసర వస్తువుల చట్టాన్ని అతిక్రమించడమేనని అన్నారు. వెంటనే షాపులు తెరిపించి, యదావిధిగా కూరగాయలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమించిన ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటామని, వెంటనే షాపులు తెరిచేందుకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అర్జీ అందించిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి డికేఎం రఫీ, సిపిఎం నాయకులు జవాజీ రాజు, సిపిఐ నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కె ఖాశిం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు వేసెపోగు సుదర్శన్, ఎంపిఏ నాయకులు షేక్ అబ్దుల్ రజాక్, తదితరులు ఉన్నారు.

## ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

### - విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడిన ప్రజలు



**అర్ధవీడు, ఏప్రిల్ 21 ,ప్రభాతవార్త**
ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా వీచిన ఈదురుగాలులకు అర్ధవీడు మండలం మొహిద్దీన్ పురం గ్రామంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండలు కాస్తూ మధ్యాహ్ననికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఈదురుగాలులు,ఉరుములు, మెరుపులతో వాతావరణం మారిపోతుంది . గత రెండు మూడు రోజులుగా ఈ ప్రాంతంలో పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది. సోమవారం ఉరుములు, ఈదురుగాలుల వలన కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కూడా నేలకొరగాయి. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## వెంకుపాలెంలో పశువుల నీటి తొట్టెలను సందర్శించిన ఎంపీడీఓ



**పొన్నలూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
పొన్నలూరు మండలం వెంకుపాలెం గ్రామపంచాయతీ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిచబడిన పశువుల నీటి తొట్టెని ఎంపీడీఓసుజాత సోమవారం సందర్శించారు . ఈ వేసవి కాలంలో మూగ జీవాలు నీరు తాగడానికి నిరంతరం నీరు అందుబాటులో ఉండే విధంగా మన సీఎం, గౌరవ డిప్యూటీ సీఎం ఆదేశించడంతో ఈ నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. ఒక నీటి తొట్టె అయ్యే ఖర్చు రూ.33000 ఒక నీటి తొట్టె నిర్మాణం కొలతలు (పొడవు 5 మీటర్లు, వెడల్పు 2 మీటర్లు, లోతు 0.6 మీటర్లు) నిర్మించడం వలన 4231 లీటర్లు నీరు ఒక తొట్టె నిండా పడతాయని తెలిపారు. ఈ నీటి తొట్టెను ఎస్సీ కాలనీ నందు సైడు డ్రైనేజీ వ్యవస్థను, జీపీ బిల్డింగ్‌ను సందర్శించిన ఎంపీడీఓ సుజాత, ఏపీవో వెంకట సుధాకర్‌రావు, ఈసీ కోటేశ్వరరావు, టీఏ అనిల్, గ్రామ నాయకులు టి.మహేంద్ర, ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష, నరేంద్ర, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముగ్గురు జూదరులు అరెస్టు

**పొన్నలూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
మండలంలోని రావులకొల్లు గ్రామ శివారులో కోతముక్క ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఎస్సై కే.అనూక్ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.21,570 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. తదుపరి వారిని కందుకూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఎంపీపీఎష్ హసనాబాద్ నందు 1వ తరగతిలో చేరేటువంటి విద్యార్థుల వివరాలు తీసుకున్నారు. తరువాత ప్రధానోపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు దాటిన ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థుల వివరాలను తీసుకుని, ఆ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని కూడా మన పాఠశాలలో చేర్చుకోవాలి, దీని కోసం అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో పాటు మీరు కూడా హౌస్ విజిట్ చేయాల్సిందిగా కోరారు. అదేవిధంగా మోడల్ స్కూల్స్, హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు మీ గ్రామాలలో ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థుల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.అనసూయదేవి మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని పాఠశాలలను సందర్శించి ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థుల గృహాలు సందర్శించి ఖచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు చేపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమణమ్మ, సీఆర్ఎంటీలు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

### - మున్సిపల్ చైర్మన్ గఫార్ విజ్ఞప్తి



**కనిగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని మోడల్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ కోరారు. ఈ మేరకు సోమవారం హౌసింగ్ డిపార్టుమెంట్ డిప్యూటీ ఇంజనీర్ కోటిరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో 1300 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా ఇప్పటికే 300 మంది తమ గృహ నిర్మాణాలను పూర్తి చేసుకున్నారని, మరో 300 గృహాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అయితే లేఅవుట్‌లో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి అనుసంధానంగా మోడల్ స్కూల్ వద్ద నుంచి రోడ్డు మరమ్మత్తులు చేసి, ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే, కాలనీలో నీటి ఎద్దడి అధికంగా ఉందని, తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా కాలనీలో విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలు, చిల్ల చెట్లను తొలగించేందుకు జింగిల్ క్లియరెన్స్ ప్రతిపాదనలు పంపించాలని, అనుమతులు వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను కోరారు. చైర్మన్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన డీఈ కోటిరెడ్డి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## వక్ఫ్ సవరణ చట్టం 2025ను వెంటనే వెనక్కు తీసుకోవాలి



**కనిగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం 2025ను వెంటనే వెనక్కి తీసుకోవాలని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు సయ్యద్ యాసిన్ డిమాండ్ చేశారు. సోమవారం కనిగిరిలో జమియత్ ఉలమా, అంజుమన్ ఏ – కమిటీ ఇస్లామియా ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కనిగిరి షాదీ ఖానా వద్ద ప్రారంభమైన ఒంగోలు బస్టాండ్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు సాగిది. అనంతరం అధికారులు సమక్షంలో వినతిపత్రాన్ని అందజేశారు. ముస్లిం మైనార్టీలపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని, దాని భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చిందని ఆరోపించారు. ఈ బిల్లును దేశంలోని ప్రతి ముస్లిం వ్యతిరేకిస్తున్నారని, వెంటనే బిల్లు వెనక్కు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిం యేతరులను సభ్యులుగా నియమించటం, వక్ఫ్‌కు దానం చేసే వారు ఐదు సంవత్సరాలుగా ఇస్లాం అనుసరిస్తున్నారని ఆధారాలు చూపించాల్సిన నిబంధన, వక్ఫ్ ఆస్తులపై వివాదాలకు ట్రిబ్యునల్‌కు కలెక్టర్ స్థాయి అధికారి నియామకం రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులను తగ్గించి కేంద్ర ఆధీనంలోకి తీసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి చర్యల వల్ల వక్ఫ్ బోర్డు అసలు ఉద్దేశ్యాలు మరుగున పడుతున్నాయని, ముస్లింల ధార్మిక స్వేచ్ఛకు ఇది విఘాతం కలిగిస్తోందని యాసిన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన ర్యాలీలో జమియత్ ఉలమా నాయకులు, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ అహమ్మద్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, యువ న్యాయవాది షాహిద్, ఫిరోజ్, రోషన్ సందని, గుడిపాటి ఖాదర్‌తోపాటు ముస్లిం మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గార్లపేట రోడ్డులో మద్యం షాపు వద్దంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళల నిరసన

### - తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఐద్వా నాయకులు



**కనిగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని గార్లపేట రోడ్డులో మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసి షాపు ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లాకార్యదర్శి కె.రమాదేవి మాట్లాడుతూ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు ఉన్న ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం దారుణమని, ఇది నైతిక విలువలను విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు నివసించే ప్రాంతాల్లో మద్యం అందుబాటులో ఉండడం వల్ల వారి జీవన ప్రమాణాలు మరింత దిగజారుతాయని పేర్కొన్నారు. అంతేకాదు, మద్యం షాపు వల్ల మహిళలపై వేధింపులు, హింసా ఘటనలు జరిగే అవకాశముందని, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు గురవుతారని పేర్కొన్నారు. మద్యపానాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వం, వ్యాపార లాభాల కోసం ఇలాంటి విధానాలను అనుసరించడం బాధాకరమన్నారు. షాపు ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకపోతే, మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐద్వాపట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే జబీన్,ప్రసన్న,సీఐటీయు నాయకులు నరేంద్ర, స్థానికులు శ్రీనివాసులు, మల్లయ్య, గంగులు, కిషోర్, బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరుటకు క్లస్టర్ హెచ్ఎం సుధారాణి కసరత్తు



**టంగుటూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
తూర్పు నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్లస్టర్ పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ బడుల్లోనే చేర్పించుటకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం తూర్పు నాయుడుపాలెంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న పథకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి గ్రామంలోని చిన్నారులందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తూర్పునాయుడుపాలెం క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.వి. సుధారాణి పిలుపునిచ్చారు. అలానే క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులు పక్కన ప్రైవేటు బడులకు వెళ్లకుండా 100 శాతం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా క్లస్టర్ పరిధిలోని ఆ గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అడ్మిషన్స్ ప్రతి పాఠశాలలో విద్యార్థులను చేర్పించే కార్యక్రమంలో భాగంగా తూర్పు నాయుడుపాలెంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పుటకు అడ్మిషన్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పి.సురేష్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కే.మాధురి, బి.జ్యోతి, శారద, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మల్లాం గ్రామ పెత్తందార్లపై చర్యలు తీసుకోవాలి



**టంగుటూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన ఆ గ్రామ పెత్తందార్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కొండపి నియోజకవర్గ కేవీపీఎస్ కార్యదర్శి వేసుపోగు మోజెష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతి భద్రతల పేరుతో రాజీ చేసి పెత్తందార్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆ గ్రామాన్ని సందర్శించి దళితులకు ధైర్యం కల్పించాలని సూచించారు. సమస్యకు మూలమైన విద్యుత్ ఘాతం వల్ల చనిపోయిన దళిత యువకుని కుటుంబానికి రూ.50 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవనఆవలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై ప్రభుత్వ చర్యలు కఠినంగా లేకపోతే, ఇలాంటి ఘటనలు మళ్ళీమళ్ళీ జరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లిం సంఘాల శాంతియుత ర్యాలీ






**వేటపాలెం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
సోమవారం మండలంలోని దేశాయిపేట పంచాయతీ రాంనగర్ మసీదు వద్ద నుండి ముస్లిం మైనార్టీ సోదరులు వక్ఫ్ బోర్డు సవరణలను వ్యతిరేకిస్తూ శాంతియుత వాతావరణంలో ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో భాగంగా వేటపాలెం సెంటర్లోని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా షేక్ కమ్రుద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను మైనార్టీ మత హక్కులను కూడా భంగపరుస్తుందని ఆందోళన వ్యక్తం అయింది. బోర్డులో ఇతరులను చేర్చడంపై ముస్లిం సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇది ముస్లింల గొంతకను నిర్బంధించడానికి ప్రయత్నం అని వారు పేర్కొన్నారు. అనంతరం కాలినడకన తహశీల్దార్ కార్యాలయం వరకు ముస్లిం సోదరులతో కూడిన శాంతియువత ర్యాలీ డిప్యూటీ తహశీల్దార్‌కు వక్ఫ బోర్డు సవరణను వ్యతిరేకిస్తూ వినతిపత్రాన్ని శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, సామాజిక కార్యకర్తలు, మసీదులు ఇమాములు, ముస్లిం సోదరులు, కమ్రుద్దీన్, అహ్మద్, అక్రమ్, నూర్ భాషా, లాల్ అహ్మద్, మహమ్మద్ అనాజ్, అల్లావుద్దీన్, సిరాజ్ అన్సారి, నాయబ, కరీం తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఈకేవైసి లబ్దిదారుల ఇక్కట్లు

**గిద్దలూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
రేషన్ కార్డు లబ్దిదారులకు ఈకెవైసి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రేషన్ కార్డు లబ్దిదారులు ఈకెవైసి చేయించుకునేందుకు రాత్రులు సైతం పట్టనంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద క్యూలో నిలుచో లేక వారి చెప్పులు, ఇటుకలు, రాళ్ళపై వారి పేర్లు రాసి వరుస క్రమంలో పెట్టి ఉంచుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయాల్లో కూడా ఈకెవైసికి అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



## సార్వభౌమ అలంకారంలో శ్రీ చెన్నకేశవుడు









**మార్కాపురం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు పట్టణంలోఅంగరంగ వైభవంగా జరుగుతున్నాయి,బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే ఉత్సవాలలో పదవరోజు ఆదివారం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గజవాహనంపై శ్రీ సార్వభౌమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు, ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు స్వామివారిని శ్రీ సార్వభౌమరూపంలో శోభాభిమానంగా అలంకరించారు, పెరుమాళ్ళ వెంకట సుబ్రహ్మణ్యం ఉభయ దాతగా వ్యవహరించారు, మాడవీధులలో స్వామివారి నగరోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. శాసనసభ్యులు కందులనారాయణరెడ్డి,అన్నారాంబాబు, మున్సిపల్ చైర్మన్ సిహెచ్ బాల మురళికృష్ణ, రథసప్తమి కమిటీ అధ్యక్షుడు యక్కలి కాశి విశ్వనాథం, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఐమ్మడి కాశీనాథ్,మున్సిపల్ కమిషనర్ నారాయణరావు టిడిపి నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్,అల్లంపల్లి, తాళ్లపల్లి సత్యనారాయణ,తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు,డి.ఎస్.పి యు.నాగరాజు ఆధ్వర్యంలో సీఐ పి.సుబ్బారావు నేతృత్వంలో నిర్వహించారు గోలమారి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు,

## ఆదివాసీలపై యుద్ధం ఆపాలి

### - ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ - వరుస ఎన్‌కౌంటర్స్‌పై చర్చా వేదిక



**చీరాల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, చీరాల నందు ఆదివాసీలపై జరుగుతున్న సైనిక దాడులను వ్యతిరేకిస్తూ, ఆదివాసీల పై జరుగుతున్న మానవహణాన్ని ఖండిస్తూ, కేంద్ర ప్రభుత్వం తక్షణమే మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలనే డిమాండ్‌తో మంగళవారం ఉదయం 9.30 గంటలకు చర్చా సమావేశం జరుగుతుందని ప్రజా సంఘాల ఐక్యవేదిక తెలిపింది. అటవీ ఖనిజ సంపదను ప్రభుత్వ మద్దతుతో దోచుకుంటున్న బహుళ జాతి కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసీలపై జరుగుతున్న సైనిక దాడులను వ్యతిరేకిస్తూ ఆదివాసీలను దేశ పౌరులుగా, ప్రజా స్వామ్యవాదులుగా మద్దతును ఇవ్వాలని తెలిపారు. మధ్యభారతంలోని చత్తీష్‌గడ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలలో ఉన్న సహజ వనరులైన ఖనిజ సంపదను భవిష్యత్తు తరాలకు అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యం కాపాడుకోవడం కోసం ఆదివాసీలు అడవులను, అడవిలో ఉన్న ఖనిజ సంపదను కాపాడుతుంటే బహుళజాతి కంపెనీలతో దోచుకుపోవడానికి కేంద్ర ప్రభుత్వంప్రయత్నిస్తుంది. ఆదివాసీలకు ప్రత్యేకంగా ఉన్న రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 లోని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ ప్రాంతాలు సంరక్షణ చట్టం, ఫారెస్టు హక్కుల చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, 1/70 యాక్ట్ వంటి హక్కులను కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై ఆదివాసీలను అడవికి దూరం చేసే ప్రయత్నం చేస్తుంది. గత 18 నెలల నుండి మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను హననం చేయడం అంటే రాజ్యాంగాన్ని కాలరాయడమే అవుతుంది. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న సైనిక చర్యలను వెంటనే ఆపాలి. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మోహన్‌రావు, రాష్ట్ర చేనేత జన సమాఖ్య, ఎన్.మోహన్‌కుమార్ ధర్మ, ఎరుకల హక్కుల పోరాట సమితి, ఊటుకూరి వెంకటేశ్వర్లు, బీసీ ఫెడరేషన్, చీరాల, గాదె హరిహరరావు, సీనియర్ సిటిజన్,వెల్ఫేర్ అసోసియేషన్, బడుగు విమలాకర్,పౌరహక్కుల సంఘం, గుంటూరు మల్లిఖార్జునరావు, రాష్ట్ర చేనేత జన సమాఖ్య వారు పాల్గొన్నారు.

## అండగా ఉంటా.. అన్ని విధాలుగా ఆదుకుంటా


### - వేస్ట్ పిక్కర్స్ కుటుంబాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే కొండయ్య



**చీరాల, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
చీరాల ఫైర్ స్టేషన్ రైల్వే గేటు సమీపంలో స్మశానం వద్ద రోడ్డుపై నివాసం ఉంటున్న వేస్ట్ పిక్కర్స్ కుటుంబాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ భగవాన్ దాస్ జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన వారు ప్రజా దర్బార్ ముగిసాక వెంటనే అరవమాల కుటుంబీకుల సమస్యలను పరిశీలించేందుకు ఆ ప్రాంతంకు చేరుకొని వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సొంత ఇళ్ళు లేకపోవడంతో స్మశానంలోనే తామంతా జీవనం సాగిస్తున్నామన్నారు. తమకు గృహ నిర్మాణం చేపట్టి, తాగునీరు, విద్యుత్ కనెక్షన్, జీవన ఉపాధి కల్పించాలని పలు సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ వెంకట మురళి హౌసింగ్ పీడీతో ఫోన్లో సంభాషించి తక్షణమే యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణం చేపట్టి వారికి అందించేలా ప్రతిపాదనను సిద్ధం చేయాలన్నారు. ఆ దిశగా నివేసన స్థలాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రత్యేక చొరువ తీసుకొని ప్రభుత్వ పథకాలన్నింటిని అందిస్తామని పెన్షన్లు, కుట్టు మిషన్లు పై శిక్షణ అందించి ఉపాధి చూపించి అన్ని విధాల ఆదుకుంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు. వేసవి కాలం కావడంతో రోడ్లపై అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. కావున రెవెన్యూ అధికారులు తక్షణమే వారి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి వివరాలు సేకరించి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే కొండయ్య చొరువతో జిల్లా కలెక్టర్ తమ ప్రాంతాన్ని వివిధ శాఖల అధికారులతో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని సూచించడంతో వేస్ట్ పిక్కర్స్ నివాసితులు అందరూ ఎమ్మెల్యేకు కొండయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, మున్సిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్, తహశీల్దార్ గోపికృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జయంతిబాబులు డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పుగుండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లు బిగించడంపై ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత అధికంగా కరెంటు బిల్లులు వస్తున్నాయని ఆరోపించారు. ఆదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం స్పీడుగా అమలు చేస్తుందన్నారు. తొలుత చిన్న వ్యాపారులు చిన్న పరిశ్రమలు దెబ్బతీసే విధంగా స్మార్ట్ మీటర్లు బిగింపుకు పూనుకుందన్నారు. తద్వారా వారికి వేలాది రూపాయలు కరెంటు బిల్లులు రావడంతో పరిశ్రమలు చిన్న వ్యాపార సంస్థలు చిన్న రైస్ మిల్లులు వారు వచ్చిన కరెంటు బిల్లులు కట్టలేక మూసువేసే పరిస్థితి తలెత్తిందన్నారు. ఒక్కొక్కరికి 20 వేల నుంచి 45వేల వరకు బిల్లులు రావడంతో దానిపై విద్యుత్ ఎస్ఈఈ, డీ స్థాయి అధికారులు ఒక సారి బిల్లు వచ్చిన తరువాత కట్టవలసిందేనని మా చేతుల్లో ఏమి లేదని సమాధానమిస్తున్నారు, ముఖ్యమంత్రి స్థాయిలో ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అటువంటప్పుడు ముఖ్యమంత్రి వచ్చినప్పుడేస్మార్ట్ మీటర్లు బిగించాలి కదా మరి మీ చేతులతో ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. అంతటి ఆగకుండా గృహ అవసరాలకు కూడా స్మార్ట్‌మీటర్లు బిగించే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. వెంటనే ప్రభుత్వం పునరాలోచించి స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయం మానుకోవాలని లేనిచో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, మాదాసు నాగేశ్వరరావు, పెంట్యాల శ్రీనివాసరావు, ఎన్.రామారావు, యు.వెంకటేశ్వర్లు, పాలపర్తి బాబు, పెంట్యాల శ్రీను, కమలాకర్, పిస్సింటి నాగేశ్వరరావు, బసవపున్నయ్య, తెలగతోటి సుబ్బయ్య, పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## నాగర్పమ్మ కొలుపుల్లో పాల్గొన్న దారపనేని చంద్రశేఖర్



**కనిగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
పామూరు మండలం తూర్పుకోడ గుండ్లపాడు, పోతవరం గ్రామంలో సోమవారంచెనికల పెద్దమాల కొండయ్య ,వెంగమ్మ దంపతుల కుమారుడు నాగరాజు, కోడలు శివజ్యోతి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నాగర్పమ్మ కొలుపులు శ్రద్ధాభక్తులతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా దేవతకు విశేష పూజలు నిర్వహించి, వ్రతాలు, హారతులు ఇవ్వడమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, నాగర్పమ్మ భక్తులకు ఆశీస్సులు అందించారు. అనంతరం చెనికల కొండయ్య కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో చెనికల చిన్న మాలకొండయ్య, మాధవరావు, నాగరాజు, డాక్టర్ నాగార్జున– రూపశ్రీ, మహేష్‌బాబు, శివరామకృష్ణ, నూతలపాటి వెంకటేశ్వర్లు, చెనికల శ్రీనివాసులు, రవి, సురేష్, రమేష్, మనోజ్,మానం మల్లిఖార్జునరావు అండ్ బ్రదర్స్,మానం వెంగళరావు,చెనికల కొండయ్య(కర్ణం),మేకనబోయిన వెంకటేశ్వర్లు,డబ్బుకొట్టు కృష్ణయ్య, నాగేశ్వరరావు, రవణాచార్యులు,నాగయ్య కుటుంబసభ్యులు,నాగినేనిరమేష్‌బాబు, గడిపూటి వెంకటేశ్వర్లు, తిరుపతయ్య,మిరియం సుబ్బరాయుడు, యరసింగ్ రాయుడు, దారపనేని నరసింహారావు, నూతంగి నరసింహారావు అండ్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరిలో శ్రీసద్గురుసాయి సేవ సమితి సేవలు ప్రారంభం

### - గూడూరులో బాబా స్తూప ఆవిష్కరణ సందర్భంగా సంస్థ ప్రారంభం



**కనిగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**
శ్రీసద్గురు సాయి సేవ సమితి కనిగిరి అనే స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సోమవారం కృష్ణా జిల్లా గూడూరులోని ఆశ్రమంలో బాబా స్తూప ఆవిష్కరణ సందర్భంగా శ్రీరామ్ రతన్ బాబా ఆశీస్సులతో, శ్రీ విశ్వధానంద భారతి మాతాజీ తమ అమృత హస్తాలతో ఈ సంస్థను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ బాబా తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా ఈ సంస్థ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సేవా భావనతో గల కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేకూరాలనే సంకల్పంతో ఈ సంస్థ ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మానుగుంట మహీధర్‌రెడ్డి,ముక్కు కాశిరెడ్డి, ప్రకాశం జిల్లా సాయి మందిరాల ట్రెజరర్ దేవకి సుబ్రహ్మణ్యం, సాయిబాబా ఆలయ ట్రెజరర్ ముచ్చర్ల ధర్మారావు, ముక్కు బాలకృష్ణారెడ్డి, బ్రహ్మయ్య స్వామి, బాబా ఆలయ అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, సింగరాజు మాలకొండ ఈశ్వరరావు, వాగిచర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య శిబిరాలు, అన్నదాతలు విద్యా సహాయం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## యర్రగొండపాలెం పోరంబోకు రాళ్ళవాగుపై నిర్మించిన

### బ్రిడ్జిని చుట్టుప్రక్కల వాగు పోరంబోకు పొలాలను పరిశీలిస్తానన్న కలెక్టర్

### - న్యాయదేవతే కదిలి వచ్చి మాకు న్యాయం చేస్తానని చెప్పినట్లు ఉందని బాధితుల ఆనందం





**యర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణ పరిధిలోని మిల్లంపల్లి రాళ్ళవాగు పరిధి పోరంబోకు భూమి స్థలంలో జరుగుతున్న రచ్చ విషయం సోమవారం మరో మారు ఒంగోలు మీకోసంలో కలెక్టర్‌కు బాధితులు మొర పెట్టుకున్నారు. సమస్య తీవ్రతనుగమనించిన కలెక్టర్ యర్రగొండపాలెం పోరంబోకు రాళ్లవాగు, వాగుపై కట్టిన వంతెన, వంతెన పక్కన నిర్మించిన పార్కు, కబ్జాకు గురైన వాగు పోరంబోకు స్థలాన్ని నేనే స్వయంగా పర్యటించి పరిశీలిస్తానని, కలెక్టర్ బాధితులకు చెప్పినట్లు తెలుస్తుంది. దీంతో బాధితుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. సాక్షాత్తు మాకు న్యాయం చేయడం కోసం న్యాయ దేవతే కదిలి వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 7వ తేదీన బాధితులు రాళ్ళవాగు పోరంబోకు స్థలం ఆక్రమణ గురించి, రాళ్ళవాగుపై స్వంతంగా 2కోట్లు వెచ్చించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమ పొలాలను ధౌర్జన్యంగా కలిపివేసుకున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదుకు కలెక్టర్ స్పందించి వాగు పోరంబోకు స్థలాలను పరిశీలించి రిపోర్టు ఇవ్వాలని ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ వారికి ఆదేశాలు ఇచ్చిన విషయం విధితమే. అయితే కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఇక్కడి సంబంధజత రెవెన్యూ సిబ్బంది వారే పాత కొలతలనే తారుమారుగా చేసి వారికి రిపోర్టు పంపించడంపై ఎలాంటి న్యాయం జరగలేదని, హెచ్చరిక బోర్డు పెట్టినప్పటికీ మరుసటి రోజే అక్కడి బోర్డును తొలగించడంపై బాధితులు మరోమారు మీకోసంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు దారుల ఆవేదనను ఆలకించిన కలెక్టరే స్వయానా తాను యర్రగొండపాలెం రాళ్ళవాగు వంతెన పరిసర పొలాలను పర్యటిస్తానని చెప్పడం జరిగిందని బాధితులు తూమాటి సాలమ్మ, లక్ష్మీనారాయణ తదితరులు తెలిపారు.

## కూలిన జంపలేరు వాగుపైగల పురాతన బ్రిడ్జి ప్రక్కగోడ

### - పురాతన బ్రిడ్జిపై నెర్రెలు కొట్టి పగుళ్ళు ఏర్పడిన వైనం

### - కొత్తబ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు



**అర్ధవీడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త**
కంభం నుండి అర్ధవీడు వెళ్ళు మార్గ మధ్యలోని మొహిద్దీన్ పురం గ్రామ సమీపంలోగల పూలు రంగస్వామి గుడి వద్దగల జంపలేరు వాగుపై ఉన్న పురాతన బ్రిడ్జి ప్రక్కగోడ ఇటీవల కూలిపోయింది. బ్రిడ్జి పూర్తిగా పురాతనమైనది కావడంతో బ్రిడ్జి అంతటా నెర్రెలుబారి పగుళ్ళు ఏర్పడి తీవ్ర ప్రమాదకర స్థితిలో ఉంది. నిత్యం వాహనదారులు బ్రిడ్జి పైనుంచి రాకపోకలు సాగిస్తున్నందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు నిత్యం బ్రిడ్జిపై కంభం వైపుకు రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. ప్రమాదకర స్థితిలో ఉన్న బ్రిడ్జిని తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేయాలని అన్ని గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

2-4Pg5.qxd:22-4Pg5.qxd 01/01/01 8:45 AM Page 1




# యెమెన్ యుద్ధ రహస్యాలు లీక్

## రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌పై దుమారం



**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికాకు చెందిన కీలక రహస్యాలు లీక్‌అయినట్లు తెలుస్తోంది. యెమెన్‌పై చేపట్టిన భీకరదాడులకు ముందే దీనికి సంబంధించిన ప్రణాళిక బహిర్గతం అయినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే దీనికి సంబంధించి తాజాగా మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దాడులకు సంబంధించిన రహస్యాలను స్వయంగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తన కుటుంబసభ్యులతో కూడా పంచుకున్నారని బయటకు పొక్కింది. తన ఫ్యామిలీ గ్రూప్‌చాట్‌లో దీని గురించి చర్చించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి 15న యెమెన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దాడులను ప్రకటించారు. అయితే, అంతకంటే ముందే సిగ్నల్‌లోని ఓ గ్రూప్‌చాట్ ద్వారా ఈ యుద్ధ ప్రణాళిక బయటికి వచ్చినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అదే సమయంలో రక్షణ మంత్రి హెగ్సెత్ కూడా రెండో సిగ్నల్ చాట్‌ను ఉపయోగించి ఈ విషయాన్ని తమ కుటుంబసభ్యులు చెప్పినట్లు ఆంగ్లమీడియాలో కథనాలు వచ్చాయి. తన భార్య జెన్నిఫర్, సోదరుడు ఫిల్ హెగ్సెత్‌తో ఈ యుద్ధ ప్రణాళికలను పంచుకున్నట్లు వెల్లడించింది. హెగ్సెత్ భార్య ఫాక్స్ న్యూస్‌లో మాజీ ప్రొడ్యూసర్ కాగా, ఇక సోదరుడు హోంల్యాండ్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు హెగ్సెత్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇతర ముఖ్య అధికారులు ఉన్న సిగ్నల్ గ్రూప్ చాట్ నుంచి ఈ యుద్ధ ప్రణాళికలు బహిర్గతమయ్యాయి. ఈ చాట్‌లో ద అట్లాంటిక్ మ్యాగజైన్ ఎడిటర్ ఇన్ చీఫ్ జెఫ్రీ గోల్డ్‌బర్గ్ కూడా ఉన్నారు. యెమెన్‌పై దాడుల గురించి చర్చించడానికి రెండురోజుల ముందే తనను ఆ గ్రూప్‌లో చేర్చాలని జెఫ్రీ కోరారు. ఈ విషయాన్ని వైట్‌హౌస్ కూడా ధ్రువీకరించింది. ఈ లీక్‌లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని హెగ్సెత్, ట్రంప్ ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న వేళ మరో కథనం వెలువడటం మరింత ఆందోళనకరంగా మారింది. దీంతో రక్షణ మంత్రిని తొలగించాలని ప్రతిపక్ష డెమోక్రాట్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే, తాజా కథనాలపై పెంటగాన్, వైట్‌హౌస్ నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. హెగ్సెత్‌పై గతంలోనూ ఇలాంటి విమర్శలు వచ్చాయి. రక్షణ శాఖకు సంబంధించిన అధికారిక, రహస్య సమావేశాలకు భార్య, సోదరుడిని వెంటబెట్టుకునే వెళ్లేవారని ఆ మధ్య వార్తలు వచ్చాయి. మరోవైపు, యెమెన్ రాజధాని సనాలో సోమవారం తెల్లవారుజామున అమెరికా వైమానిక దాడులు చేపట్టింది. ఇందులో కనీసం 12 మంది మరణించగా, మరో 30 మంది గాయపడినట్లు హౌతీరెబల్స్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.



అంతరిక్షంలో స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు



ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్

# అంతరిక్షంలో రెండవ డాకింగ్ ప్రక్రియ ప్రారంభం

**శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** అంతరిక్షంలో రెండు ఉపగ్రహాల అనుసంధానం ప్రక్రియ విజయవంతంగా జరుగుతోంది. శ్రీహరికోట నుంచి గతంలో ప్రయోగించిన రెండు జంట ఉపగ్రహాలను ఒక్కచోటికి చేర్చి మళ్లీ వాటిని విడిపోయేలా చేయడమనే డాకింగ్, అన్‌డాకింగ్ ప్రక్రియను మొదటి దశలో పూర్తి చేశారు. ప్రస్తుతం రెండవ డాకింగ్ కార్యక్రమాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టారు. భూకేంద్రాల నుంచి ఈ జంట ఉపగ్రహాలను ఒక్క చోటికి చేర్చే ప్రక్రియలో భాగంగా ఏప్రిల్‌లో పరిశోధన ఉంటుందని గతంలోనే చెప్పి ఉన్నారు. ఆ మేరకు డాకింగ్ తర్వాత విద్యుత్ బదిలీ కూడా విజయవంతంగా జరిపి మరోసారి శాస్త్రవేత్తలు విజయవంతం కావడానికి కృషి చేశారు. దీనిపై ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ స్పందిస్తూ స్పేడెక్స్ యొక్క రెండవ డాకింగ్ కార్యక్రమం సున్నితమైనదిగా అభివర్ణించారు. ఇస్రో బృందాలు దీన్ని సమర్థవంతంగా తేలికగా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

అంతరిక్షంలో స్పేస్‌స్టేషన్ భారత్ స్వయంగా ఏర్పాటు చేసుకోవడానికి ముందుగా ఇటువంటి డాకింగ్, అన్‌డాకింగ్ పరిశోధనలు విస్తృతంగా జరపాల్సి ఉంది.

# అమెరికాను దెబ్బతీస్తే సహించను

## ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక!

**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికా వాణిజ్యం విషయంలో అత్యంత కఠిన వైఖరిని అవలంబిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలకు మరో హెచ్చరిక జారీచేశారు. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాలు కాకుండా ఇతర రూపంలో అమెరికాను దెబ్బతీసే ఎనిమిది అంశాలను వెల్లడించి ఏదైనా దేశంవాటిని అనుసరిస్తున్నట్లు బయటపడితే తమ దేశంతో సంబంధాలు దెబ్బతింటాయన్నారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌సోషల్‌లో పోస్టుచేశారు. ఇప్పటికే ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించి ఒక్క చైనా మినహా మిగిలిన వాటికి 90రోజుల ఉపశమనం కల్పించిన విషయం విదితమే.

**ఏమిటా జాబితా ?, కరెన్సీ మేనిప్యులేషన్ :** చాలా దేశాలు తమ వస్తువులను అంతర్జాతీయ మార్కెట్‌లో చౌకగా విక్రయించేందుకు కరెన్సీ విలువలను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తాయి. గతంలో అమెరికా ఇలాంటి దేశాల జాబితాలను కూడా తయారుచేసింది.

**వాల్యూయాడెడ్ ట్యాక్స్ (వ్యాట్):** కొన్ని దేశాల ఉత్పత్తులపై వ్యాట్ విధిస్తాయి. కానీ, దిగుమతులపై వాటిని కొనసాగించినా.. ఎగుమతులపై ఆ సొమ్మును రీఫండ్ చేస్తుంటాయి. అలాంటి చర్యలు సహించమన్నారు. తక్కువ రేటుకు డంపింగ్ చేయడాన్ని కూడా ట్రంప్ తీవ్రంగా పరగణించారు. చైనా వంటి భారీ ఉత్పాదక దేశాలు.. కారు చౌకగా వస్తువులు తయారుచేసి ఇతర దేశాల్లో డంపింగ్ చేస్తాయి. దీంతో ఆయా దేశాల్లో స్థానిక పరిశ్రమలు మూతపడతాయి. ఎగుమతులపై ప్రభుత్వాలురాయితీలు ఇవ్వడాన్ని కూడా ట్రంప్ తప్పు పట్టారు. వ్యవసాయ రంగంలో దేశీయ రైతుల కోసం రక్షణాత్మక రాయితీలు కూడా ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఇవి కాకుండా నకిలీల తయారీ, మేధో హక్కుల అపహరణ, అమెరికా టారిఫ్‌లను తప్పించుకోవడానికి మరో దేశం నుంచి ఎగుమతి చేయడం వంటివి కూడా ఉపేక్షించమన్నారు.

ఇక ప్రత్యేకంగా జపాన్ నిర్వహించే ఓ పరీక్షను కూడా ట్రంప్ తప్పు పట్టారు. దేశీయ సంస్థలను కాపాడేందుకు రక్షణాత్మక సాంకేతిక ప్రమాణాలను ఏర్పాటు చేయకూడదన్నారు. దీనికి గాను జపాన్ నిర్వహించే బౌలింగ్ బాల్ టెస్ట్‌ను ఉదహరించారు. ఈ పరీక్షను జపాన్ 2018లో ప్రవేశపెట్టింది. విదేశీ కార్లు తమ దేశంలో విక్రయించకుండా చూసేందుకు దీనిని మొదలుపెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ పరీక్షలు దాదాపు 20 అడుగుల ఎత్తు నుంచి బౌలింగ్ బాల్‌ను కారు హుడ్‌పై వదులుతారు. అప్పుడు దానికి సొట్ట (డెంట్) పడకపోతే అది పరీక్షలో విజయం సాధించినట్లు భావిస్తారు. ఇదో భయంకరమైన పరీక్షగా ట్రంప్ అభివర్ణించారు. ఇప్పటికే ట్రంప్ తాను విధించిన ప్రతీకార సుంకాలపై 90 రోజులు నిలుపుదలను అమలు చేస్తున్నారు. కానీ, చైనాతో టారిఫ్‌ల యుద్ధం తారా స్థాయికి చేరింది. ఆ దేశంపై మొత్తం 243 శాతంవరకు పన్నులు వసూలు చేయాలని అమెరికా నిర్ణయించింది.




# పోలీసుల ముందు హాజరుకావాలి

## పూజా ఖేద్కర్‌కు సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగం సంపాదించిన వ్యవహారంలో ఆ మధ్య మాజీ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ పేరు మీడియాలో చక్కర్లు కొట్టింది. ఆమెపై యూపీఎస్సీ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం మే 2న ఢిల్లీ పోలీసుల ముందు విచారణకు హాజరుకావాలని ఖేద్కర్‌ను ఆదేశించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు సోమవారం ఆర్డర్ వేసింది. కేసు తదుపరి విచారణను మే 21 కి వాయిదా వేసింది. అయితే అప్పటివరకు ఖేద్కర్‌పై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు పేర్కొంది. ఈ కేసులో కచ్చితమైన విచారణ జరగలేదన్న అత్యున్నత న్యాయస్థానం విచారణ త్వరగా ముగించాలని పోలీసులను ఆదేశించింది. పోలీసుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఖేద్కర్‌ను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అయితే కోర్టు ఆమెకు మధ్యంతర రక్షణ కల్పించింది. పుణెలో ట్రెయినీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేద్కర్‌పై అధికార దుర్వినియోగంతోపాటు, యూపీఎస్సీలో తప్పుడు పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెను ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది.

నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు లిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతోపాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. దాంతో పూజా ఖేద్కర్ హైకోర్టును ఆశ్రయించారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు. యూపీఎస్సీకి తనపై అనర్హతవేటువేసే అధికారం లేదని వాదించారు. అయినా ఆమెకు నిరాశే ఎదురైంది. గత ఏడాది ఆగస్టులో ఆమె ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. కోర్టు దాన్ని ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వస్తోంది.

# రాజీపడిన ఎన్నికల సంఘం: రాహుల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** కేంద్రం ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఆ వ్యవస్థ రాజీ పడినట్లు కనిపిస్తోందనడంతో పాటు అందులో పలు లోపాలున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ, బోస్టన్‌లోని ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన అమెరికా భారత్ సంబంధాలను గురించి కూడా ప్రస్తావించారు. ఇరుదేశాలు కలిసి పనిచేయాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. భారత ఎన్నికల సంఘం రాజీ పడింది. ఆ వ్యవస్థలో చాలా లోపాలు ఉన్నాయని మాకు స్పష్టంగా తెలుసు. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు మాట్లాడాను. ఇటీవల మహారాష్ట్రలో ఎన్నికలు జరిగాయి. అక్కడ సాయంత్రం 5:30 నుంచి రాత్రి 7:30 గంటల మధ్య దాదాపు 65 లక్షల మంది ఓటు వేశారు. ఈ విషయాన్ని స్వయంగా ఎన్నికల సంఘమే మాతో చెప్పింది. ఇది భౌతికంగా అసాధ్యమైంది. ఒక్కో ఓటర్ ఓటు వేయడానికి దాదాపు 3నిమిషాల సమయం పడుతుంది. అంత తక్కువ వ్యవధిలో అంతమంది ఎలా ఓటు వేస్తారు. మేము వీడియోలు చూపించాలని అడిగితే ఈసీ తిరస్కరించింది. ఇప్పుడు అలా అడగటానికి వీలు లేదంటూ చట్టంలో కూడా మార్పుల చేశారు. రాహుల్ మరోవైపు కేంద్ర ఎన్నికల సంఘంపై చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ఆయన భారతీయ ఓటర్ల నమ్మకాన్ని పొందలేకపోయారని విమర్శించింది. ఈ మేరకు బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజాస్వామ్యానికి, భారతదేశానికి వ్యతిరేకి అయిన రాహుల్ గాంధీ దేశీయ ఓటర్ల నమ్మకాన్ని గెలవలేకపోయారని దుయ్యబట్టారు. ఇప్పుడు విదేశీ గడ్డపై మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రశ్నించడం ప్రారంభించారని భండారీ విమర్శించారు. విదేశాల్లో భారత పరువును పదే పదే ఎందుకు తీస్తారని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. పార్టీ అధికార ప్రతినిధి షెహబాజ్ పూనావాలా స్పందిస్తూ, అమెరికాలో భారతీయ సంస్థలను, న్యాయస్థానాలను కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు.



# పశ్చిమబెంగాల్ గవర్నర్‌కు అస్వస్థత

**కోల్‌కత్తా, ఏప్రిల్ 21:** పశ్చిమబెంగాల్ గవర్నర్ సివి ఆనందబోస్ ఛాతీలో నొప్పితో ఆస్పత్రి పాలయ్యారు. సోమవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో ఆయనను హుటాహుటిన కోల్‌కతాలోని కమాండ్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని రాజ్‌భవన్ అధికారులు వెల్లడించారు. గవర్నర్‌కు ప్రాథమిక పరీక్షలు చేశామని, ఆయన గుండెలో బ్లాకేజ్ ఉన్నట్లు గుర్తించామని కమాండ్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి ఆస్పత్రికి వెళ్లి గవర్నర్‌ను కలిశారు. గవర్నర్‌ను కలిసి ఆస్పత్రి బయటికి వచ్చిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను ఇప్పుడే గవర్నర్‌ను చూసి వచ్చానని, ఆయనకు మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఆదేశించానని చెప్పారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను కమాండ్ ఆస్పత్రి నుంచి అపోలో ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అయితే గవర్నర్‌కు అస్వస్థతపై రాజ్‌భవన్ ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. కాగా గవర్నర్ ఆరోగ్యానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



# బైక్ అదుపుతప్పి మహిళ మృతి

**లక్నో, ఏప్రిల్ 21:** వాహనాల తనిఖీ సందర్భంగా ఒక పోలీస్ అధికారి లాఠీతో బైక్‌పై కొట్టాడు. బైక్ అదుపుతప్పడంతో భర్త వెనుక కూర్చొన్న మహిళ రోడ్డుపై పడింది. ఆమె మీద నుంచి డంపర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించింది. దీంతో స్థానికులు రోడ్డును బ్లాక్ చేసి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ఎస్ఐపై కేసు నమోదైంది. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి వేళ కళ్యాణ్‌పూర్ ప్రాంతానికి చెందిన ప్రదీప్ తన భార్య అమరావతితో కలిసి బైక్‌పై పెళ్లి వేడుకకు బయలుదేరాడు. కాగా, నిగోహి ప్రాంతంలోని ధూలియా మలుపు దగ్గర వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రిషిపాల్ లాఠీతో ప్రదీప్ బైక్‌పై కొట్టాడు. దీంతో అతడు బ్యాలెన్స్ కోల్పోయాడు. ఈ నేపథ్యంలో బైక్ వెనుక కూర్చొన్న ప్రదీప్ భార్య అమరావతి రోడ్డుపై పడింది. అదే సమయంలో డంపర్ లారీ ఆమె పైనుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించింది. మరోవైపు స్థానికులు ఇది చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ మృతికి కారణమైన ఎస్ఐ రిషిపాల్‌పై మండిపడ్డారు. తెల్లవారుజామున 2 గంటల వరకు రహదారిని బ్లాక్ చేసి నిరసన తెలిపారు.

స్థానిక ఎమ్మెల్యే సలోనా కుష్వాహా కూడా అక్కడకు చేరుకుని ఎస్ఐ తీరును నిలదీశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ రిషిపాల్‌తోపాటు డంపర్ లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# సిద్ధివినాయక ఆలయంలో మస్క్ తల్లి ప్రత్యేక పూజలు



**ముంబయి, ఏప్రిల్ 21:** ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తల్లి మయే మస్క్ ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖనటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తో కలిసి ముంబైలోని ప్రముఖ సిద్ధివినాయక ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మరోవైపు మయే మస్క్ తన 77వ పుట్టినరోజును భారత్‌లో సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ముంబైలో ఘనంగా పార్టీ అరేంజ్ చేశారు. ఈపార్టీకి 40నుంచి 50మంది హాజరైనట్లు ముంబై మీడియా తెలిపింది. ఇక తన బర్త్‌డే సందర్భంగా మయే మస్క్ ప్రముఖ డిజైనర్ సబ్యసాచి రూపొందించిన దుస్తుల్లో మెరిసిపోయారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న తల్లికి టెక్ టైకూన్ మస్క్ ప్రైజింగ్ గిఫ్ట్ పంపారు. అందమైన పూలను తన తల్లికి బర్త్‌డే కానుకగా అందించారు. ఈ విషయాన్ని మయే మస్క్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.



# తదుపరి పోప్ ఎవరు?

**వాటికన్‌సిటీ, ఏప్రిల్ 21:** పీపుల్స్ పోప్‌గా ప్రసిద్ధిగాంచిన ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఈ విషయాన్ని కార్డినల్ కెవిన్ ఫారెల్ వాటికన్ టెలిగ్రామ్ ఛానెల్‌లో ప్రకటించారు. దీంతో తదుపరి పోప్ ఎవరన్న అంశంపై చర్చ మొదలైంది. 2025 జనవరిలో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన నిబంధనలను నిర్ణయించారు. కేవలం 80 లోపు వయసు ఉన్న కార్డినల్స్ మాత్రమే పోప్ ఎంపిక రహస్య ఓటింగ్‌లో పాల్గొననున్నారు. దీంతో మొత్తం 252 కార్డినల్స్‌లో 138 మందికి మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనే అర్హత ఉంది. దీనికి సంబంధించిన ఓటింగ్ సిస్టీన్ ఛాపెల్‌లో నిర్వహించనున్నారు. ఇది పూర్తిగా రహస్య విధానంలో జరుగుతోంది. ఓటింగ్‌లో పాల్గొనే ప్రతి కార్డినల్ ఓటింగ్ సమయంలో చర్చించిన అంశాలను రహస్యంగా ఉంచుతానని ప్రమాణం చేయాల్సి ఉంటుంది. దీనిని ఉల్లంఘిస్తే బహిష్కరణ వేటు పడుతుంది. రోజువారీ నాలుగు రౌండ్ల చొప్పున ఎవరైనా ఒక అభ్యర్థికి మూడింట రెండొంతుల మెజారిటీ లభించే వరకు ఓటింగ్ జరుగుతుంది. ఈ ఎన్నికల ప్రక్రియకు మొత్తం 15 నుంచి 20 రోజుల సమయం పట్టొచ్చు. కాకపోతే పోప్ జాన్‌పాల్-2 ఈ విధానంలో స్వల్పమార్పు చేసినట్లు చెబుతారు. తొలిరోజు ఎన్నికలో మాత్రమే మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. అదే 10-12 రోజుల వరకు మెజారిటీ నెంబరును ఎవరూసాధించలేకపోతే ఆ తర్వాత సాధారణ మెజారిటీ వచ్చిన వారు పోప్ వారసుడిగా ఎన్నికవుతారు. ఇక్కడొక ఆసక్తికర అంశం ఉంది. నిర్వహించిన ఎన్నికల్లో ఎవరూ విజయం సాధించకపోతే బ్యాలెట్ పత్రాలను నల్లటి పొగను విడుదల చేసే ప్రత్యేక రసాయనాలతో కాల్చేస్తారు. అదే కనుక తెల్లటి పొగవెలువడితే పోప్ ఎన్నికైనట్లు సంకేతం. ఇదంతా సిస్టీన్ ఛాపెల్‌లో జరుగుతుంది. ఫ్రాన్సిస్ వారసత్వం కోసం పోటీ పడుతున్న వారిలో వాటికన్ సిటీ విదేశాంగ మంత్రి కార్డినల్ పీట్రోపారోలిన్, ఐరోపా బిషప్స్ కాన్ఫరెన్స్ మాజీఅధ్యక్షుడు పీటర్ ఎర్డో, కార్డినల్ పీటర్ టురుక్సన్ (ఘనా), కార్డినల్ టూయిస్ టాగ్లో, కార్డినల్‌మాట్టో జూప్పి, కార్డినల్ రేమాండ్ లియోబుర్కె పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

# కాల్పుల విరమణకు కట్టుబడిలేని రష్యా

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**కీవ్, ఏప్రిల్ 21:** ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని రష్యా ప్రకటించిందే కానీ ఆ మాటకు కట్టుబడి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈస్టర్ కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు తప్పుడు వైఖరిని రష్యా ప్రదర్శిస్తోందని విమర్శించారు. రష్యా ఎప్పటిలాగే తమపై దాడులు కొనసాగిస్తోందని, పదుల కొద్ది డ్రోన్, బాంబు దాడులు చేసిందని తెలిపారు. మరోవైపు కీవ్ బలగాలు కూడా దాడులు చేశాయని రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లోని అధికారులు ఆరోపించారు. తాత్కాలిక కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు రష్యా సైన్యం చెబుతోంది. కానీ యుద్ధక్షేత్రంలో పైచేయి సాధించేందుకు, మా దేశానికి నష్టం కలిగించే ఏ అవకాశాన్నీ రష్యా వదులుకోవడం లేదు. 50కిపైగా బాంబు దాడులు, పదుల కొద్ది డ్రోన్ దాడులు చేసింది. ఈ ఉదయం 10 గంటల నుంచి దాడుల తీవ్రత మరింత పెరిగింది. అయితే రష్యా వైమానిక దాడులకు సంబంధించి సైరన్‌లు మోగకపోవడం కాస్త ఉపశమనం కలిగించే అంశం. పుతిన్‌కు తన సైన్యంపై పూర్తి నియంత్రణ లేదని, క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలిస్తుంటే యుద్ధాన్ని ముగించే ఉద్దేశం ఆ దేశానికి లేదనేది స్పష్టమవుతోందని జెలెన్‌స్కీ ట్వీట్ చేశారు. కాల్పుల విరమణ షరతులకు పూర్తిగా కట్టుబడి ఉండాలని ఆయన రష్యాను డిమాండ్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి 30రోజుల పాటు కాల్పుల విరమణను పొడిగించాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు. క్రిమియాపై రష్యా నియంత్రణను గుర్తించేందుకు తాము సిద్ధమేనని అమెరికా ప్రకటించిం. ఇదిలా ఉండగా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాపై రష్యా నియంత్రణను గుర్తించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ శాంతి ప్రతిపాదన వల్ల రష్యాఉక్రెయిన్‌ల మధ్య తక్షణ కాల్పుల విరమణ అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఉక్రెయిన్ సహా ఐరోపా యంత్రాంగాలు పరిశీలించాయి. క్రిమియాపై రష్యా నియంత్రణ కొనసాగడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకూలంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు కష్టమైనా చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించడం గమనార్హం.

# యుఎస్‌తో వాణిజ్య ఒప్పందంలో జాగ్రత్త: చైనా హెచ్చరిక



**బీజింగ్, ఏప్రిల్ 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నుంచి బయటపడేందుకు అనేక దేశాలు అగ్రరాజ్యంతో బిజీబిజీగా చర్చలు జరుపుతున్నాయి. అయితే, టారిఫ్‌ల నుంచి ఉపశమనం కావాలంటే చైనాతో ఆర్థిక బంధాన్ని తెంచుకోవాలని తన మిత్ర దేశాలకు ట్రంప్ సర్కారు షరతు పెట్టినట్లు కథనాలు వస్తున్నాయి. ఈ వార్తలపై తాజాగా బీజింగ్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'చైనా ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంటే దాన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైతే దాన్ని ఎన్నిటికీ అంగీకరించబోం. మా నుంచి ప్రతిస్పందన కూడా అదేస్థాయిలో ఉంటుంది. ఇతరుల ప్రయోజనాలను పణంగా పెట్టి తాత్కాలికంగా, స్వార్థపూరితంగా లాభం పొందాలనుకోవడం.. పులి చర్మంకోసం దాంతోనే డీల్ చేసుకోవడం లాంటిది. దీని వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం చేకూరదు. స్వల్పకాలిక లాభాల కోసం వెళితే.. అది ఎప్పటికైనా మనకే హాని చేస్తుందన్న విషయాన్ని దేశాలు గుర్తుంచుకోవాలి. బుజ్జగింపులతో శాంతి స్థాపన జరగదు. రాజీ పడితే గౌరవం లభించదు' అని చైనా తమ ప్రకటనలో హెచ్చరించింది.

22-4Pg6exHMNWJQE.qxd:22-4Pg6exHMNWJQE.qxd 01/01/01 10:16 AM Page 1



# అరుదైన మూలకాలు మానవ అభివృద్ధికి దోహదం చేయాలి

## - రేర్ ఎర్త్స్ టెక్నాలజీపై అంతర్జాతీయ సదస్సులో వక్తల మనోగతం

**తిరుపతి విద్య ఏప్రిల్ 21 ప్రభాత వార్త :** భూమి లోపల లభ్యమయ్యే అరుదైన మూలకాలు మానవ అభివృద్ధికి దోహదం చేయాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు.శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఫిజిక్స్ విభాగం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ సదస్సును చేపట్టాయి. సైన్స్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అంశంపై మూడు రోజులపాటు ఈ అంతర్జాతీయ సదస్సు కొనసాగనుంది.ఇందుకు సంబంధించిన ప్రారంభ సభ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు.సుమారు 200 మంది దేశ,విదేశీ శాస్త్రవేత్తలు,యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పరిశోధకులు హాజరయ్యారు.పద్మావతి మహిళా యూనిర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ మాట్లాడుతూ.. భూమి లోపలి అరుదైన మూలకాలను వెలికి తీసే క్రమంలో వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా చూడాలని కోరారు. సేకరించిన అరుదైన మూలకాలను దేశ ప్రగతికి ఉపయోగపడేలా మార్చవలసిన బాధ్యత ఈ తరం శాస్త్రవేత్తలపై ఉందని గుర్తు చేశారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ అంతర్జాతీయ సదస్సుకు పద్మావతి యూనివర్సిటీ వేదిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు.ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూకంప్యూటర్స్, కమ్యూనికేషన్ వ్యవస్థ,లేజర్ సిస్టం లో అరుదైన మూలకాల పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో రేర్ ఎర్త్స్ బాగా తోడ్పడుతాయని అభిప్రాయపడ్డారు.శాస్త్ర చికిత్సలు చేయడంలోనూ రేర్ ఎర్త్ కిరణాలు ఉపకరిస్తాయని అన్నారు.థాయిలాండ్ కు చెందిన నిఖోన్ పాథమ్ రాజ్ భట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాక్రపాంగ్ కియోఖో మాట్లాడుతూ యూరోపియం,నవేరియం,డెస్ప్రోజియం, నియోడియం,ఎటర్బియం వంటి అరుదైన మూలకాలు సమాజాభివృద్ధికి బాగా ఉపయోగపడే అవకాశం ఉందని అన్నారు. ఇండోనేషియా కు చెందిన బంధుంగ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ మిత్ర డి జమల్ మాట్లాడుతూ.. గడలోనియం తులియం హోల్మియం వంటి మూలకాలు అనేక రకాలుగా ఉపయోగపడతాయని చెప్పారు.

ప్రత్యేకించి రేర్ ఎర్త్స్ సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడంలో దోహదం చేస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో రేర్ ఎర్త్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా కార్యదర్శి డాక్టర్ ఎం ఎల్ పి రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్,అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ బి దేవప్రసాదరాజు, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్ . జాన్ స ు షా్మ , ఎ ల ు వ ు ం ు అధ్యాపకులు,పరిశోధకులు,వివిధ ప్రాంతాల ప్రతినిధులు,విద్యార్థులు పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# హుండీ లెక్కింపుల్లో రూ.3కోట్లు ఆదాయం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు సోమవారం లెక్కించగా రు.3,02,92,986ల నగదు, 440 గ్రాముల బంగారం, 5కెజిల 225 గ్రాముల వెండి లభించినట్లు ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. పద్దెనిమిది రోజులకు గాను హుండీల్లో భక్తులు ఈ కానుకలు సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్వచ్ఛంధ సేవకులు, దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది, వన్టౌన్పోలీసులు, ఎస్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు. - నిత్యాన్నదానానికి విరాళం:దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్ష 4వేల 893ల ను కృష్ణాజిల్లా కేసరపల్లికు చెందిన బి నీలిమ సోమవారం ఆలయాధికారులకు అందించారు. దాతకు, వారి కుటుంబీలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

- స్వర్ణశిఖరం పనులకు విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో జరిగే స్వర్ణశిఖరం పనలుకు రు.1లక్ష విరాళాన్ని సోమవారం విజయవాడకు చెందిన అట్లూరి రామమోహన్ ఆలయాధికారులకు అందించారు. దాతకు, వారి కుటుంబీలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# రాయలసీమ ఉద్యమానికి సోషల్ మీడియా వేదికగా స్పందించాలి

## - రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి

**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో** పాలకులను ఎప్పటికప్పుడు ప్రశ్నించకపోవడం వల్లే రాయలసీమ వెనుకబడిందని, కరువు పరిస్థితులు వస్తున్నాయని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు నాగార్జున రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమ సమస్యలపై స్పందించాలని, రాయలసీమ ఉద్యమానికి సోషల్ మీడియా వేదికగా యువత, విద్యార్థులు స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలోని "ఫార్మసీ సెమినార్" హాల్లో సోమవారం "రాయలసీమ కరవునీటి సవాల్లు, పరిష్కార మార్గాల సాధ్యాసాధ్యాల" పై సదస్సు జరిగింది. విద్యార్థులతో నిర్వహించిన సదస్సుకు విశిష్ట అతిధిగా పాల్గొన్న రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి గారు మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంత కరవుపై అనునిత్యం మొసలికన్నీరు కార్చే రాయలసీమ ప్రాంత నాయకులు రాని వర్షాలు కురిపిస్తామని "మేఘమథనం" చేయడం, నీళ్లే లేని సీమలో రెయిన్ కన్నులతోను, ట్యాంకర్లతోను రాయలసీమ ప్రాంత రైతుల పంటలకు నీళ్ల అందించి పంటలు పండిస్తామని పనికిమాలిన పథకాలను మన పాలకులు సీమలో ప్రయోగం చేయడాన్ని కూడా మన రాయలసీమ ప్రాంత ప్రజలుగా మనము ఏ రోజు ప్రశ్నించడం లేదు అన్నారు. అలా రాయలసీమ ప్రాంత ప్రజలు ప్రశ్నించడం లేదు కాబట్టి మన రాయలసీమ ప్రాంతానికి తీరని ద్రోహాలు నేటికి చేస్తూనే ఉన్నారు అని ఆందోళన చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మన ముఖ్యమంత్రులు సిద్దేశ్వరం దగ్గర క్రిష్ణనదిపై కేంద్రం నిర్మిస్తున్న నేషనల్ హైవే లో బాగంగా తీగెల వంతెన నిర్మాణం బదులుగా బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ నిర్మించాలని ఈ రోజుకు కోరక పోగా కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర నిర్మాణాన్ని మన పాలకులు ఆపలేక పోవడంతో రాయలసీమ పశ్చిమ ప్రాంతానికి జీవనాధారమైన హెచ్ ఎల్ సి,ఎల్ ఎల్ సి ఆయకట్టు పూర్తిగా ఎడారి కాబోతోంది అన్నారు .ఇప్పుడు కూటమి ప్రభుత్వం 53వేల ఎకరాల అమరావతి రాజధాని ప్రాంతంలో మరో 44వేల ఎకరాలకు విస్తరింప చేసి మరోసారి నిర్బంధ అభివృద్ధి కేంద్రీకరణ కోసం రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తీవ్రమైన అన్యాయము చేస్తున్నారు అన్నారు. గోదావరిబనకచర్ల అనుసంధానం చేస్తామ్ రాయలసీమ శశ్యసామలం చేస్తామని చెప్పే ఈ ప్రభుత్వం కేంద్రంలో కీలకమైన భాగస్వామ్యం ఉన్నప్పుడు రాయలసీమ ప్రాంతంలో ఉన్న తుంగభద్ర కృష్ణా నదులపైనే ప్రాజెక్టులను చంద్రబాబు నాయుడు నిర్మించవచ్చు కదా ఆయన నిలదీశారు. ఈ రోజు విద్యార్థుల శక్తి మేల్కొనకపోతే మన రాయలసీమ ప్రాంతంలో ఉన్న రైతాంగం సర్వనాశము అవుతుంది,, సోషియల్ మీడియా పవర్ ను రాయలసీమ ఉద్యమానికి ఉపయోగించాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే ఈ మద్య కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని ఈ ప్రభుత్వ అధికారులు కూల్చి వేసినప్పుడు నేను వెంటనే సోషియల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఎంత భూములలో కాశినాయన జ్యోతి ఆశ్రమం ఉందో అంత అటవీశాఖ భూమికి బదులుగా నా స్వంత భూమిని ఇవ్వడానికి సిద్దం అని నేను పెట్టిన పోస్టు ఏకంగా 698మంది షేర్ చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చాలామంది నాకు ఫోన్లు చేసి ఏ రాజకీయ నాయకుడు కూడా మీ మాదిరిగా స్పందించలేదు కాబట్టి మీ వెనుక మేము కూడా ఉన్నాం అంటూ విపరీతంగా వైరల్ చేయడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి కాశినాయన జ్యోతి ఆశ్రమాన్ని పునర్నిర్మాణం చేయడం జరుగుతోందని ఆయన విద్యార్థులకు వివరించారు.





సదస్సులో మాట్లాడుతున్న నాగార్జున రెడ్డి

# గ్రామీణ యువతకు సీడాప్ ఆధ్వర్యంలో శిక్షణ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున సీడాప్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించటంతోపాటు,వారికి వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ చైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి తెలిపారు.మీడియాకు విడుదల చేసిన సమాచార ప్రతంలో సోమవారం తెలియజేశారు.. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా శిక్షణను అందిస్తున్నామన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణా కాలంలో వారికి ఉచితంగా భోజనంతోపాటు వసతి, యూనిఫామ్ మరియు కోర్స్ మెటీరియల్ అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారని, అందులో భాగంగా సీడాప్ కూడా తనవంతు పాత్రిని నిర్వహిస్తుందన్నారు. ఒక వైపు డీఎస్సీ ద్వారా వేల ఉద్యోగాలు ఇంకోపక్క సీడాప్ ద్వారా నైపుణ్య శిక్షణ పొందిన తరువాత లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు.

ఇందుకోసం చాలా కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. శిక్షణ అనంతరం ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలు ఏర్పడుతుందన్నారు.

ఈ అవకాశాలను రాష్ట్రంలోని యువత అందిపుచ్చుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరుచున్నామని తెలియజేశారు. కోర్స్ మరియు శిక్షణా కేంద్రాల వివరాలకు ఈ క్రింది లింక్ ను క్లిక్ చేయగలరు.. మరిన్ని వివరాలకు 0866 2571125, 80088 79191 సంప్రదించాలని కోరారు.



సిడాప్ చైర్మన్ గుణపాటి దీపక్‌రెడ్డి

# టిడిపి నేత కెఎం.జకీవుల్లా అంత్యక్రియలకు తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు

**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం టిడిపి నేత మాజీ రాజ్య సభ సభ్యుడు కెఎం.సైఫుల్లా కుమారుడు కెఎం.జకీవుల్లా అంత్యక్రియలకు పెద్ద ఎత్తున టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి నివాళులు అర్పించారు. రామ్‌నగర్‌లోని మాజీ ఎంపి సైఫుల్లా నివాసానికి టిడిపితోపాటు వైసిపి నాయకులు కూడా తరలివచ్చి కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. రాష్ట్ర మంత్రి సవిత హిందూపురం ఎంపి బికె.పార్థసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, జెసి ప్రభాకర్‌రెడ్డి, పల్లె సింధూర రెడ్డి, దగ్గుపాటి ప్రసాద్, రాష్ట్ర ముతవల్లి అసోషియేషన్ అధ్యక్షులు కెఎం.షకీల్ షఫి, ఆయన తండ్రి కెఎం.షఫీవుల్లా తదితర బంధువులు కూడా కెఎం.జకీవుల్లా మృతదేహానికి నివాళులు అర్పించారు. టౌన్ బ్యాంక్ అధ్యక్షులు జెఎల్.మురళీధర్, టిడిపి నేతలు గద్దం సుబ్రహ్మణ్యం, జయరామ్ నాయుడు, ఆలం నరసనాయుడు, రాయల్ మురళీ, సరిపూటి రమణ, బుగ్గయ్యచౌదరి, ఆదినారాయణ, తదితర టిడిపి నాయకులు కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ రాజ్య సభ స బ్యు డ్ు కె.ఎం.సైఫుల్లాను కూడా ఓదార్చి ధైర్యం చెప్పాడు. అదే విధంగా వైఎస్ఆర్‌సిపికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.విశ్వేశ్వర్‌రెడ్డి తదితర నాయకులు కూడా మాజీ ఎ ంపి సైఫుల్లా ఇంటికి వెళ్లి కె.ఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఇదే సమయంలో మాజీ ఎంపి కె.ఎం.సైఫుల్లా ఇంటి వద్దకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చారు. కెఎం.జకీవుల్లా మృతదేహానికి టిడిపి నేతలు ప్రత్యేకంగా టిడిపి జెండాను కప్పి నివాళులు అర్పించారు. కెఎం.జకీవుల్లా ఇంటి వద్ద నుంచి కలెక్టర్ ఆఫీస్ సమీపంలోని ముస్లింల స్మశాన యాత్ర వరకు అంతిమ యాత్రను నిర్వహించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ తదితరులు పాడె మోయడం విశేషం. ముస్లిం సాంప్రదాయ పద్దతుల్లో ముస్లిం స్మశాన వాటికలో జరిగిన టిడిపి నాయకుడు కె.ఎం.జకీవుల్లా అంత్యక్రియలకు భారీగా నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నేతలు మాట్లాడుతూ.. కెఎం.జకీవుల్లా అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరం, పార్టీ కోసం జకీవుల్లా కుటుంబం ఎంతో చేసింది. గత ఎన్నికల్లో జకీవుల్లా అనంతపురం అర్బన్‌లో తిరిగి సీఎంగా చంద్రబాబును చూడాలని సైనికునిగా పని చేసినట్లు వారు తెలిపారు. కర్నూలు జిల్లా డోన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉంటూ టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారన్నారు. కెఎం.జకీవుల్లా పార్టీకి చేసిన సేవలను గుర్తు పెట్టుకుంటామని చెబుతూ కెఎం.జకీవుల్లా కుటుంబ సభ్యులను నేతలు ఓదార్చారు.



కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాలులు అర్పిస్తున్న మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు

# శ్రీకూర్మం క్షేత్రంలో నక్షత్ర తాబేళ్ల మృత్యువాత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి** ప్రపంచంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విష్ణు అవతారాల్లో రెండవది అయిన కూర్మావతారంతో వెలసిన ఏకైక దేవాలయం. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రెండు ధ్వజస్తంభాలతో శ్రీచక్ర యంత్రం స్థాపనతో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలో తాబేళ్ల మృత్యువాత సంచలనం రేకెత్తించింది. కూర్మావతారానికి ప్రతీకగా నిలిచిన నక్షత్ర తాబేళ్లను ఆలయం ఆవరణలో సంరక్షిస్తున్నారు. గ్రీన్ మెర్సీ అనే సంస్థ ఈ తాబేళ్లను సంరక్షిస్తుంది. ఆదివారం ఈఓ కార్యాలయం వెనుక సుమారు 15 వరకు మృతి చెందిన తాబేళ్లను దహనం చేసి పుష్కరిణిలో నిమజ్జనానికి పాల్పడుతున్న సంఘటనను గమనించిన స్థానికులు ఆందోళన చెందడంతో ఒక్కసారిగా వెలుగు చూసింది. విశ్వహిందు పరిషత్ సభ్యులు, భక్తులు సోమవారం ఆలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఈఓ కార్యాలయం వెనుక గల సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 212 తాబేళ్లు లెక్కల ప్రకారం ఉండాలని ప్రస్తుతం అన్నే ఉన్నాయని ఎమ్మెల్యే తెల్పడం విశేషం. దహనం చేసిన తాబేళ్ల అవశేషాలను పశుసంవర్ధకశాఖ అధికారులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఫారెస్ట్ అధికారులు అక్కడకు చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న తాబేళ్లకు వ్యాధులు ఉన్నది లేనిది పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బారువలో శనివారం బీచ్ ఫెస్టివల్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టారు. తాబేళ్ల గురించి చెప్పి 24 గంటలు గడవక ముందే మహావిష్ణువు అవతారమైన తాబేళ్లమృత్యువాత పడడం భక్తుల మనసు కలచి వేసింది.

# క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విచారం

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సంతాపాన్ని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. పోప్ ఫ్రాన్సిస్ క్యాథలిక్ చర్చికి అధినేతగా విశేషమైన సేవలు అందించారని జగన్ కొనియాడారు. ఆయన హయాంలో చర్చి వ్యవస్థలో పరివర్తనాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రీస్తు విశ్వాసులపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. లాటిన్ అమెరికా ప్రాంతం నుంచి ఈ అత్యున్నత పదవికి ఎన్నికైన తొలి వ్యక్తిగా పోప్ ఫ్రాన్సిస్ చరిత్ర సృష్టించారని జగన్ కీర్తించారు. పోప్ ఫ్రాన్సిస్ కేవలం మత పెద్దగానే కాకుండా, ఒక నిజమైన మానవతావాదిగా నిలిచారని వైఎస్ జగన్ అభివర్ణించారు. ప్రపంచ శాంతి కోసం... పేదలు, అణగారిన వర్గాల పట్ల కరుణ చూపడంలో ఆయన ఎల్లప్పుడూ ముందున్నారని కొనియాడారు. ఆయన వినయం, మానవత్వం ప్రపంచాన్ని ఎంతగానో స్పృశించాయని పేర్కొన్నారు. శాంతి, కరుణ కోసం ఆయన గొంతుక ప్రపంచవ్యాప్తంగా వినిపించిందని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని తాను ప్రార్థిస్తున్నట్లు వైఎస్ జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచానికి, ముఖ్యంగా క్యాథలిక్ సమాజానికి ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు.


# ముగిసిన చంద్రబాబు యూరప్ పర్యటన, నేడు ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులతో బేటీ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** యూరప్ వ్యక్తిగత పర్యటనపై వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం స్వదేశానికి తిరిగి రానున్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలోను,లేదా బుధవారం తొలిగంట తరువాత సీఎం చంద్రబాబు ఢిల్లీ చేరుకోనున్నట్లు తెలుస్తోంది.తన 75వ పుట్టిన రోజు సందర్భంగా సీఎం నారా చంద్రబాబునాయుడు కుటుంబ సభ్యులతో కలిసి యూరప్ దేశాల పర్యటనకు వెళ్ళారు. మంగళవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసే అవకాశం ఉందని ఆ తర్వాత సీఎం షెడ్యూల్ ఖరారు కావల్సి ఉంది. కేంద్రమంత్రులను కలవనున్న సీఎం: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు, జలవనరుల శాఖ మంత్రి, న్యాయ శాఖ మంత్రితో సీఎం భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు, ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్నందున, సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన కీలకం కానుంది. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తి, పోలవరం బనకచర్ల అనుసంధాన

ప్రాజెక్టుపైనా ఢిల్లీలో మంతనాలు జరపనున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 17వ తేదీన విదేశాలకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇవాళ అర్ధరాత్రి ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు.

అక్కడి నుంచి ఢిల్లీలో ముఖ్యమంత్రి అధికారిక నివాసం అయిన 1 జన్ పథ్ కు వెళ్లి అక్కడే బస చేయనున్నారు.

# యూపీ సీఎంకు ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహూకరించిన మంత్రి సత్య కుమార్ యాదవ్



**అనంతపురం,ఏప్రిల్ 22 , (ప్రభాతవార్త బ్యూరో)** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రసిద్ధిగాంచిన ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహుకరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మంత్రివర్యులు సోమవారం యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన ధర్మవరం పట్టు వస్త్రాన్ని, నిమ్మలకుంట కళాకారులు రూపొందించిన శ్రీ కృష్ణుని తొలుబొమ్మను ఆయనకు బహూకరించి, ధర్మవరం పట్టు గురించి, నిమ్మలకుంట తోలుబొమ్మల విశిష్టత గురించి ఆయనకు వివరించారు. యోగి ఆదిత్యనాథ్ గారు సత్యకుమార్ ని సాదరంగా ఆహ్వానించి మథుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాల గురించి చర్చించారు. తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవాలని, అలాగే ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని మంత్రి సత్యకుమార్ ప్రత్యేకంగా సీఎం యోగి ఆదిత్యనాథ్ ని కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

# సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలి

## సిఐ పి వెంకటేశ్వర్లు

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** సైబర్ నేరాలపట్ల ప్రతిఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలని, మోసగాళ్ళు రకరకాల ప్రలోభాలు, మార్గాల్లో ఖాతాల్లోని నగదును అపహరించే విధానాలపట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని పోలీసులు సూచించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో పోలీసు అధికారులు, బ్యాంకర్లు పలుసూచనలిచ్చారు. విజయవాడ సిటి కమిషనర్ ఉత్తర్వులతో నందిగామ ఏసిపి ఆదేశాలతో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని 15 బ్యాంకుల అధికారులతో కలిసి సిఐ పి వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ బి రాజు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ మీడియా సమావేశంలో అవగాహన కలిగించారు. సైబర్ నేరాలు ఎక్కువగా బ్యాం కుల ఖాతాల ద్వారా జరుగుతున్నాయన్నారు.

# మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల కుటుంబం ఆత్మ హత్యాయత్నం..

**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 21 ప్రభాతవార్త** పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మండపేట స్వీట్ స్టాల్ అధినేత కనకాల సుబ్రహ్మణ్యేశ్వర రావు కుటుంబం సోమవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు ఈ సంఘటన పట్నంలో తీవ్ర కలకలం రేపింది. కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావ్ భార్య కనకాల మహాలక్ష్మి ౖ ప్రస్తుతం పెద్దాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా వ్యవహరిస్తుండడం, పట్నంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలమైన నేపథ్యం కలిగిన కనకాల కుటుంబం ఆత్మహత్యకు ప్రయత్నించడం తీవ్ర సంచలనంగా మారింది. గత కొంతకాలంగా తమ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద తీసుకున్న రూ 50 లక్షల రుణ భారం అధికం కావడం, వడ్డీలు కట్టమని సదరు వ్యక్తులు వేధిస్తుండడం తట్టుకోలేక తీవ్ర మనస్థాపనతో కనకాల కుటుంబం సోమవారం ఉదయం నిద్ర మాత్రల మింగి సామూహిక ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. తండ్రి సుబ్రమణ్యం, భార్య మహాలక్ష్మి ౖ, కుమారుడు గోవింద ముగ్గురు సూసైడ్ నోట్ రాసి పురుల మందు సేవించిన ఘటన బయటకి తొక్కడంతో చుట్టుపక్కల వారు హుటాహుటిన వారిని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు పలువురు టిడిపి వైసిపి శ్రేణులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని ప్రత్యేక వాహనంలో కాకినాడ తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య స్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కనకాల సుబ్రహ్మణ్యేశ్వర రావు గతంలో మున్సిపల్ కౌన్సిలర్ గా వ్యవహరించారు. ప్రస్తుతం అతన్ని సతీమణి కనక మహాలక్ష్మి ౖ మున్సిపల్ వైస్ చైర్మన్గా వ్యవహరిస్తున్నారు. వైసిపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల వైసిపికి పార్టీకి సభ్యత్వాలకు రాజీనామాలు చేశారు. నాటినుండి రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. వీరి కుటుంబం ఆత్మహత్యయత్నానికి పాల్పడం చర్చనీయాంశంగా మారింది.

## సీఎం చంద్రబాబునాయుడ్ని దూషించిన వైసిపి నేత అరెస్టు


**చేజర్ల (నెల్లూరు), ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు కూటమి నేతలను అసభ్యంగా దూషించిన చేజర్ల మండలం పాతపాడు గ్రామానికి చెందిన కాకుమూరి రాజీవ్‌రెడ్డిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.సిఎం చంద్రబాబుతోపాటు మరి కొందరు టిడిపి నేతలను తిడుతు వీడియో పోస్టు చేయడంతోపాటు వాట్సప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు.నన్నుఎవ్వరు ఏమి చెయ్యలేరు. ఏమి పీకలేరు అంటు దురుసుగా మాట్లాడాడు.ఈ వీడియో బాగా వైరల్ అయింది.దీంతో కొందరు చేజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం.

# కొనుగోలు కేంద్రాలు తెరిచారు.. రైతన్న ఇబ్బందులు మరిచారు

## ధాన్యం ఏ మిల్లుకు కేటాయించాలో రాని స్పష్టత

## రైతులపై హమాలీ భారం

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం7337 కొనుగోలు కేంద్రాలను కేంద్రాలను ప్రారంభించామని పౌరసఫరాలశాఖ, కార్పొరేషన్ గణాంకాలు వండివార్చుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ధాన్యం సేకరణ రైతుకు శాపంగా మారింది. తేమకొలిచే యంత్రాలు మొరాయించడం, ప్రభుత్వ గోదాముల్లో భద్రపరిచే ధాన్యం హమాలీచార్జీల భారం రైతుపై వేయడం,హమాలీల కొరత వంటి బాలారిష్టాలు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాచేలా చేస్తున్నాయి. తెలంగాణలో ఏప్రిల్ నెల ఆరంభం నుంచి నిత్యం ఈదురుగాలులు,అకాలవర్షాలు, వడగండ్ల వానలు కురిసి ఆరుగాలం కష్టపడి చేతికి వచ్చిన పంటను కళ్ళాల వద్ద వర్షార్పణం అవుతుండటంతో రైతులు కంట తడిపెడుతున్నారు. రబీసీజన్‌లో ఐకెపి,ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ఇతర ఏజెన్సీలతో కలిసి 8329 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరణ చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ఇందులో 91శాతం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా అందులో అనేక సమస్యలు ఉండటంతో తూకం వేయడంలేదు. అనేక కొనుగోలు కేంద్రాలలో పక్షం రోజులకు పైగా ధాన్యం విక్రయానికి తెచ్చి కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులు కాస్తున్నారు. ధాన్యంలో తేమ కొలిచే యంత్రాలు సరిగా పనిచేయకపోవడం కూడా ఇందుకు ఒక కారణంగా మారింది. అకాలవర్షాలు,వడగండ్ల కారణంగా రబీ సీజన్‌లో కూడా తేమను నిర్ధారించుకొని ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తున్నది. సగటు నాణ్యతా ప్రమాణాలు కలిగిన ధాన్యంకు 14శాతం తేమ ఉండాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువైతే కనీస మద్దతు ధరలో ఒక్కొక్క శాతానికి నిర్ధారించి పద్దతిలో ధరను తగ్గిస్తారు. తేమ యంత్రాలు సరిగా లేకపోవడంతో వేసవిలో కూడా ధాన్యంలో తేమ కొన్ని చోట్ల 29శాతం మించి చూపుతున్నాయి. మండే ఎండెలో అంత తేమ ఉండదని రైతులు చెబుతున్నా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు మళ్ళీ ధాన్యం ఆరబోసి ఎండిన తరువాత తీసుకొని రమ్మంటున్నారు. పనిచేయని యంత్రాలు ఎంత ఎండబోసినా తప్పుడు తేమనే చూపుతున్నాయి.కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం ఖండెబల్లూర్ కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమను ఒక్కో యంత్రం ఒక్కో విధంగా చూపుతుండటంతో రైతులు సహకార సంఘం కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట,గోపురపల్లి, కాల్వాశ్రీరాంపూర్ గంగారం, తారుపల్లిలో కూడా తేమకొలిచేయంత్రాలు, ధాన్యంలోని మట్టి,ఇతరాలను వేరు చేయడానికి ఉండాల్సిన జల్లెడలు, ఆరబోత మిషన్లు సరిగా లేకపోవడం దీనికి తోడు హమాలీలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.రైతులు దొడ్డు రకాన్ని ట్రేడరల్లకు విక్రయించి సన్నరకాలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని రైతులు భావించినప్పటికి కొనుగోలు కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో ఇక ఎంతకో కొంతకు అన్ని ప్రైవేట్‌కు విక్రయించు కొంటున్నారు. పక్షం రోజులుగా వర్షాలు పడుతుం డటంతో అకాల వర్షంలో ధాన్యం తడవకుండా కాపాడుతోకోవడానికి ఎక్కడ కూడా టార్పాలిన్లు రైతులకు అందుబాటులో లేవు. హమాలీలు కూడా కొనుగోలు కేంద్రాలలో కొరతగా ఉండటంతో తూకం వేయడంలో కూడా జాప్యం జరగడానికి కారణమైంది. బీహార్ ఉత్తర్ ప్రదేశ్ నుంచి కూలీలు రావడం ఆలస్యం అవుతుండటంతో మెదక్ జిల్లా చేగుంట, హావేలి ఘనపూర్, వెల్దుర్తి, దౌంతి, మక్కరాజ్‌పేటలో రహదారులు, కళ్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు కుప్పలు,తెప్పలుగా పేరుకొని పోయాయి. మెదక్ జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలోని 15 కొనుగోలు కేంద్రాలు, ఐకెపి ఆధ్వర్యంలోని ఐదుకొనుగోలు కేంద్రాలు మాత్రమే ధాన్యం సేకరణ చేస్తున్నాయి.మిగితా చోట్ల అనేక సమస్యలు సేకరణకు అడ్డుగ నిలుస్తున్నాయి.కాంటా వేసిన ధాన్యం బస్తాలను ఏ మిల్లుకు పంపాలో ప్రభుత్వం నిర్వహకులకు తెలపకపోవడంతో రైతుపై భారం పడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో సేకరణ చేసిన ధాన్యం బస్తాల దిగుమతి కేటాయించిన మిల్లు యజమానులు గతంలో భరించేవారు. ఇప్పుడు మిల్లులపై స్పష్టత రాకపోవడంతో రైతుపై భారం పడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో సేకరించి ధాన్యం ఏ మిల్లుకు కేటాయించాలో స్పష్టత లేకపోవడంతో గోదాముల్లో నిల్వచేసే ధాన్యం హమాలి కూలీ వ్యయం రైతుకు ఆర్థికభారంగా మారింది. మిల్లులకు కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా గతంలో దిగుమతి హమాలి వ్యయం మిల్లర్లు భరించేవారు. రైతుల నుంచి ఇప్పుడు కొన్ని చోట్ల రూ.8 నుంచి రూ.10 బస్తాకు వసూలు చేస్తున్నారని కొంత మంది రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల 40కిలోల బస్తాకు 5రూపాయలు హమాలీ చొప్పున రైతుపై భారం వేస్తున్నారు. క్వింటాల్‌కు 12.5రూపాయలు హమాలీ ఖర్చు రైతుపై పడుతోన్నది. తుంగతుర్తి మండల కేంద్రంలో ధాన్యం రాశులతో కొనుగోలు కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి పదిరోజులైనా అక్కడ కాంటా మొదలు కాలేదు. ఎఇఓ తేమ శాతం కొలిచి కాంటా వేసేందుకు జాప్యం జరుగుతోంది. సూర్యపేట జిల్లాలో సహకార సంఘాల ద్వారా కొనుగోళ్ళు మొదలయ్యాయి. కాంటా వేసిన బస్తాలు మిల్లులకు తరలించగా మిల్లర్లు సాకులు చూపుతూ బస్తాలు దింపుకోవడంలేదు. రైతులు మిల్లరు విధించే కోతలకు ఒప్పుకోవాల్సి వస్తున్నది. దీనికి తోడు ఒక్కో మిల్లుకు కేవలం వెయ్యి ,పదిహేను వందల క్వింటాళ్ళమేరకు ధాన్యం దిగుమతికి అనుమతి ఇవ్వగా వారి లక్ష్యం రెండురోజుల్లో కేటాయింపుల పరిమితి పూర్తికావడంతో మిల్లర్లు చేతులు ఎత్తేస్తున్నారు.



# చెన్నమనేని రమేష్ జర్మనీ పౌరుడే!

## హైకోర్టు తీర్పు.. పదేళ్ల క్రితం ఎమ్మెల్యే అయ్యేవాడిని : ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ భారత పౌరుడు కాదని, జర్మన్ పౌరుడని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. ఆయన పౌరసత్వంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేయగా తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు సోమవారం తీర్పును వెల్లడించింది. తప్పుడు పత్రాలతో 15 ఏళ్ల పాటు ప్రభుత్వ అధికారులు, న్యాయస్థానాలను చెన్నమనేని రమేశ్ తప్పుదోవ పట్టించారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నమనేని పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం సమర్థించింది.అలాగే ఆయనను రూ.30 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఇందులో పిటిషనర్ ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి రూ.5 లక్షలు చెల్లించాలని తెలిపింది. న్యాయస్థానం తీర్పుపై అప్పీల్ చేయకుండా తన తప్పును ఒప్పుకుని చెన్నమనేని రమేశ్ రూ. 30 లక్షల ఫైన్ చెల్లించారు. చెన్నమనేని రమేష్ తప్పుడు పత్రాలు సృష్టించి ఎన్నికల్లో పోటీ చేయకుంటే పదేళ్ల క్రితం ఎమ్మెల్యే అయ్యేవాడినని అంటూ వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ తీర్పుపై వ్యాఖ్యానించారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన రమేష్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆది డిమాండ్ చేశారు. చెన్నమనేని భారతీయుడు కాదని నేను మొదటి నుంచి చెబుతూనే ఉన్నాను పదిహేనేళ్ళ సుదీర్ఘ పోరాటంలో న్యాయం గెలిచిందని అన్నారు. కోర్టులపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

# పని చేస్తేనే గుర్తింపు

## ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** గుర్తింపు కోసం మనం ఎవరి వెంట పడాల్సిన అవసరం లేదని మనం చేసే పనిని సక్రమంగా చేస్తే గుర్తింపు దానికదే వస్తుందని,ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ కమలాహసన్ రెడ్డి అన్నారు.సోమవారం అబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో 50 మంది సిబ్బందికి డైరక్టర్ చేతుల మీదుగా క్యాష్ రివార్డులను అందచేశారు. ప్రధానంగా కేసుల డిటెక్షన్, నిందితులను రికవరీ చేసిన సొమ్మును డిస్పోజల్ చేయడం, నిందితులకు కన్విక్షన్ పడే విధంగా చార్జీ షీట్‌ను దాఖలు చేయడం, మంచి కేసులను పట్టుకోవడం,ఇతర రాష్టాల్లో కేసుల్లో ఉన్న నిందితులను పట్టుకోవడం చేసినప్పుడే ప్రతి ఒక్కరికి మంచి పేరు వస్తుందన్నారు.ఎక్సైజ్‌శాఖలో ప్రతిభ కనదరిచిన వారికి చేయూత అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వంతో పలుమార్లు మాట్లాడి క్యాష్ రివార్డులకు కావాల్సిన నిధులను తీసుకవచ్చామన్నారు. మరింతగా మరింతగా శ్రమించి మంచి కేసులను పట్టుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. సంగారెడ్డిలో వరుసగా నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టడం, సంగీతా సాహు లాంటి గంజాయి డాన్‌తోపాటు ఒరిస్సా నిందితలను పట్టుకొని అరెస్టు చేయడం బాగుందన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, మెదక్ అసిస్టెంట్ కమిషనర్ జి. శ్రీనివాసరెడ్డి,టీం లీడర్లు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్‌లు పాల్గొన్నారు.

# వజ్రోత్సవాలకు పాలపర్రు ఎస్. ఎన్. ఎచ్ స్కూల్ సిద్ధం !

**ప్రత్తిపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని పెదనందిపాడు మండలం పాలపర్రు గ్రామంలో 1950 సంవత్సరములో ప్రారంభించిన కీర్తిశేషులు ముద్దన చెంచయ్య గారి ఆధ్వర్యంలో ఏర్పాటైన శ్రీ నారసింహ ఉన్నత పాఠశాల మే 10 వ తారీఖున వజ్రోత్సవాలకు సిద్ధం కానుంది. ఈ కార్యక్రమానికి ముందుగా ఈ పాఠశాలలో చదువుకున్న




అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు అనేక ప్రాంతాల్లో చదువుకున్నటువంటి వారు ఉద్యోగాలు చేసే వారు వృత్తి వ్యాపార ఉద్యోగాలతో ఆయా ప్రాంతాల్లో ఉన్నట్టు వంటి పూర్వపు విద్యార్థులు అందరూ మే 10న జరుగుతున్న పూర్వపు




విద్యార్థుల వజ్రోత్సవ వేడుకలకు ముందుగా అనేకమందిని విద్యార్థులను సమీకరణ నిమిత్తం బహుబక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిన్నటి దినాన గుంటూరులోని కాటన్ కార్పొరేషన్ కార్యాలయము నందు వజ్రోత్సవాల లోగోను మాజీ మంత్రివర్యులు డాక్టర్ మాకినేని ఫెదరత్తయ్య గారి ద్వారా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులైన ఆయా రంగాల్లో నిష్ణాతులై మేధావులైన ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎసిబికి పట్టుబడిన మణుగూరు సిఐ

## సహకరించిన ఛానల్ రిపోర్టర్‌పై కూడా కేసు నమోదు

## లక్ష నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు

**మణుగూరు, ప్రభాతవార్త, ఏప్రిల్ 21 :** ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడిలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్‌తో పాటు ఓ ఛానల్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపీ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. ఈ మేరకు సోమవారం మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని గుట్టమల్లారం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 49, 33లలో పలువురు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా భూవ్యాపారం నిర్వహించినందున సదరు వ్యక్తులపై ల్యాండ్‌గ్రాబింగ్ కేసు నమోదుచేయవలసిందిగా ఇటీవల మణుగూరు తహశీల్దార్ ఎస్‌హెచ్‌వో మణుగూరుకు ఓ వ్రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు.ఈ కేసుకు సంబంధించి వివాదాస్పద ప్రభుత్వ భూమిని అమ్మిన వ్యక్తుల పేర్లు బహిర్గతమవడంతో వారిపై కేసు నమోదు కాకుండా చూసేందుకు జరిగిన తంతులో భాగంగా ఈ అవినీతి నిరోధకచట్టం అధికారులు పక్కా సమాచారంతో మణుగూరు పోలీస్‌స్టేషన్‌పై దాడులు నిర్వహించారు. మణుగూరు తహశీల్దార్ ఇచ్చిన ఫిర్యాదును ఆసరగా చేసుకొని ప్రభుత్వ భూమిని అమ్మి సొమ్ముచేసుకున్న వ్యక్తులపై కేసులు నమోదుచేయకపోగా అందుకు పరిహారంగా లంచం ఇవ్వాలంటూ మణుగూరు సీఐ సతీష్‌కుమార్ డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆర్థిక లావాదేవాల నిర్వహణ కోసం గోపీ అనే వ్యక్తిని సతీష్‌కుమార్ మధ్యవర్తిగా వాడుకున్నారని ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా బేతం చర్ల వెంకటేశ్వర్లు, కూరాకుల శ్రీనివాసరావు అనే వ్యక్తులను రూ.4లక్షలు సీఐ డిమాండ్ చేసినట్లుగా తమకు స్పష్టమైన సమాచారం ఉందని తెలిపారు. రూ.3లక్షలు తాను చెల్లించవలసిన బాకీకి బదలాయింపు చేయాలని, రూ.1లక్ష నగదు ఇవ్వాలని సీఐ కోరిన మేరకు మధ్యవర్తి గోపీకి సోమవారం నగదు అందజేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా దాడిచేసి గోపీని అదుపులోకి తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. గోపీ ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా మణుగూరు సీఐ సతీష్‌కుమార్‌ను స్టేషన్‌లో విచారించిన మీదట ఇరువురిపై భారత న్యాయసంహిత చట్టంలోని 318(4), 329(3) సెక్షన్లతో పాటు తెలంగాణ స్టేట్ గేమింగ్‌యాక్ట్ సెక్షన్ 5 వీరిపై వినియోగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# వేములవాడ అభివృద్ధికి నిధులు తెస్తా

## కరీంనగర్ అభివృద్ధి కోసం పట్టుదలతో పనిచేస్తున్నా

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు సన్మానం చేసిన దృశ్యం

**వేములవాడ, ప్రభాతవార్త :** వేములవాడ ఆలయ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, ఈ ఏడాది ఖచ్చితంగా కేంద్రం నుంచి నిధులు తీసుకొని అభివృద్ధి చేస్తానని, ఈ విషయంలో మొండి పట్టుదలతో ఉన్నానని, అంతేగాకుండా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో ప్రతి గ్రామానికి రూ.5లక్షల చొప్పున ఉపాధి హామీలిచ్చామని, సిఎస్‌ఆర్ ఫండ్స్ కింద వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన కొందరు కావాలని తాను నయా పైసా కూడా తేలేదని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. వాటిని జనం నమ్మే పరి స్థితి లేదని, జిల్లాకు నవోదయ స్కూల్ మంజూరు చేయించిన, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నాని, ఏ ఉద్యమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేయక పోయిన కాంగ్రెస్‌కు అధికారం లభించడంతో ప్రజలను పట్టించుకోవడం లేదని, గత 17 నెలలుగా కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయక పోవడంతో ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, సీనియర్ న్యాయకులు రేగుల మల్లికార్జున్, దళిత మోర్చ నాయకులు, కార్యకర్తలున్నారు.

# సెర్ప్‌లో సాధారణ బదలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** సెర్ప్‌లో 10 గత పది సంవత్సరాల నుంచి పని చేస్తున్న ఉద్యోగుల బదిలీకి రంగం సిద్దమైంది. ఈ మేరకు పంచాయితీ రాజ్‌శాఖ వంత్రి సీతక్క ఆదేశాల మేరకు 3974 మంది సాధారణ ఉద్యోగులను బదిలీ చేస్తూ అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.గత పది సంవత్సరాలుగా బదిలీలు లేక పోవడంతో తమను బదిలీ చేయాలని సెర్ప్ ఉద్యోగులు అనేకమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను జారీ చేసింది. అనేక మంది సిబ్బంది సంవత్సరాలుగా ఒకే చోట ఉండిపోడంతో సంబంధిత పనుల్లో వేగం తగ్గింది.దీన్ని దృష్టిలో పెట్టకున్న పనుల్లో స్పీడ్ పెంచడమే కాకుండా నాణ్యవంతమైన సేవలు పొందేందుకు వారిని బదిలీ చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సెర్ప్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా శక్తి పాలసీ, మహిళా సంఘాలకు స్వయం ఉపాధి నుంచి ఉపాధి కల్పిన, సంపద సృష్టి దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సెర్ప్‌లో ఒకే సారి పెద్ద సంఖ్యలో బదిలీల చేయడం ద్వారా సెర్ప్‌లో నూతన ఉత్సాం నింపినట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# టూరిజం హబ్‌గా నిర్మల్ జిల్లా

## ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** తెలంగాణను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. చారిత్రక కోటలు, జల పాతాలు, అభయారణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. బాసర నుంచి కవ్వాల్ వరకు టూరిజం కారిడార్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.దీని ద్వారా స్థానికంగా ఉండే ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణను పర్యాటకానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వతం కృషి చేస్తున్న సంగతి తెలిసిందే.

చార్మిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలతో పాటు కట్టిపడేసే ప్రకృతి అందాలను ఆస్వాధించేలా పర్యటక రంగానికి సరికొత్త సొబగులు అద్దేందుకు అధికారుల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇందులో భాగంగానే తెలంగాణలో ఆయా ప్రాంతాలను టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతూ పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తోంది.

ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లాకు కూడా రాష్ట్ర పర్యాటక పటంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించనున్నారు.చారిత్రక వైభవం ఉట్టిపడే కోటలు, బురుజులు,కనువిందు చేసే సహజ సిద్ధమైన జలపాతాలు, అద్భుతమైన వన్యప్రాణులతో కూడిన అభయారణ్యాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ కృషి చేస్తోందని అధికారులు చెబుతున్నారు. గత కొద్ది రోజులు క్రితం టూరిజం శాఖ కార్పోరేషన్ ఎండి పటేల్ రమేశ్ రెడ్డి స్వయంగా నిర్మల్‌లోని చారిత్రాత్మక బంగల్‌పేట చెరువు నడిబొడ్డున కొలువై ఉన్న బురుజును, శతాబ్దాల చరిత్రను తనలో నింపుకున్న శ్యామ్‌గడ్ కోటను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అర్జుమండ్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల చారిత్రక ప్రాధాన్యతను, అభివృద్ధికి ఉన్న అవకాశాలను ఆయన అధికారులతో చర్చించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన పటేల్ రమేశ్ రెడ్డి.. నిర్మల్ జిల్లా ఒక అద్భుతమైన చారిత్రక, సహజ సంపదలకు నిలయమని కొనియాడారు. శిథిలావస్థలో ఉన్న కోటలు, బురుజులకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

ముఖ్యంగా విద్యాక్షేత్రంలో ప్రసిద్ది గాంచిన బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం నుంచి ప్రకృతి అందాలకు నెలవైన కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ వరకు ఒక ప్రత్యేకమైన టూరిజం కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమవుతున్నాయన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి

## 29న రాష్ట్రవ్యాప్తంగా చలో కలెక్టరేట్ల ముట్టడి

## ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** విద్యార్థుల ఫీజులు చెల్లిందాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడికి జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు,రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో జరిగిన బిసి విద్యార్థుల కోర్ కమిటీ సమావేశానికి నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యమాన్ని తీవ్ర తరం చేయాలని నిర్ణయించారు. మూడేళ్లుగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి స్కాలర్‌షిప్‌లకు కూడా బిల్లులు ఇవ్వడం లేదన్నారు.గత నాలుగు నెలలుగా విద్యార్థులు రోడ్లమీద వచ్చి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పెట్టించుకోవడంలేదని,కాంట్రాక్టర్లకు వేలకోట్ల రూపాయలు బిల్లులు మాత్రం చెల్లిస్తున్నారన్నారు.ఒక కాంట్రాక్టుకు ఇచ్చే బిల్లులతో 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు చెల్లించవచ్చున్నారు.ఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉంది. కానీ విద్యార్థులు అంటే పట్టించుకోవడం లేదు.తన వైఖరి మార్చుకోకపోతే తీవ్రంగా తిరుగుబాటు జరుగుతుందని హెచ్చరించారు. గతంలో స్కాలర్ షిప్‌లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు నాలుగు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీ బంద్ చేస్తే విద్యార్థుల చదువు దెబ్బ తింటుందని కాలేజీ యాజమాన్యాలకు నచ్చజెప్పి పునఃప్రారంభం చేశామని చెప్పారు.ఫీజులు, స్కాలర్‌షిప్ చెల్లించకపోవడంతో మహాత్మా గాంధీ యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సటీ పరిధిలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ విద్యార్థులు పరీక్షలకు బహిష్కరించాలని ప్రస్తుతం నిర్ణయించుకున్నారని తెలిపారు. ఎంత ఆందోళన జరుగుతున్న ప్రభుత్వానికి బుద్ధి రావడంలేదని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో ప్రభుత్వం తెచ్చిన అప్పులు లక్ష40 వేల కోట్లు.వస్తున్న ఆదాయ ఎంత..అందులో కాంట్రాక్టర్లకు ఎంత చెల్లిందారు? ఇతర బిల్లులు ఎన్ని చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు ఇప్పటికైన ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు,ఫీజుల బకాయిలు 4వేల కోట్లు తక్షణమే చెల్లిందాలని డిమాండ్ చేశారు. . ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత కోర్సులలో సీట్లు వచ్చిన చదవలేక పోతున్నారు. అలాగే ఉద్యోగాలు వచ్చిన సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు కోల్పోతున్నారు.ఈ సమావేశంలో నీల వెంకటేష్, అంజి, రాందేవ్ మోదీ, గొరిగే మల్లేశ్, అనంతయ్య, రాజునేత, రాజేందర్, రవికుమార్ యాదవ్ తదితరులు మాట్లాడారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మత్తు బాధితుడు

# మత్తు కోసం మెడికల్ డ్రగ్స్ వినియోగం

## మైనర్ మృతి.. మరో ఇద్దరు ఆస్పత్రి పాలు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మత్తు రావడం కోసం మెడికల్ షాపులో విక్రయించే మత్తుకు సంబంధించి డ్రగ్స్ (టాబ్లెట్లు)తో పాటు ఇంజక్షన్‌లను అధిక మోతాదులో తీసుకున్న ముగ్గురిలో ఒకరు మృత్యువాత పడగా మరో ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. మత్తుకు బానిసై ప్రాణాలు కోల్పోయిన బాధితుడు మైనర్ కావడం గమనార్హం. ఆస్పత్రి పాలైన ఇద్దరిలో మరో మైనర్ బాలుడు, ఓ యువకుడు ఉన్నాడు. ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపు ఓనర్ మత్తును కలిగించే ఔషధాలను వారికి విక్రయించడం వల్లే ఈ అనర్థం జరగడం కలకలం రేపింది. హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ ఉదంతానికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. స్థానిక సులా _న్‌పూర్ టౌన్‌షిప్‌కు చెందిన మైనర్ బాలుడు, కొత్తపేట్‌కు చెందిన మరో మైనర్ బాలుడు, బాలాపూర్ రాయల్ కాలనీకి చెందిన షాబాజ్ (22)లు స్నేహితులు. మత్తుకు అలవాటు పడిన వీరు మెడికల్‌కు సంబంధించిన కొన్ని రకాల డ్రగ్స్ తీసు కుంటుంటారు. ఈ క్రమంలో మూడురోజుల క్రితం టాబ్లెట్లతోపాటు ఇం జెక్షన్‌లను కొనుగోలు చేసిన వారు నిర్మానుష్య ప్రదేశం వాటిని తీసుకొని అప స్మారక స్థితిలోకి వెళ్లారు. పరిస్థితి గమనించిన వారు ఆసుపత్రికి ముగ్గురిని తరలించారు. అయితే చికిత్స పొందుతూ మైనర్ బాలుడు ఉస్మానియా ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. మరో మైనర్ బాలుడు, యువకుడు పిసల్‌బండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. మృతి చెందిన బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాపూర్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలాపూర్ షాహిన్‌నగర్ ప్రాంతానికే చెందిన సాహిల్ అనే వ్యక్తి మెడికల్ డ్రగ్స్‌ను వారికి విక్రయించినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. ఈ ఉద ంతంపై బాలాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష

## ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా

## మూడు పైసలు తేలే : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**భద్రాచలం, ప్రభాతవార్త :** తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను ఉద్దేశించి కార్యకర్తలను స్వయంగా కలిసి పిలుపునిచ్చే కార్యక్రమంలో భాగంగా సోమవారం భద్రాచలం చేరుకున్నారు. ఉదయం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం హరిత హోటల్‌లో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కెసిఆర్‌కు, కార్యకర్తలకు మధ్య వారిధిగా ఉంటానని, కార్యకర్తల సమస్యలను కేసీఆర్ దృష్టికి నేను తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని, ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా మూడు పైసలు తేలేదని దుయ్యబట్టారు. ఆత్మీయ భరోసా కింద నిరుపేదలకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. అప్పులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విపరీతమైన అబద్దాలు చెబుతున్నారని, 2004లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిందని, 2004లోనే తెలంగాణ ఇచ్చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పదేళ్ల ప్రజలను ఏడిపించిందని, వందలాది మంది బిడ్డలను పొట్టన పెట్టుకొని తెలంగాణ ఇచ్చారు తప్పా ఉట్టిగా ఇవ్వలేదు పేర్కొన్నారు. లక్షా 60 వేల కోట్లుపైగా అప్పు తెచ్చిన సర్కారును ప్రశ్నిస్తే బుకాయిస్తున్నారని, తెచ్చిన రుణాన్ని ఏం చేశారని అడిగితే చెప్పబోమని చెబుతున్నారని అన్నారు. తెచ్చిన అప్పులను ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రస్తుత పాలకులు చూడడానికి తెలంగాణ వ్యక్తుల్లా ఉంటారు... కానీ పనిచేసేది తెలంగాణకు వ్యతిరేకంగా అని, కాంగ్రెస్ పార్టీ అనేక కల్లిబొల్లి మాటలు చెప్పిందని, లేనిపోని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్ గా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దని, సీతారామ ప్రాజెక్టును నిర్మించి 3.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు అందించారని గుర్తు చేశారు.

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు బీఆర్ఎస్ పార్టీ బీఫామ్‌పై నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని, భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తే గెలుపు బీఆర్ఎస్ పార్టీదేనని జోష్యం చెప్పారు. ఇలాంటి ద్రోహులను చాలా చూశామన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్ర, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తాత మధు, రేగా కాంతరావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, వైరా మాజీ ఎమ్మెల్యే చందనవతి, భద్రాచలం నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, బోదబోయిన బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

22-4pg10.qxd:22-4pg10.qxd 01/01/01 8:44 AM Page 1



# కోట్లతో కొన్నా రిజల్ట్ సున్నా


రిషబ్ పంత్


గ్లెన్ మాక్స్‌వెల్


వెంకటేష్ అయ్యర్


మార్కస్ స్టోయినిస్

## ఖరీదైన ఆటగాళ్లు ఫెయిల్యూర్ లిస్ట్‌లో రిషబ్, మాక్స్‌వెల్, వెంకటేష్, స్టొయినిస్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025, సీజను 18 రసతవత్తరంగా సాగుతోంది. రోజురోజుకూ అభిమానుల్లో ఉత్సాహం పెరుగుతూ వస్తోంది. ఈ సీజన్లో చాలా మంది ఆటగాళ్లు తమ ప్రదర్శనతో అభిమానుల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. కానీ మంచి ప్రదర్శన ఇస్తా రని భావించిన కొంత మంది ఆటగాళ్లు మాత్రం నిరాశ పరుస్తున్నారు. వీళ్లను భారీ మొత్తంలో డబ్బులు వెచ్చించికొన్నా వీరి ప్రదర్శన ఇప్పటివరకు పేలవంగా ఉంది. ఫ్రాంచైజీలు కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన ఇలాంటి ఆటగాళ్ల గురించి తెలుసు కుంటే ఈ సీజన్ రిషబ్ పంత్ చాలా దారుణంగా ఆడుతున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌ను రూ.27 కోట్లకు కొనుగోలు చేశారు. ఐపిఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా పంత్ రికార్డు సృష్టించాడు. కానీ 7 మ్యాచ్‌ల్లో కేవలం 17.17 సగటు, 100 స్ట్రైక్ రేట్‌తో 103 పరుగులు చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌పై 63 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అయినా ఆ మ్యాచ్‌ల్లోన జట్టు ఓడిపోయింది. ఆ తర్వాత దారణమైన ప్రద ర్శన సాగించాడు. పంత్ కెప్టెన్సీ కూడా ప్రశ్నా ర్థకంగా మారింది. ఇక గ్లెన్ మాక్స్‌వెల్ ఐపిఎల్లో స్టార్‌గా నిలిచేవాడు. అందుకే జట్లు అతన్ని తమ తోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాయి. పంజాబ్ కింగ్స్ జట్టు మాక్స్‌వెల్ రూ.4.2 కోట్లకు నిలుపు కుంది. కానీ ఇప్పటివరకుఆడిన 6మ్యాచ్‌ల్లో మాక్స్ వెల్ కేవలం 41రన్స్ మాత్రమే సాధించాడు. లాంగ్ ఫోర్లు, సిక్సర్లు కొట్టడంలో ప్రసిద్ధిచెందిన మాక్స్ వెల్ ఈ సీజన్లో కేవలం 4 ఫోర్లు, ఒక సిక్సర్ మాత్రమే కొట్టాడు. అలాగే కోల్‌కతా నైట్ రైడర్స్ వెంకటేష్ అయ్యర్‌ను రూ.23.75కోట్ల భారీ మొత్తా నికికొంది. కానీ అయ్యర్‌మాత్రం ఇప్పటి వరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో 24.5 సగటు, 155. 05 స్ట్రైక్ రేట్‌తో 121పరుగులు మాత్రమేచేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 29 బంతుల్లో 60పరుగులుచేసి అత్యుత్తమ ప్రదర్శన కనబరి చాడు. తర్వాత చతికలపడ్డాడు. మార్కస్ స్టోయి నిస్‌ను పంజాబ్‌కింగ్స్ రూ.11 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ సీజన్ 6మ్యాచ్‌లు ఆడిన స్టోయి నిస్ 66పరుగులు మాత్రమేచేశాడు. సన్‌రైజర్స్ హైదరా బాద్‌తో ఆడిన ఇన్నింగ్స్‌లో 11 బంతుల్లోనే 34 పరుగులు చేశాడు. ఇదే అత్యధిక స్కోరు. మరోవైపు బౌలింగ్‌లోనైతంఫలితంశూన్యం. ఇప్పటి వరకు ఆడిన 6మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్‌కూడా పడగొట్టలేదు.


కోనేరు హంపి


ద్రోణవల్లి హారిక


దివ్య దేశ్‌ముఖ్

## మహిళల గ్రాండ్‌ప్రిలో.. హంపి మూడో విజయం హారిక-దివ్య మధ్య డ్రా

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో భారత్ స్టార్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి మూడో విజయం నమోదు చేసింది. మంగోలియాకు చెందిన అంతర్జాతీయ మాస్టర్ బత్ఖుయాగ్ మున్‌గున్‌తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హంపి 33 ఎత్తుల్లో గెలుపొందింది. దీంతో హంపికిది మూడో విజయం కావడం విశేషం. మరో మూడు గేమ్‌లను డ్రా చేసుకన్న హంపి 4.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఇక భారత్‌కే చెందిన మరో స్టార్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక, ప్రపంచ జూనియర్ ఛాంపియన్ దివ్య దేశ్‌ముఖ్‌ల మధ్య జరిగిన ఆరో రౌండ్ గేమ్ డ్రాగా ముగిసింది. 27 ఎత్తులయ్యాక గేమ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ వైశాలి రెండో పరాజయాన్ని చవి చూసింది. చైనాకు చెందిన జు జినెర్‌తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో వైశాలి 41 ఎత్తుల్లో ఓడిపోయింది. కాగా జార్జియాకు చెందిన మేలియా సలోమితో జరిగిన మరో గేమ్‌లో రష్యాకు చెందిన పొలీనా షువలోవా 45 ఎత్తుల్లో గెలిచింది. బల్గేరియాకు చెందిన నుర్గుల్ సలీమోవా, పోలాండ్‌కు చెందిన అలీనా కష్లిన్‌స్కాయా మధ్య జరిగిన మరో గేమ్ 67 ఎత్తుల్లో డ్రా గా ముగిసింది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్ల పాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఆరో రౌండ్ తర్వాత జినెర్ 5 పాయింట్లతో అగ్రస్థానంలోను, 4 పాయింట్లతో దివ్య దేశ్‌ముఖ్ మూడో స్థానంలో, హారిక 3 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

## బిసిసిఐ కాంట్రాక్టు జాబితాలో.. టాప్ గ్రేడ్‌లో రోహిత్, విరాట్



**న్యూఢిల్లీ:** టీమిండియా క్రికెటర్ల వార్షిక కాంట్రాక్టు జాబితాను విడుదలైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు టాప్ కేటగిరీని రిటేన్ చేసుకున్నారు. 34 మందితో కూడిన కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితాను సోమ వారం బిసిసిఐ విడుదల చేసింది. శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషణ్ కూడా కాంట్రాక్టు జాబితాలో చోటు దక్కింది. ఎ+ గ్రేడ్ క్యాటగిరీలో మొత్తం నలుగురు క్రికెట్లు ఉన్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా ఆ లిస్టులో ఉన్నారు. ఎ+ గ్రేడ్ ఆటగాళ్లకు రిటేన్ ఫీజు 7 కోట్లు చెల్లించనున్నారు. ఇక ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలో హీరోగా నిలిచిన శ్రేయాస్ అయ్యర్ మళ్లీ కాంట్రాక్టు జాబితాలో చోటు సంపాదించాడు. అయితే అతనికి గ్రూపు బీలో స్థానం కల్పించారు. ఆ గ్రూపు ఆటగాళ్లకు మూడు కోట్ల రూపాయలు చెల్లించనున్నారు. గత ఏడాది అయ్యర్‌ను కాంట్రాక్టు లిస్టును తొలగించారు. ఐపిఎల్ కోసం స్వదేశీ క్రికెట్‌ను ఆడకపోవడం వల్ల గత ఏడాది అయ్యర్‌ను ఆ జాబితా నుంచి తప్పించారు. ముంబై బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా గత ఏడాది ఇదే సమస్యను ఎదుర్కొన్నాడు. అయితే ఈ సారి అతనికి గ్రూపు సి కేటగిరీలో చోటు కల్పించారు. గ్రూపు సి క్యాటగిరీలో ఆటగాళ్లు కాంట్రాక్టు కింద కోటి ఇవ్వనున్నారు. గత ఏడాది గ్రూపు ఏ లో ఉన్న రిషబ్ పంత్ ఈసారి గ్రూపు ఏ కేటగిరీలో చోటు దక్కించుకున్నాడు. రిటైర్ అయిన అశ్విన్ స్థానంలో పంత్‌కు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది.

## బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్.. తొలి ఇన్నింగ్స్‌లో 273 రన్స్‌కు జింబాబ్వే ఆలౌట్



**న్యూఢిల్లీ:** రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా బాంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో పర్యాటక జింబాబ్వే కీలకమైన 82 పరుగల తొలి ఇన్నింగ్స్ లీడ్ సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 67/1 వద్ద సోమవారం రెండో రోజు ఆటను ప్రారంభించిన జింబాబ్వే మరో 206 పరుగులు జోడించి 273 పరుగులకు ఆలౌట్ అయింది. జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (57), సీన్ విలియమ్స్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా, వికెట్ కీపర్ న్యాషా మయవో (35), వెస్లీ మెదెవెరె (24), రిచర్ట్ నగరవ (28 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. మిగిలిన బ్యాటర్లలో బెన్ కర్రన్ 18, నిక్ వెల్చ్ 2, కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ 8, వెల్లింగ్టన్ మసకద్జ 6, ముజరబానీ 17, న్యాయుచి 7 పరుగులకు ఔటయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ 5 వికెట్లుతో చెలరేగగా, నహీద్ రాణా 3 వికెట్లు, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. అంతకు ముందు జింబాబ్వే బౌలర్లు రెచ్చిపోవడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. ముజరబానీ, వెల్లింగ్టన్ మసకద తలో 3 వికెట్లు, న్యాయుచి, మదెవెరె చెరో 2 వికెట్లు తీసి బాంగ్లాదేశ్ సొంతగడ్డపై భారీ దెబ్బకొట్టారు. బంగ్లాదేశ్‌కు సొంత గడ్డపై ఇది నాలుగో అత్యల్ప స్కోర్ కావడం విశేషం. బంగ్లా ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్ (56) అర్ధ సెంచరీతో రాణించగా, కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో (40), జాకీర్ అలీ (28), మహ్మదుల్ హసన్‌రాయ్ (14), షద్మాన్ ఇస్లాం (12), హసన్ మహమూద్ (19) రెండంకెల స్కోర్లు చేశారు. స్టార్ ప్లేయర్ ముష్ఫికర్ రహీం 4, మెహిది హసన్ మిరాజ్ 1, తైజుల్ ఇస్లాం 3, నహీద్ రాణా డకౌటయ్యారు. ఖలీద్ అహ్మద్ 4 పరుగులతో అజేయంగా నిలిచాడు.

## వరల్డ్ కప్ షూటింగ్‌లో.. భారత్‌కు రెండు రజతాలు



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య రెండో ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్ షూటర్లు అద్భుత ప్రదర్శనను కనపరుస్తున్నారు. పెరూలో భారతీయ కాలమాన ప్రకారం సోమవారం జరిగిన టోర్నీలో భారత్ షూటర్లు రెండు రజత పతకాలను సొంతం చేసుకున్నారు. దీంతో ఇప్పటి వరకూ భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి 6 పతకాలతో మూడో స్థానంలో ఉంది. ఇక పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో అర్జున్ బాబుటా, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్ పాటిల్-ఆర్య బోర్సె రజత పతకాలు సాధించారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో అర్జున్ బాబూటా 252.3 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో 253.4 పాయింట్లతో చైనా షూటర్ షెంగ్ లీహావో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. హంగేరీకి చెందిన పెనీ మార్టన్ 229.8 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించాడు. ఇక ఫైనల్‌కు చేరిన మరో భారత్ షూటర్ రుద్రాంక్ష్ పాటిల్ 104.8 పాయింట్లతో చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఫైనల్లో పాటిల్- ఆర్య ద్వయం 11-17తో నార్వేకు చెందిన జంట జెనెట్ హెగ్-జాన్ హెర్మన్ హెగ్ చేతిలో ఓడిపోయింది.

# వాణిజ్యం

## నకిలీ రూ.500 నోట్లతో జాగ్రత్త: హోంశాఖ హెచ్చరికలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారు చేసిన రూ.500 దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డిఆర్ఐ, ఎఫ్ఐయు, సిబిఐ, ఎన్ఐఎ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలా వరకు అసలు నోట్లు లాగే ఉన్నట్లు వెల్లడిం చింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది. కాకపోతే ఈ నోట్లలో ఒక చిన్న స్పెల్లింగ్ తప్పు ఉందని, దీనిని గుర్తించడంలో అదే కీలకమని పేర్కొంది. రిజర్వ్ పదంలో 'ఇ' బదులు 'ఎ' పడినట్లు వెల్లడించింది. ఈచిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చ రించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తిం చడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.



## సెన్సెక్స్, నిఫ్టీలకు ఎఫ్ఐఐల ఊతం

**ముంబై, ఏప్రిల్ 21:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ మన మార్కెట్లు మాత్రం పరుగులు పెడుతున్నాయి. అమెరికా టారిఫ్‌ల ఆందోళనల ప్రభావం తగ్గుముఖం పట్టడం, సాను కూల త్రైమాసిక ఫలితాలు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు తిరిగి రావడం సానుకూల సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో సెన్సెక్స్ మళ్లీ 79వేల మార్కు దాటగా, నిఫ్టీ 24వేల ఎగువన ముగి సింది. బ్యాంకింగ్ రంగ షేర్లు రాణిస్తుండటంతో బ్యాంక్ నిఫ్టీ 55 వేల మార్కు దాటింది. 55,304 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని నమోదు చేసింది. సెన్సెక్స్ ఉదయం 78,903.09 పాయింట్ల తో లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రా డే 79,635.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి చివరకు 855 పాయింట్ల లాభంతో 79,408.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 273.90 పాయింట్ల లాభంతో 24,125.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.13గా ఉంది. టెక్‌మహీంద్రా, ఇండస్‌ఇండ్‌బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రాఅండ్‌మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు రికార్డు స్థాయిలో 3397 డాలర్ల వద్ద కొనసాగుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ సానుకూల త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో బ్యాంకింగ్ రంగ స్టాక్స్ రాణించాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరిగాయి. గత వారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ.8,472 కోట్ల పెట్టుబడులు పెట్టారు. భారత్, అమెరికా మధ్య త్వరలోనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పం దం కుదిరే అవకాశం ఉన్నట్లు వస్తున్న కథనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపర్చాయి. ఏప్రిల్ 23 నుంచి ఇరు దేశాల మధ్య దీనిపై చర్చలు జరగనున్నా యి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలపడుతోంది. నేటి ట్రేడింగ్‌లో రూపాయి 25 పైసలు బలపడి 85.05గా కొనసాగుతోంది. అటు చమురు ధరలు క్షీణించడం కూడా మార్కెట్ ర్యాలీకి ఓ కారణమైంది.



## ఎఐతో నిరుద్యోగ ఉపద్రవం: బిల్‌గేట్స్, ఒబామా

**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** ఈ సాంకేతిక యుగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, విద్య, కస్టమర్ సర్వీసెస్ వంటి విభాగాల్లో ఇప్పటికే ఎఐ ఆధారిత ఆటోమేషన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో వేగంగా పనులు పూర్తవుతున్నా, కొన్ని సమస్యలూ లేకపో లేదు. ముఖ్యంగా ఎఐ రాకతో ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొంది. తాజాగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్త పర్చారు. కృత్రిమ మేధతో రాబోయే రోజుల్లో కోట్లాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని అన్నారు. ఫలితంగా నిరుద్యోగం భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇది ఏఐ యుగం.. జ్ఞానంపై



సమాజం దృక్కోణాన్ని సమూలంగా మార్చే శకం. ఇప్పటి వరకు గొప్ప గొప్ప డాక్టర్లు, టీచర్ల మేధ అద్భుతం అని కొనియాడాం. కానీ, ఎఐ రాకతో రాబోయే దశాబ్దకాలంలో వీరికి ఉండే జ్ఞానం ఉచితంగా, అందరికీ అందుబాటులోఉంటుంది. ప్రస్తుతం మన జనాభాకు సరిపడావైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణుల కొరత ఉంది. దీంతో ఎఐతో లభించే మెడికల్ సలహాలు, టీచింగ్‌క్లాస్‌లు అందరికీ నచ్చుతాయి. కానీ, ఇది కాస్త భయానకమైన విషయం. ఇదంతా పక్కనబెడితే.. మరి ఉద్యోగాల సంగతేంటి? కనీసం వారానికి రెండు,మూడురోజులైనా పని చేయగలమా? అని బిల్‌గేట్స్ అన్నారు. అయితే, కొన్ని విషయాల్లో ఎఐ సమస్యలను పరిష్కరిస్తోందని టెక్ దిగ్గజం తెలిపారు. కృత్రిమ మేధతో కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయని, పనులు వేగవంతమవుతున్నాయని పేర్కొన్నారు. ఎఐ మరింత ప్రభావవంతంగా, వేగంగా అందుబాటులోకి వస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఆటోమేషన్‌కు అడ్వాన్స్‌డ్ వెర్షన్. అయితే, కేవలం తయారీరంగాన్ని మాత్రమే ఆటోమేటిక్ చేయట్లేదు. రోబో చేతులను ఉపయోగించినట్లు కాదు. ఉన్నత స్థాయి మేధోపరంగానూ అనేక పనులు చేస్తోంది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలపర్లు చేసే 70శాతం పనులను ఎఐ చేయగలదు. నిపుణులైన ఉద్యోగులు, మంచి జీతభత్యాల గురించి మాట్లాడు కునేటప్పుడు ఎఐ రాక కాస్త గందరగోళానికి గురిచేస్తుంది. కృత్రిమ మేధ వినియోగం పెరిగితే చాలాఉద్యోగాలు గల్లంతే.

## లక్షకు చేరువలో బంగారం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** అంతర్జాతీయంగా నెలకొన్న డిమాండ్ కారణంగా బంగారం ధరకు మళ్లీ రెక్కలు వస్తున్నాయి. అమెరికా, చైనా మధ్య వాణిజ్య పోరు, డాలర్ బలహీన పడడం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపుతుండడంతో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర పెరుగుతూనే ఉంది. దీన్ని అనుసరించి దేశీయంగానూ పసిడి ధర పరుగులు పెడుతోంది. బులియన్ మార్కెట్‌లో 10గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.99,600 పైనే పలుకుతోంది. రూ.లక్షకు కాస్త దూరంలో నిలిచింది. అటు వెండి సైతం కిలోరూ.98 వేలుగా ఉంది. అటు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి తొలిసారి రూ.96వేల మార్కు దాటింది. జూన్‌నెల డెలివరీ కాంట్రాక్ట్స్‌లో 10గ్రాముల పసిడి ఒక్క రోజులోనే రూ.1493 మేర పెరిగి ఇంట్రాడేలో 96,747 రూపాయల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు 3,393 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంత వరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని అనలిస్టులు చెబుతున్నారు.

## షాంఘై షాపింగ్ మాల్‌లో గోల్డ్ ఎటిఎం

**ముంబై, ఏప్రిల్ 21:** భారతదేశంలో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. చైనా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం కూడా ఆవిష్కరణ పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. సాధారణంగా జ్యువెలరీ షాపుల్లో, ఇతర రుణ సంస్థలలో బంగారం ఇచ్చి డబ్బులు తీసుకోవడం వంటివి చూసే ఉంటారు. కానీ మీరు ఎప్పుడైనా బంగారు ఎటిఎం గురించి విన్నారా లేదా చూశారా? చైనాలోని అతిపెద్ద నగరమైన షాంఘైలోని ఒక పెద్ద షాపింగ్ మాల్‌లో ఇలాంటిదే కనిపించింది. ఇది షాంఘైలో మొట్టమొదటి బంగారు ఏటీఎం. ఈ ఎటీఎం ప్రజలకు ఆకర్షణ కేంద్రంగా మారింది. ఈ ఎటిఎం 1,200 డిగ్రీల సెల్సియస్ వద్ద బంగారాన్ని కరిగించి, బంగారం స్వచ్ఛతను దాని ప్రత్యక్ష ధరతో పాటు చూపిస్తుంది. దీని తరువాత రేటు ప్రకారం తిగిలీ నుండి నగదు బయటకు వస్తుంది. దీని ద్వారా మీరు బ్యాంకు నుండి డబ్బును కూడా బదిలీ చేయవచ్చు. ఈ ఏటీఎంను వినియోగదారులు ఎంతగానో ఇష్టపడుతున్నారు. ఈ ఎటీఎం నుండి బంగారం లావాదేవీ చాలా సులభం. ముందుగా ఈ యంత్రం బంగారాన్ని తూకం వేస్తుంది. ఇది బంగారం 99.99 శాతం స్వచ్ఛమైనదా కాదా? అని తనిఖీ చేస్తుంది. కానీ దీని నుండి ఒక చిన్న సర్వీస్ ఛార్జీ కూడా కట్ అవుతుంది. భారతదేశంలో బంగారాన్ని శ్రేయస్సు, భద్రతకు చిహ్నంగా పరిగణించినట్లే, చైనాలో కూడా దీనిని అలాగే పరిగణిస్తారు. ప్రజలు బంగారాన్ని పెట్టుబడిగా కూడా ఉపయోగిస్తారు. మీడియా నివేదికల ప్రకారం, ఈ ఏటీఎం ను షెన్‌జెన్‌కు చెందిన కంపెనీ కింగ్‌హుడ్ గ్రూప్ తయారు చేసింది. ఈ ఎటిఎం చైనాలోని 100కి పైగా నగరాల్లో ఏర్పాటు చేయబడింది. ఇది మాత్రమే కాదు. షాంఘైలో కూడా మరో బంగారు ఎటీఎం ఏర్పాటు చేయబోతున్నారు. ప్రజలు దీన్ని చాలా ఇష్టపడుతున్నారని ఇది స్పష్టంగా చూపిస్తుంది. ఇప్పుడు కస్టమర్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా బంగారాన్ని సులభంగా అమ్మవచ్చు. ఈ బంగారు ఎటీఎం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియోపై జనాలు ఒకరి తర్వాత ఒకరు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై ఒక యూజర్, వావ్, త్వరలో భారతదేశంలో గోల్డ్ ఎటిఎం చూస్తామని ఆశిస్తున్నాను" అని అన్నాడు.



## కొత్తగా 84 లక్షల డీమ్యాట్ అకౌంట్లు

**ముంబై, ఏప్రిల్ 21:** గత ఆర్థిక సంవత్స రంలో దేశీయ కేపిటల్ మార్కెట్లు జోరు చూపడం పలువురు ఇన్వెస్టర్లకు జోష్‌నిచ్చింది. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఇలో నికరంగా 84 లక్షల డీమ్యాట్ ఖాతాలు కొత్తగా జమయ్యాయి. వెరసి మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 4.92 కోట్లకు చేరింది. ఇందుకు ప్రధానంగా మార్కెట్లు జోరందుకోవడానికి తోడు డిజిటల్ బ్రోకరేజీ సంస్థలు దోహదం చేశాయి. కొత్తగా జత కలిసిన ఖాతాలలో గ్రో, ఏంజెల్‌వన్ నుంచే 57శాతం నమోదయ్యాయి. 34 లక్షల డీమ్యాట్ ఖాతాలు గ్రో నుంచి ఓపెన్ కాగా, ఏంజెల్ వన్ నుంచి 14.6 లక్షల ఖాతాలు జమయ్యాయి. అంటే 84 లక్షల కొత్త ఖాతాలలో ఈ రెండు సంస్థల నుంచే 48.6 లక్షల ఖాతాలు జత కలిశాయి. ఈ బాటలో ఇన్వె స్టర్లు మరో బ్రోకింగ్ సంస్థ జిరోధా నుంచి 5.4 లక్షల ఖాతాలు తెరిచినట్లు ఎన్ఎస్ఇ గణాంకాలు వెల్లడించాయి. మొబైల్ ఆధా రిత సరళీకృత లావాదేవీల కారణంగా ఇన్వెస్టర్లు డిజిటల్ బ్రోకరేజీలను ఆశ్రయిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోద్వితీయ,తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల నుంచి ఇన్వెస్టర్లు డిజిటల్ ప్లాట్ ఫామ్స్ ద్వారా లావా దేవీలకు ఆసక్తి చూపుతు న్నట్లు వివరించారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps